

ఆంధ్రసచిత్రవారపత్రిక


26-5-72


50 పైసలు






నేను ఈదగలను - నేను ఈదగలను
అంటే - నిజమేనను
కున్నా!


మీ సభకి అధ్యక్షత వహించడానికి
నాకు తీరికుండదు - దయచేసి మరొకళ్లని
చూసుకోండి!


మా ఆవిడ బావిలో పడిందోయ్ -
ఇక బచ్చిపోయినట్టే!


అమ్మా! అమ్మా! మన పక్కింటి
మామయ్యగారు బస్సుకింద
పడి చనిపోయారే!!
ఫర్వాలేదురా! ఆయన
జీవితభీమా చేశారు!


ఏదో బహాటి వండుదూ-
ఇప్పుడు బజారెళ్లి
కూరలు పట్రాలేను-
తలనొప్పిగా వుంది!
మా ఇంటికొస్తావ్ ఒరేయ్ -
పేకాడుకుందాం!
ఇంకా ఆలస్యం
దేనికి - పద పోదాం!


ముందు
సీట్లపై
కాళ్లుపెట్టరాదు
ఎవరన్నా వద్దన్నపని
చేయడమే మావాడి ధ్యేయం-
తమరు మరోలా
భావించకండి!



గులాబి పూగుత్తిని ప్రతి రోజూ
మీ కుటుంబమునకు మీ రెట్లా
Binaca
ఇవ్వగలరు?
క్రొత్త బినాకా రోజ్ టాల్క్ తో
బినాకా
ఇంటిల్లిపాదికీ ఇష్టమైన టాల్క్

ముఖచిత్రం

'తాసీల్దారుగారి అమ్మాయి' చిత్రంలో తన నటనా కౌశలమును ప్రదర్శించి ఆంధ్రప్రేక్షక హృదయాల నుర్రూతలూగించిన అందాల హీరో శ్రీ శోభన్‌బాబుగారి ముఖచిత్రం ఈ వారం ఆంధ్ర పత్రికకు ప్రత్యేక 'శోభ'ను జేకూర్చినదనటములో సందేహము లేదు.

కె. విజయ భాస్కర్, (కర్నూలు)

* * *

నటసామ్రాట్, పద్మశ్రీ అక్కినేని నాగేశ్వరావుగారు అన్నట్లు, 'తెలుగు పరిశ్రమకి పెద్ద హోప్' అయిన శోభన్‌బాబు ముఖచిత్రం సాక్షాత్తు శ్రీరామచంద్రుడిలా కళ్ళకు కట్టినట్లుగా యుంది.

అతీఫుద్దీన్ అహమద్, (సుల్తానా బాద్)

* * *

28—4—72 పత్రిక ముఖచిత్రం చాల ఆకర్షణీయంగా వుంది. ఈ కలియుగములో గూడ శ్రీరాముడు జన్మించెనా! అను ఆశ్చర్యమును కలిగించు చున్నది.

గులపల ప్రసాద్, (కాళహస్తి)

* * *

అన్నిటిగాని మెడల్‌గర్ల్ బొమ్మలు మన పత్రికు ఒక హైలైట్.

ముళ్ళపూడినరసింహమూర్తి, (పిటకొప్పాక)

* * *

రాజశ్రీ ముఖచిత్రం చాలా నిండుగా ఉంది. ఈ పత్రికలో కథలన్నీ చాలా బాగున్నవి. ముఖ్యంగా కామేశ్వరిగారి 'కుక్కతోక' అన్న కథ చాల బాగుంది. రాముం పాత్ర చాలాచక్కగా చిత్రీకరించారు. బ్రహ్మచారులంతా రామంలా ఆలోచిస్తే ఎంత బాగుండును.

మిస్ హేమలత, (పార్వతీపురం)

వ్యాసాలు

21—4—72 సంచికలో చిరంజీవిని కుమారి గారు రెండుప్రదేశాల పరస్పరావగాహన గురించి ఒక సంస్థ చేసిన కృషి, తెలియచేయుటం అభి నించతగినదే. అయితే ఆఖరి పేరాలో కథ కి ఉన్న అర్థాలనిమాత్రం తీసారుకారు. 'భారత్—సోవియట్ ఒప్పందాన్ని దేశభక్త భారతీయులందరూ హర్షించారు' అన్నారు. హర్షించని వారు దేశభక్తులు కారన్నట్లు.

'సామ్రాజ్యవాద దురాక్రమణ దారుల కొలరి వెళ్ళిన అయుధమైన యుద్ధాన్ని' అని చిలక నినాదం పలికారు. 'ఈ రెండు శాంతి కాముక దేశాలు అసహ్యించుకుంటాయి.' అని సంయుక్త ప్రకటన కూడా చేసారు. ఆనిశేషణం తీసేసిన యుద్ధాన్ని మనదేశం మాట ఎలా ఉన్నా ఆ దేశం అసహ్యించుకుంటుందా ?· సామ్రాజ్య వాదులయినా సోవియట్ వాదులయినా జెకోస్లవేకియా అయినా దురాక్రమణకి వారివారి అర్థాలువేరు. మన అర్థాలు వేరు. వారి వేరులకి మన భావాలు మొక్కలు కాకూడదు. మరి ఈ అముక్తకంఠ ప్రకటన ఏల?

పాఠకులు సునాద వినోదులు పత్రికలు నినాద నిరోధకులు కావాలి మరి.

పన్నాల సుబ్రహ్మణ్యం భట్టు, (కాకినాడ)

సినిమా


విదురెళ్ళి పత్రిక కొని తెచ్చుకొనే వాళ్ళలో నేనొకదాన్ని. ఈ వారంపత్రిక గెటప్ చాలాబాగుంది. రాజశ్రీ ముఖచిత్రం బాగుంది. దానికన్నా లోపలి పేజీలోని హీరోక్కష్ణ, వాణిశ్రీల చిత్రం చాలా బాగుంది. 'సౌదామిని' కథలో చివరకు కోడలిగా చేసుకుంటానన్న భానోజీరావు మాటకు సౌదామిని కోపం తెచ్చుకొని వెళ్ళిపోయింది. సినిమా అవకాశాలకోసరం ప్రయత్నించే స్త్రీ నీతి నిజాయితీ అభిమానం, రోషం ఇత్యాదులకు అతీతమని ఈ రచయిత్రికి తెలియదు కాబోలు. సినిమా ప్రపంచంకూర్చి ఎవరైన రంగులచిత్రం వూహించుకుంటే ముఖ్యంగా ఆడవారికి అది దూరపు కొండలు నునుపుగానే ఉంటుంది.

—కె. విమల కుమారి, (తెనాలి.)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
శుక్రవారం : 26–5–72
శ్రీవిరోధినామ సం॥వైశాఖమాస॥శుద్ధ ద్వాదశి
సంపుటము : 65 సంచిక : 40
స్థాపితము:
1908
సంపాదకుడు
శివలెంక శంభుప్రసాద్
ఆంధ్రపత్రిక కార్యాలయము
1, తంబుచెట్టి వీధి, మద్రాసు - 1
విడి ప్రతి వెల 50 పైసలు

విషయానుక్రమణిక


వియత్నాంలో ఉద్ధత విధానం
యుద్ధవ్యతిరేకులైన అమెరికనులు
ఈ శిశువు నిమీరే సముదాయించండి
భూసంస్కరణల సంఘం
భూపరిమితుల సమస్య
ముఖ్యమంత్రుల సమావేశం
సమూలంగా ఛేదించే శాసనం
శ్రామిక ఉద్యమాలు
పెరిగి పోతున్న ఎడమ కాలు!
జనసంఘం
పెరుగుతున్న తీవ్రవాద ధోరణి

అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ సంజీవయ్య అస్తమయం

జాతస్య మరణం ధ్రువం — అని అన్నమాట వుంది. కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ సంజీవయ్య మృతికి లోక్‌సభలో సంతాపం ప్రకటిస్తూ ప్రధానమంత్రి ఈమాటే అన్నారు. అయితే ఆ మరణం హఠాత్తుగా వచ్చినప్పుడు, వ్యక్తియొక్క పూర్ణాయుర్దాయం చెల్లకుండానే వచ్చినప్పుడు దిగ్భ్రాంతి, దుఃఖము, పూర్తి జీవితం అనుభవించకుండానే జీవితంలో ఒక మహర్దశలో ఇట్లా మృత్యువు కనికరం లేకుండా ఆ వ్యక్తిపట్ల ఇట్లా కఠినంగా వ్యవహరించిందేమాఅన్నఆక్రోశముకల్గుతాయి.

శ్రీ సంజీవయ్య జీవితంలో ఉత్తమ దశలో వుండి, ఆరోగ్యం కొంత బాగు పడిందని అనుకుంటూవున్న సందర్భంలో, హఠాత్తుగా, ఇట్లా మృత్యువుచేత అపహరింపబడడంవల్ల వారి కుటుంబానికే గాక కాంగ్రెస్‌పార్టీకి, దేశానికిగూడా తీరని లోటు వాటిల్లింది. దేశ నాయకులలో శ్రీ సంజీవయ్యను అత్యంతము వ్యవహార దక్షత, వాకచక్యము ఉత్తమ ఇంగితము గల నాయకుడుగా చెప్పుకోవచ్చు. 1952 లో మొదటిసారిగా శ్రీమాన్ రాజాజీ మంత్రి వర్గంలో చేరిన దగ్గరనుంచి శ్రీ సంజీవయ్య రాజకీయ జీవితం ముందుకు పోవడమేగాని వెనక్కు చూచిందిలేదు. ఆయన ఆ జీవితంలో ఒడుదుడుకులు వుంటే వుండవచ్చుగాని అపజయాలు అంటూ లేవు. ఒక రాజకీయవేత్త అనుభవించగల హోదాలన్నీ ఆయన అనుభవించారు. అట్లా ఆయన ఆ జీవితం నిర్భరమై, అందులో అసంతృప్తికి, అక్రమానికి ఎడము లేనిదై కొనసాగింది. సమిష్టి మద్రాసు రాష్ట్రంలో మంత్రిపదవి, ఆంధ్ర రాష్ట్రంలో, ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిపదవులు నిర్వహించడమేగాక, ఆయన ఆంధ్రప్రదేశ్‌లో అతిక్లిష్ట సమయంలో ముఖ్యమంత్రి పదవి చేబట్టి, ఆ పదవిని ఉత్తమంగా నిర్వహించారు. కేంద్రంలో మంత్రిగా పనిచేశారు. కాంగ్రెసుపార్టీ క్లిష్టస్థితిలో వున్నప్పుడల్లా శ్రీ సంజీవయ్యయే ఆ పార్టీ అధ్యక్షులవుతూ వచ్చారు. ఇప్పుడు అధ్యక్ష పదవిలో వుండి— చివరిసారిగా కన్నుమూసేశారు.


శ్రీ సంజీవయ్య ఒక్క రాజకీయవేత్త మాత్రమేకాదు; సాహిత్యకారుడు; సాహిత్య ప్రేమికుడు గూడా. ఆయన స్వయంగా రచన చేసినవాడు. మంచివాఙ్మి. రాజకీయ ఉపన్యాసాలలో గూడా సాహిత్యపు పాలు పెట్టి జనరంజకంగా వ్యవహరించగల నేర్పు గలవాడు. అందుచేతనే ఆయన రాజకీయ జీవితానికి ఒక వన్నె, ఒకవెలుగు వన్నె ధత్తం అయి, దానికి ఔత్కృష్ట్యన్ని చేకూర్చాయి.

భారత రాజకీయ ప్రపంచంలో గాంధీ యుగం అనంతరం రాజకీయాలలో చేరి ఇట్లా స్వంత కృషితో, నేర్పుతో, వ్యవహార దక్షతతో దేశంమీద తమ ముద్రవేసిన రాజకీయవేత్తలు ఆట్టేమంది కన్పించరు. ఇందుకు శ్రీ సంజీయ్య దీక్ష, దేశభక్తి, దళితజనసేవానురక్తి, అన్నింటికిమించి ఆయన మంచితనము కారణాలుగా పేర్కొనవచ్చు. ప్రధానమంత్రి అన్నట్లు, అనాదిగా అణచబడుతూ వచ్చిన జాతిలో పుట్టి, దేశం రాజకీయ జీవితంలో హేమాహేమీల మధ్య ఉన్నత స్థానాలను సాధించడము, వానిని సమర్థతతో అధిష్ఠించడము, నిర్వహించడము తక్కువ విషయాలుకావు; అది సంజీవయ్య కార్యకారిత్వదక్షతకు ప్రథమ ఉదాహరణం.

ఇంకా ముందు జీవితం వింతోవుండగా అటువంటి వ్యక్తి హఠాత్తుగా మరణించడం దేశానికి పెద్దనష్టం అని వేరుగా చెప్పవలసిన పనిలేదు. ఆయన ఆంధ్రుడు కావడము, ఆయనవలన ఆంధ్రదేశపు కీర్తి దేశపు పలుమూలలా ప్రకాశానికి రావడము మొదలైన కారణాలవల్ల ఆంధ్రప్రదేశీయులకు శ్రీ సంజీవయ్య మరణంవల్ల వాటిల్లిన నష్టము, ఆపత్తి తీరనటువంటివి. ఆయన ఆత్మకు భగవంతుడు శాంతి చేకూర్చుగాక అని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి మా సంతాపాన్ని సానుభూతిని తెలుపుతున్నాము. (ఆంధ్రపత్రిక 9—5—72)



శ్రీ దామోదరం సంజీవయ్య



స్పిరిట్ లేని కథ

సుమన్

'నమస్కారం గురువుగారూ' అన్నాడు శిష్యుడు నమస్కారం పెట్టకుండానే.

గురువుగారు కండువా పరుచుకొని పద్మాసనం వేయబోయి మరిచిపోయి శీర్షాసనం వేసి ఎదురుగా వున్న శిష్యుడు తలక్రిందుగా కళ్ళజోళ్ళలో కనపడేసరికి తన తప్పుని తెలుసుకొని నాలుక్కొరుక్కొని మళ్లా పద్మా క్కూర్చొని—

'శిష్యా ఇవ్వాళ నీకు కథలు గురించి చెప్తాను,' అన్నాడు.

శిష్యుడు గబ గబా జేబులోనుంచి మడత పెట్టిన కాగితాన్ని తీసి వెనక జేబులోనుంచి పెన్సిల్ తీసి 'చెప్పండి గురూగారూ! యివ్వాళంతా ఋణపడి వుంటాను. ఎన్నాళ్ల నుంచో ఈ విషయమే అడగాలనుకొంటున్నాను తమ నోటిమీదుగానే అనేశారు' అన్నాడు భక్తి చూపించుతూ.

గురువుగారు ఒళ్ళంతా నవ్వేశారు నవ్వు గురూగారి శరీరంమీద ప్రతిచోటా కనపడింది. శిష్యుడు గురువుగారి నోటివంక ఆశ్చర్యంగా, ఆదుర్దాగా చూశాడు. గురువుగారు చెప్పటం మొదలుపెట్టేడు.

'ఇప్పుడు కథలు చాలమంది రాస్తున్నారు. చాల కథలు రాస్తున్నారు. చాల శ్రమతో రాస్తున్నారు. సహకార కథల కార్మాగారాలు, సహకార కథల స్టోర్సులు వెలిశాయి. వీక్లీలు, మంత్లీలు, అటూ యిటూ చెందని పక్షాలు — యిలా ఎన్నో పత్రికలు కథల్తోనే తమపొట్ట కప్పుకొంటున్నాయి. బాగానే వుంది. కాని ఎక్కువ కథల్లో స్పిరిట్ వుండటంలేదు. కథల్లో స్పిరిట్ వుండాలి. స్పిరిట్ లేని కథ చదివినట్టుండదు. అది అసలు కథే కాదు. చివరకు కాకరకాయ కూడా కాదు. ఆ కథ కంచి వెళ్ళబోయి రామేశ్వరం వెళ్తుంది. కాబట్టి కథల్లో స్పిరిట్ వుండాలి

స్పిరిట్ లేని కధ

స్పిరిట్' అన్నాడు గురువుగారు. చివరిసారి గట్టిగా అని పొడుం ఓ పట్టు పట్టారు.

'అంటే ఏమిటి స్వామీ' అన్నాడు శిష్యుడు.

గురువుగారికి మాట తడబడింది. ఏదో అనబోతే పెదవులు కదల్లేదు. అటూ యిటూ బెదురు చూపులు చూసి మళ్ళా పొడుం ఓ పట్టు పట్టి 'అదే అదే' అన్నారు.

'అంటే వివరంగా చెప్పండి గురూ గారో' అన్నాడు శిష్యుడు వినయంగా వంగి. ఇక గురువుగారికి చెప్పక తప్పలేదు.

'స్పిరిట్ అంటే స్పిరిటే. దానికి రంగూ, రుచీ, వాసనా యిత్యాదులు వుండవు. లేకపోయినా వున్నట్లే వుంటుంది. కంటికి కనపడకపోయినా చూడొచ్చు. నువ్వు కాబోయే కథకుడివి గనక అనుభవం మీద సంపాదించు' అన్నాడు గురువు.

సంపాదించటానికి బయలుదేరాడు శిష్యుడు. ఎన్నో నదీతీరాలూ, సముద్రపు టొడ్డులు, కాలేజీలు, కాలేజిలు, మార్కెట్లు, రోడ్లు, చిల్లర దుకాణాలు — అన్నీ తిరిగి చివరకు ఓ బోర్డు దగ్గర ఆగిపోయాడు. బోర్డులో తెల్లటి రంగులో ఎర్రటి అక్షరాలతో 'ఇచట అన్నిరకాల స్పిరిట్లు అమ్మబడును' అని రాసివుంది.

శిష్యుడు ఆశ్చర్యపోయాడు. గురువుగారు స్పిరిట్ ఒకటే అన్నాడు. ఎన్నో రకాలు వుంటాయనలేదు. మరి వీడు 'అన్నిరకాల'

అని రాశాడు. ఇందులో ఏదో మిస్టరీ వుంది. గురువుగారికి అసలు తెలియదా? తెలిసి చెప్పలేదా? ఒకవేళ అన్నీ చెప్తే గురువుని మించిన శిష్యుడ్ని అయిపోతానని భయపడిపోయివుంటాడు...హ్హా...హ్హా...హ్హా' అనీ ఓ మాయలఫకీరు నవ్వు నవ్వి షాపులోకి వెళ్ళి 'స్పిరిట్' కావాలి' అన్నాడు.

'ఏం స్పిరిట్ సార్, డినేచర్డా, మెడికేటెడా, వేపర్డా, పెరేఫ్యూమ్డా ? — ఏది కావాలి సార్' అన్నాడు షాపువాడు. బోర్డు దగ్గర వెయ్యవలసిన తెల్లముఖం యిక్కడ వేసి తేరుకొని 'అదేనయ్యా కథలకు కావాల్సిన స్పిరిట్' అన్నాడు.

ఈసారి షాపువాడు తెల్లముఖం వేశాడు. చాలసేపు ఆలోచించి బుర్ర గోక్కొని 'ఇక్కడ అటువంటివేమీ వుండవు సార్' అన్నాడు బాధగా బేరం పోయినందుకు.

రోడ్డు మీద పడ్డ శిష్యుడికి అంతా అయోమయంగా వుంది. ఏమి చేయాలో తోచటంలేదు. ఆ స్పిరిట్ ఏమిటో ఎక్కడ దొరుకుతుందో అంతు బట్టటం లేదు. 'అనుభవం మీద సంపాదించు' అని గురువు ఆజ్ఞ. అనుభవం ఎలా వస్తుంది? తిరగటంవలన. తిరక్క బోల్డుమంది ఈ దేశంలో చెడిపోయారు. మగాడు బాగుపడటానికి తిరుగుతాడు. ఆడది చెడాలనుకొని తిరుగుతుంది. అంచేత


అనుభవించటానికి నేను తిరగాల్సిందే.' అని ఎన్నోరోజులు పగలనక, రాత్రనక, ఎండనక, తెగతిరిగాడు. కంటికి నిద్రలేదు. నోటికి తిండిలేదు, స్పిరిట్‌ని సాధించనిదే వెళ్ళకూడదనుకొన్నాడు. చిక్కాడు, శల్యం అయ్యాడు, గుడ్డలు చిరిగాయి. గెడ్డం మోకాళ్ళదాక పెరిగింది.

ఒకరోజు హఠాత్తుగా ఓ వ్యక్తి, ఆ గెడ్డాన్ని పట్టుకొని గుంజి విలేసి 'ఒరి నువ్వటా సుబ్బి — సన్యాసుల్లో ఎప్పుడు కలిసిపోయావు?' అన్నాడు. శిష్యుడు సుబ్బికి తలకొట్టేసినంతపనయింది. అతగాడు చిన్ననాటి స్నేహితుడు. ఒక్కొక్కక్లాసే ఎన్నో ఏళ్ళు చదివి ఐదుసార్లు తండ్రి అయ్యే నాటికి ఆ కాలేజీలో యింకా చదవ్వలసినవి రెండు క్లాసులుండటంవలన మానేసి ఎక్కడికో వెళ్ళిపోయాడు. ఆ స్నేహితుడ్ని చూస్తే శిష్యుడికి కొంచం ధైర్యంవచ్చింది. సాయం చేస్తాడని నమ్మకం ఏర్పడింది అందుకని. వాడేమన్నా కోపగించుకోకూడదని కోపాన్ని వాయిదా వేశాడు.

'ఒరేయ్ నాకు స్పిరిట్ కావాలిరా' అన్నాడు చేతులు పట్టుకొని. స్నేహితుడు అనుమానంగా చూశాడు.

'బాబ్బాబూ—యివి చేతులుకావు. నీకు పుణ్యం వుంటుంది. ఇక నాకు తిరిగే ఓపిక లేదు. ఆ స్పిరిట్ ఏదో యింత గొంతులో పోయి' అని బతిమాలకొన్నాడు. ఈసారి స్నేహితుడు పగలబడి నవ్వి 'ఒరేయ్

హారిరామ్



మామూలు మనిషి ఏదైనా పని చేస్తుంది. కాని సన్యాసుల్లో కల్సిన తర్వాత ముడిపదార్థాలు తప్ప పనిచేయవు. నువ్వు ఇంతగా బాగుపడతానని నువ్వు పరీక్ష పాస్సై నపుడుకూడ అనుకోలేదు. నా వెంట రా.' అన్నాడు.

శిష్యుడు పెంపుడుకుక్కలా వెంటబడ్డాడు. కొంచెంసేపటితర్వాత శిష్యుడు, స్నేహితుడు బారుగావున్న 'బార్'లో కూర్చొన్నారు. మధ్య టేబిల్ మీద రెండు మూడుగ్లాసులు ఒక సీసా వున్నాయి. సీసాలోది గ్లాసులోకి వంచి 'ఇక కొట్టేయ్' అన్నాడు స్నేహితుడు.

'ఇదేమిటి' అన్నాడు శిష్యుడు.

'స్పిరిట్ అంటే యిదేనోయ్ ఆలస్యం చేయక.'

'మరి స్పిరిట్ కనపడదే.'

'అదంతే కనపడదు. ఇందులో కల్సి వుంటుంది. దానికి రంగు, వాసనా వుండదు. వుంటుంది. కానికనపడదు. ఇక కొట్టేయ్'.


శిష్యుడికి బోల్డు సంతోషం కల్గింది. సరిగ్గా గురువుగారు యిదే మాటలు చెప్పాడు. కాబట్టి ఇందులో నిజంవుంది. ఇదే నిజమైన 'స్పిరిట్' అని గబగబ గ్లాసు గటగట తాగేసేడు. తర్వాత శిష్యుడు స్నేహితుడ్ని పంచరంగుల్లో చూశాడు. బూతులు తిట్టాడు. గ్లాసులు పగలగొట్టాడు. టేబిల్ని తిరగబెట్టాడు. సర్వర్ని కొట్టాడు. బార్ వాడిచేత తిట్లు తిన్నాడు. చేతులతో పాకుతూ బయటకు నడిచాడు, శిష్యుడ్ని చూసి స్నేహితుడు పశ్చాత్తాపపడి, ఆ పశ్చాత్తాపంలో మరో రెండు గ్లాసులు వేసి స్నేహితుడ్ని ఇంటికిచేర్చి 'ఇపుడు నీకు స్పిరిట్ బాగా వస్తుంది, రాసుకో పో' అని తను పోయాడు.

స్పిరిట్ అనగానే శిష్యుడికి ఒళ్ళు గగుర్పొడిచి గబగబ కాగితాలు తీసి ఏవేవో వ్రాశాడు, కొన్నాళ్ళకది 'మ్యాగజైన్'లంటి 'మాగజైనులో' పడింది. దానిని చదివి బోల్డుమంది బాగా రాశాడన్నారు. మెచ్చుకొన్నారు. ఇంకా చాలామంది 'ఈ కథ చదివితే తాగక్కర్లేదన్నారు.' ఇది గొప్ప ఎక్స్‌పెరిమెంట్ అన్నారు కొంతమంది.

ఆ వచ్చిన పేరుకి శిష్యుడి చాలా సంతోషించాడు. గర్వంగా తిరిగాడు. గురువుకి పంగనామాలు పెట్టేశాడు.

తర్వాత శిష్యుడు కథలు ఇప్పుడు రాయటమూ లేదు, తాగటం మానటమూ లేదు.

పిల్లలు - ఆరోగ్యము



మొదటి మూడు సంవత్సరాలు జీవితంలో అతిముఖ్యమైనవి!

డాక్టర్ కె వెంకటేశ్వరరావు

మనదేశంలో ప్రతి వెయ్యి ప్రసవాలకి నలభై మంది పిల్లలు ఒక సంవత్సరం నిండకుండా చనిపోవడం జరుగుతున్నది. పిల్లలకి పోషణ సరిగా లేకపోవటమే దీనికి ముఖ్యకారణం.

అంటువ్యాధుల వల్ల చాలా మంది పిల్లలు ప్రాణాలు కోల్పోకపోయినా తాత్కాలికమో, నిరంతరమో అయిన శారీరక బాధలకి గురి అవుతున్నారు.

ఈ మొదటి మూడు సంవత్సరాలలోనే ప్రతి మనిషికీ మెదడు పూర్తిగా పెరుగుతుంది. ఈ కాలంలో పిల్లలకి సరైన పోషణ లేకపోవటం వల్ల వారి గ్రహణశక్తి లోపించడం, మానసికమైన దౌర్బల్యానికి గురి కావటం జరుగుతుంది. ఈ వయసులో వారికి సరైన పోషణ ఉండేలా చూడటం పెద్దల ముఖ్య కర్తవ్యం.

మొదటి మూడేళ్ళలోనే వాంతులు, విరోచనాలు పిల్లలకి రావడానికి ఎక్కువ అవకాశం ఉంది. వాంతులు, విరోచనాలు ఎక్కువగా అవుతున్నప్పుడు వెంటనే వైద్యుని సహాయం పొందాలి. అలా తక్షణ వైద్య సహాయం చేయించనందు వల్ల చాలా మంది పిల్లలు చనిపోవడం జరుగుతున్నది.

ఈ వయసులో పిల్లలు ఒకచోట నిలకడగా ఉండరు. కుంపట్ల మీద మరుగుతున్న నీళ్ళని మొదలైన వాటిని మీద పోసుకోడం, రోడ్ల మీదికి పరిగెత్తి ప్రమాదాల పాలు గావటం, మెట్లు ఎక్కి అక్కడ్నుంచి పడి ఆపదకి గురి కావటం, కొన్ని సందర్భాలలో ప్రాణాపాయం సంభవించడం జరుగుతున్నది. కాబట్టి పిల్లలు ప్రమాదకరమైన ప్రదేశాలకి వెళ్ళకుండా, మెట్లు మొదలైనవి ఎక్కకుండా పెద్దలు జాగ్రత్త తీసుకోవాలి.


పిల్లలకి మూడు సంవత్సరాలు నిండే వరకూ ఈ ప్రమాదాల నించి వారిని కాపాడితే శిశు మరణాలని చాలా వరకూ తగ్గించవచ్చు.

డాక్టరు వద్దకి వెళ్ళేటప్పుడు గుర్తుంచుకోవలసిన ముఖ్య విషయాలు :

1. పాప పుట్టినప్పటి బరువు. 2. పూర్తిగా నెలలు నిండిన తర్వాత పుట్టిందా లేక ముందే పుట్టిందా? 3. పాప పుట్టగానే బాగా ఏడ్చిందా? 4. పుట్టినప్పుడు బిడ్డ నీలం రంగుగా ఉందా లేక మామూలుగా ఉన్నదా? 5. మామూలు ప్రసవమా లేక ఆయుధాన్ని ఉపయోగించడంగానీ, ఆపరేషన్‌గానీ జరిగిందా? 6. పుట్టినప్పటినుంచి బిడ్డకి యిచ్చిన ఆహారం. 7. వ్యాధి నిరోధక ఔషధాలు, ఇంజక్షన్‌లు యిచ్చిన వివరాలు. 8. పుట్టినప్పటి నుంచి బిడ్డకి వాడిన మందులు వగయిరాల వివరాలు. 9. ఫిట్స్ మొదలైనవి వచ్చి ఉంటే ఆవి మొదలైన వయస్సు, వచ్చినప్పుడు ఎంత సేపు ఉంటాయన్నది, వచ్చిన తర్వాత పిల్లల మానసిక ప్రవృత్తి ఎలా ఉంది? అన్న విషయాలు. 10. వాంతులు విరోచనాలు, అవుతుంటే ఆవి మొదలైనప్పటి నుంచి వాడిన, వాడుతున్న మందులు వగయిరాల వివరాలు.

ఈ విషయాలన్నీ పిల్లలని డాక్టరు దగ్గరకి తీసి కెళ్ళేటప్పుడు ప్రతివారూ ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ఆధునిక అవసరాలని అర్థంచేసుకున్న విద్యావేత్త



డాక్టర్ రామచంద్రన్

తాము చదువుకున్న విద్యాసంస్థల పేర్లు చెప్పుకుని చాలామంది గౌరవం తెచ్చుకుంటూ ఉంటారు. కొందరు తమ కృషివల్ల, ప్రతిభవల్ల తాము చదువుకున్న సంస్థలకే గౌరవం తీసుకు రాగలరు!

ఇటువంటిదే ఇటీవల జరిగింది. అమెరికాలోని పర్డ్యూ యూనివర్శిటీవారు అక్కడ చదువుకుని, ఆ విశ్వవిద్యాలయపు ఆశయాలకు అనుగుణంగా విద్యా, వైజ్ఞానిక, సాంకేతిక రంగాలలో అత్యుత్తమస్థాయిలో సేవచేస్తున్నందుకు ఒకరిని ఎన్నుకున్నారు. ఈవిధంగా ఎన్నిక అయినవారు డాక్టర్ ఆర్కాట్ రామచంద్రన్. వీరు మదరాసులో ఉండే 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' (ఐ. ఐ. టి.)కి డైరెక్టరు.

ఈ మే నెలలో వీరు అమెరికా వెళ్లి తమ విశ్వవిద్యాలయం వారివద్ద సన్మానం స్వీకరించాలి.

'అధిపతి'

డాక్టర్ రామచంద్రన్ ఒక సుప్రసిద్ధ విద్యాసంస్థకి అధిపతి; వారి తండ్రిగారు కీర్తిలో ఆయనకేమాత్రం తీసిపోనివారు— మదరాసు విశ్వవిద్యాలయానికి కొన్నిదశాబ్దాలుగా 'అధిపతి' అనతగ్గనట్లు ఉపాధ్యక్ష పదవిని అలంకరించిన సర్ లక్ష్మణస్వామి మొదలియారుగారు! అన్ని విధాలా తండ్రికి తగిన కొడుకు అనిపించారు.

అశ్రద్ధ :

విద్యాభ్యాసం నిత్యజీవితంలో ఒక ముఖ్యమయిన అంశమే అయినప్పటికీ అధిక [illegible]

మెంట్'లో ఉంచేస్తూ ఉంటారు. కాలేజీలలో చదువుకునే డాక్టర్లే మనకి మందులు ఇస్తారనీ, ఇంజనీర్లే మనకి అన్నివిధాలా అవసరమయ్యే వస్తునిర్మాణాలు చేస్తారనీ అంతగా అనుకోరనిపిస్తుంది! ఈ 'అశ్రద్ధ' కేవలం జనసామాన్యానికి సంబంధించినదే అయినప్పటికీ విద్యాసంస్థలలో కూడా జీవితానికి సంబంధించిన కొన్నిరంగాల విషయమయి ఒకరకం అశ్రద్ధ ఉంటున్నదని చెప్పాలి. పారిశ్రామికమయిన విషయాలకి సంబంధించినంతవరకూ ఇది చాలా ప్రమాదకరమయిన 'అశ్రద్ధే' అవాలి. మన దేశం కొన్ని శతాబ్దాలు వెనకబడిపోయి ఇప్పుడిప్పుడే ముందుకి రావాలని ప్రయత్నిస్తోంది. ఈ ప్రయత్నానికి పరిశ్రమలు ఎంతో తోడ్పడుతాయి. పరిశ్రమలు పురోగమించాలంటే మేధావుల సహకారం **ఎంతయినా అవసరం; అందులోనూ సాంకేతిక విద్యాభ్యాసం కల మేధావుల సహకారం మరింత అవసరం!**

దీనిని గుర్తించిన కొద్దిమంది ప్రముఖ విద్యావేత్తలలో డాక్టర్ రామచంద్రన్ ఒకరు.

మెకానికల్ ఇంజనీరు

అసలు ఆయన చదువుకున్నది మెకానికల్ ఇంజనీరింగ్—మదరాసులో బి. ఇ. (ఆనర్స్) 1943, పర్డ్యూ యూనివర్శిటీ ఎమ్. ఎస్. సి 1947, పి. హెచ్. డి. 1949. ఈ శాస్త్రాన్నే ఆయన ప్రధానంగా బోధిస్తూ ఉంటారు. అయితే, 1950—57 దాకా బెంగుళూరు ఇన్‌స్టి [illegible]

చివరి రెండు సంవత్సరాలూ కొత్తగా నెలకొల్పబడిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ మేనేజిమెంట్‌కి కూడా 'హెడ్'గా ఉన్నారు. పారిశ్రామిక నిర్వహణ ఆధునిక సాంకేతిక ప్రధానమయిన సమాజానికి ఎంత ముఖ్యమో వేరే చెప్పనక్కరలేదు. మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్‌గా ఉంటున్న డా. రామచంద్రన్‌గారే ఈ శాఖకి కూడా అధిపతి అయ్యారంటే ఈ రంగంలో వారు ఎంత ప్రథములో ఊహించవచ్చు. ఇటువంటి బాధ్యత వారే నిర్వహించవలసి వచ్చిందని కూడా ఊహించవచ్చు!

'ప్రాధాన్యం'

1967 లో డా. రామచంద్రన్ మదరాసు ఐ. ఐ. టి. కి డైరెక్టరు అయ్యారు. ఈ సంస్థలోనూ వారు పారిశ్రామిక నిర్వహణకి మంచిస్థానం ఇచ్చారు. నేడు ఈ సంస్థలో పారిశ్రామికమయిన విషయాలకి ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. అక్కడ విద్యార్థులకి పరిశ్రమలతో సంబంధాలు కలిగేట్లు చేస్తూ ఉంటారు.

ఐ. ఐ. టి. లో 'హ్యూమానిటీస్' శాఖ చాలా పెద్దది. ఇందులో పారిశ్రామిక నిర్వహణకి మంచి స్థానం ఉంది. ఇదంతా డా. రామచంద్రన్‌గారి ప్రోత్సాహం వల్లనే అనవచ్చు.

డా. రామచంద్రన్‌గారికి ప్రపంచంలో వివిధ సంస్థలవారు చేసిన సన్మానాల జాబితా ఇస్తే కొన్ని పేజీలు నిండుతాయి. [illegible] రంగమయిన మెకానికల్ ఇం[illegible]

వీరింగ్‌లో వారుచేసిన కృషి వివరాలు అంత ఇన్నా పెద్ద జాబితా తయారుచెయ్యగలవు, జనసామాన్యానికి అర్థంకావు కూడా...

ఇం. ఇ. చె. డైరెక్టరు చాలా నిరాడంబరమయిన వ్యక్తి. శర్వీరోమరేగా పని చేస్తూనే ఉంటారు, అందరిపట్లా ఆదరాన్ని చూపుతూ వారి గౌరవాభిమానాలకి పాత్రు లవుతూనే ఉంటారు.

పర్డ్యూ యూనివర్సిటీవారు ఆయనకి చేస్తున్న సన్మానం భారతదేశానికి గర్వ కారణం అంటే అతిశయోక్తి కాదు.

—'ఎల్వీఎల్లెన్నెన్'

ఒక వారం విపరీతం పాఠకుడు

ప్రేమికుల ఆత్మహత్య

నామక్కల్ కు చెందిన వో మానె మిల్లు యజమాని 40 ఏళ్ళ కాళీముత్తు, ఆయన ప్రేయసి 22 ఏళ్ళ పాప్పాతి విషం త్రాగి మరణించారట. 'మా చావుకు ఎవరూ బాధ్యులు కారు. మా ఇద్దర్నీ ఒకే చోట పాతి పెట్టండి. ఇదే మా కోరిక' అని వో చీటీ కూడా రాసి పెట్టాడట. కాళీముత్తు భార్య ఏనాడో చనిపోయిందట. పోయిన నెల 17వ తేదీన కాళీముత్తు తన కూతుళ్ళ పూంగోద్దై, లీలావతులకు వివాహం జరిపాడట. ఇంకా ఆయనకు వాలన్ అనే కూతురు ఇళంగో అనే కొడుకూ వున్నారట.

అక్రమసంబంధం - ఆస్తి - శిశుహత్య

నామక్కల్ కు చెందిన వో వూరిలో త్యాగరాజన్ అనే వివాహితుడు కాంతిమతి అనే వివాహితతో



అక్రమ సంబంధం పెట్టుకున్నాడట. తత్ఫలితంగా కాంతిమతి తన భర్తను వదలి వేసిందట. త్యాగరాజన్ మాత్రం తన భార్యను పుట్టింటికి పంపేసి కాంతిమతిని చేరదీశాడట. వీరిద్దరూ వో సంవత్సరం కలసివున్నాక, ఏప్రియల్ 21వ తేదీన కాంతిమతికి మగపిల్లవాడు పుట్టాడట. దానివల్ల త్యాగరాజన్ ఆస్తిపాస్తులన్నీ ఆ కుర్రాడికే చెందుతాయని భయపడి, త్యాగరాజన్ అత్తగారు ఆ పసిగుడ్డు పీక నొక్కి చంపేసిందట. ఈ దారుణ శిశుహత్యలో భాగస్వాములైన త్యాగరాజన్ తలిదండ్రులను అతని అత్తగారినీ పోలీసు ఖైదు చేయడానికి వెతుకుతున్నదట.—

హత్యకి దారితీసిన అక్రమసంబంధం

సెంగుళం అనే వూరిలో 26 ఏళ్ళ మునుసామి అనే అతని తమ్ముడు మురుగేశన్ యుద్ధంలో పని చేస్తూ, శలవమీద యింటికి వచ్చి, జకితా అనే అమ్మాయిని వివాహం చేసుకుని, మళ్ళీ యుద్ధానికి వెళ్ళిపోయాడట. బావగారింట్లోనే వుండిపోయిన జకితా పక్కింటి కన్నాన్‌తో కన్ను కలిపిందట. అనక కన్నాన్ భార్యతో స్నేహంచేసి, ఆమెకోసం వెళ్ళినట్టు పొద్దస్తమానూ వాళ్ళింటికే వెళ్ళేదట. ఒక రోజున కన్నాన్, జకితాలు ప్రేమాయణంలో వుండగా మునుసామి చూసి, చేతికందిన కొడవలితో వారిద్దర్నీ నరికాడట. విపరీతమైన గాయాలతో వారిద్దర్నీ ఆసుపత్రిలో చేర్చారట. మునుసామి మీద హత్యానేరం మోపిందట పోలీసు.

భార్యపై హత్యాప్రయత్నం

ఢిల్లీ షహదారాకు చెందిన సోహన్‌సింగ్ అనే ఆయన తన భార్య సురిందర్ కౌర్‌ను వో గదిలో బంధించి, మీద కిరసనాయిలుపోసి, నిప్పంటించాడట. కానీ విధివశాత్తు ఆమె చావు తప్పించుకొని, ఆసుపత్రిలో కోలుకుంటోందట. హత్యానేరం మోపి, పోలీసు సోహన్‌సింగ్‌ను అరెస్టు చేశారట— వాచురల్లీ.

నగలకోసం పిల్లలని చంపిన స్త్రీ

నిజామాబాదు జిల్లాకు చెందిన గోవింద్‌పేట అనే వూరిలో వో హరిజన స్త్రీ వో యిద్దరు పిల్లలను మాయచేసి, వూరవతలకు తీసుకువెళ్ళి, అక్కడ వాళ్ళిద్దరి ఒంటిమీదున్న నగలూ ఒలుచుకుని, అనక ఆ పిల్లల పీకలు నొక్కి చంపి, వో నూతిలో పారేసిందట. పోయిన్నెల 21వ తేదీన ఆ పిల్లల శవాలు నూతిలో తేలాయట. వూరివారంతా చేరి, పరిశోధించి ఆ హరిజన స్త్రీ చేత నిజాన్ని కక్కించి ఆమెను చితకబాది చంపేశారుట దారుణంగా.

కత్తిపోట్లతో కనిపించిన స్త్రీ శవం

పోయిన్నెల 26వ తేదీన బెంగుళూరు హొసహళ్ళి ప్రాంతంలో వో స్త్రీ శవాన్ని పోలీసు కనుగొన్నదట. శవానికి పీక, పొట్ట మొదలైన ప్రదేశాల్లో కత్తి గాయాలున్నాయట. ఈమె పేరు మునియమ్మని, 30 ఏళ్ళ వయస్సు; 50 ఏళ్ళ వెంకటప్ప అనే అతని భార్య అని తేలింది. ఈమెకు వో లారీ డ్రయివరుతో రహస్య ప్రేమాయణం జరుగుతూ వుండేదని కనుగొన్న పోలీసు అనుమానంమీద ఆమె భర్త వెంకటప్పను అరెస్టు చేశారట.

సంసారాన్ని దలేక సకుటుంబంగా ఆత్మహత్య


తిరుచ్చి సున్నంవారి వీధిలో నివసిస్తున్న 32 ఏళ్ళ పండరీనాథ్ కు తన సంసారాన్నీడవడం కష్టమనిపించి, వేరే గత్యంతరం లేక, కాఫీలో విషం కలిపి, తాను త్రాగి, తన భార్య సరోజకు, 8, 6, 4, 2 ఏళ్ళ వయస్సున్న పిల్లలు గోవిందరాజన్‌కు విజయ, రవి, జయలకూ కూడా యిచ్చాడట. దాంతో ఆ ఆరుగురూ చనిపోయారట. తలుపులు లోపలకు వేసుకుని యీ పని చేశాడటాయన.

పెళ్ళికొడుకుపై దొంగతనం కేసు— పెళ్ళికూతురి ఆత్మహత్య

నాగర్‌కోయిల్ ఈ శాంతిమంగళం అనే వూరిలో అంతోనిముత్తు అనే ఆయన తన 18 ఏళ్ళకూతురు మారియపుష్పానికి పెళ్ళి సంబంధం కుదుర్చాడట. తీరా కల్యాణం ఘడియలో పెళ్ళికొడుకును ఏదో దొంగతనం కేసు సందర్భంగా పోలీసులు అరెస్టు చేసి తీసుకుపోయారట. ఈ ఘాతుకానికి తట్టుకోలేక, పెళ్ళికూతురు మారియపుష్పం, ఆమె తల్లీ విషం త్రాగి ఆత్మహత్య చేసుకున్నారట.

తలలో ఈటె దిగినా డాక్టర్ కోసం 8 కి. మీ పరిగెత్తిన యువకుడు!

ఆఫ్రికా శాలిస్‌బరీలో వో ఆఫ్రికన్ యువకుడు తన భార్య ఆమె ప్రియునితో కలసివుండడం చూసి, ఆవేశంతో అతన్ని పట్టుకోబోయాడట, కానీ ఆ ప్రియుడు అతివేగంగా పరుగెత్తినా అంతంచేసేటందుకి యీయనా పట్టుదలతో కూడా పడ్డాడట. మధ్యమార్గంలో ఆ ఆఫ్రికన్ యువకుని తలలో వో యీటె వచ్చి దిగిందట. ఆ యీటె తిన్నగా అతని తలలో కన్ను వెనుకగా కంఠంవరకూ దిగిందట. దాంతో అతను తన మార్గాన్ని మార్చుకుని డాక్టరుకోసం ఎనిమిది కిలోమీటర్ల దూరం పరిగెట్టాడట. అక్కడ డాక్టరు అతని యీటెలాగేస్తే ఆసుపత్రిలో చేర్చారట. అంతలోటున తలలో యీటె దిగి, మెడవరకూ పోయినా, అతను బతికాడట.





పెరిగిన నిరోధ్ అమ్మకం!

1971 ఏప్రియల్ నుంచి 1972 ఫిబ్రవరి నాటికి పవిత్ర భారతదేశంలో నిరోధ్ అమ్మకం. 625.6 లక్షలకు పెరిగిందట. లోగడకన్నా యీ ఏడు 29.4 శాతం పెరిగిందట.

మాజీ ముఖ్యమంత్రి మామగారిని కత్తితో పొడిచిన కారుడ్రైవరు

శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి మామగారు గారి చిన వెంకయ్యని నరసారావుపేటలో ఆయన డ్రయివరు కత్తితో బుగ్గమీద తీవ్రంగా పొడిచాడట. డ్రయివరు కాయన మూడువందలు బాకీ వుండి అది యివ్వకుండా మరో డ్రయివరును పెట్టుకుని, అదేమంటే దుర్భాషలాడారని, తత్ఫలితంగా ఈ దారుణం జరిగిందని వార్త. ●

అవీ...ఇవీ

ఢిల్లీలో ముఖ్యమంత్రికి సన్మానం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావుగారికి న్యూఢిల్లీలోని మావులంకర్ హాలులో ఏప్రిల్ 16 వ తేదీ సాయంత్రం రాజధానిలోని తెలుగు వారందరు కలిసి ఘనంగా సన్మానంచేశారు. ఈ సభకి కేంద్రమంత్రి, కాంగ్రెస్ అధిష్ఠాన వర్గం నాయకులు అయిన శ్రీ ఉమాశంకర్ దీక్షిత్ అధ్యక్షతవహించారు. శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్, శ్రీ గంగాశరణసింహాగారు, శ్రీ పేరాల వెంకటరత్నం గారు ముఖ్యమంత్రి గుణగణాలని గురించి మాట్లాడారు. తెలుగులో, ఇంగ్లీషులో సన్మాన పత్రాలు బహూకరించారు.

సభానంతరం తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. రాము కృష్ణాపురంలోని తెలుగు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, రామాయణ కథని బుర్రకథగా చెప్పారు. రాజా— రాధారెడ్డి దంపతులు కూచిపూడి నృత్యాలని ప్రదర్శించారు. అనంతరం దక్షిణ భారత నటీనట సమాఖ్యవారు శ్రీ ఆదివిష్ణు రాసిన 'మంచుతెర' నాటకాన్ని ప్రదర్శించారు. (ఒ. వి.)

మదరాసు

సంగీత కళాశాల రజతోత్సవ.

మదరాసు సంగీత కళాశాల (గోపాలపురం, మదరాసు) వారి రజతోత్సవం ఏప్రిల్ 26 వ తేదీన జరిగింది. దీనికి తమిళనాడు గవర్నర్ శ్రీ కె. కె. షా అధ్యక్షత వహించారు. కళాశాల విద్యార్థి విద్యార్థినులు ప్రిన్సిపాల్ శ్రీ పార్థసారధిగారికోసం చేయించిన వెండి వీణని ఆయనే బహూకరించారు.

విద్యార్థి విద్యార్థినులు వివిధ వాద్యాలతో జంత్ర సమ్మేళనం చేశారు. ప్రొఫెసర్ పి. సాంబమూర్తి, శ్రీ బాలమురళీ కృష్ణ ఉపన్యాసాలు చేశారు. వివిధ ప్రముఖులు శుభ సందేశాలు పంపారు. (ఒ. వి.)

స్వర్ణాలయ కల్చరల్ ఎకాడెమి

స్వర్ణాలయా కల్చరల్ ఎకాడెమీ (మద్రాసు) కి మదరాసు హైకోర్టు న్యాయమూర్తి శ్రీ టి. రామప్రసాదరావు ఏప్రిల్ 13 వ తేదీన ప్రారంభోత్సవం చేశారు. సభికులకి ఎకాడెమీ అధ్యక్షుడు డబ్ల్యు. ఎస్. వెంకటరామానుజులు స్వాగతం చెప్పారు. కార్యదర్శి శ్రీ టి. మురుగేశన్ వందన సమర్పణ చేశారు. అనంతరం కామేష్ రాజామణి బృందంవారి లలిత సంగీత కచేరీ జరిగింది.

(ఒ. వి.)

* * *

అంతర విద్యార్థి మరియు యువరచయితల సంఘం 'ఊర్వశి' సంస్థ 'రాశి' నవల + కథలు) సంపుటి ఏప్రిల్ 18 వ తేదీన విశాఖపట్నం జిల్లా పరిషత్ హాలో ఆవిష్కరించింది.

(ఒ. వి.)

సినీ మాతారలు - ప్రభుత్వ విధానం!

సుప్రసిద్ధ ఆంగ్ల వార పత్రిక 'కరెంట్', (బొంబాయి) విలేఖరితో హిందీ నటుడు శ్రీ దిలీప్ కుమార్ అన్నాడుట— ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్లు తమ కర్తవ్యం నెరవేర్చటంలో తప్పులేదు. కాని, సినిమా పరిశ్రమపట్ల మాత్రం ఈ రకంగా మర్యాదలేకుండా ప్రవర్తించటంలో ప్రభుత్వం తప్పు విధానాన్ని అనుసరిస్తోంది.

సినిమా తారల పట్ల ప్రభుత్వం యొక్క అమర్యాదకరమైన ధోరణిని తామే రుచి చూచామని శ్రీ దిలీప్ కుమార్ అన్నాడుట. నిజం నేరయినప్పటికీ (స్టేట్) ఆర్థిక శాఖమంత్రి లోక్ సభలో తాను (దిలీప్ కుమార్) రు. 7లక్షలు, ఇన్‌కమ్‌టాక్స్ బాకీ ఉన్నట్లు చెప్పున్నారట. 'అసలు సంగతి ఏమిటంటే, నేను ప్రభుత్వానికి ఏమీ బాకీలేను. ఇన్‌కమ్‌టాక్స్ శాఖవారి మీద దావావేసి గెలిచాను.' అని ఆయన కరెంట్ విలేఖరితో చెప్పాడుట.

'అయినా పార్లమెంటులో ప్రభుత్వం వారు నేను బాకీ వున్నానని చెపుతున్నారు.' దిలీప్ కుమార్ ఈ విషయము (స్టేట్) ఆర్థిక మంత్రికి ఉత్తరం రాసినా ఏమీ ప్రయోజనం లేకపోయిందట.

(ఒ. వి.) ●



ఢిల్లీలో ఏప్రిల్ 16 న శ్రీ పి. వి. నరసింహారావుదికి జరిగిన సన్మానసభలో కూచిపూడి నృత్యప్రదర్శనచేసిన రాజారెడ్డి - రాధారెడ్డి దంపతులు. సన్మానసభకి శ్రీ ఉమాశంకర్ దీక్షిత్‌గారు అధ్యక్షత వహించారు.

యోగాసన నిపుణుడు యశ్వంతసిన్హా పరిచయం



ఆయన వయస్సు డెబ్బయి ఆరు, అంటే ఎవళ్ళూ నమ్మరు! నెత్తిమీద వింత రంగు, ఆకారం టోపీ ఒకటి; కాళ్ళకి పొంకోళ్ళు; రంగు బుష్‌కోట్, లాగూ; యస్వంత సిన్హా అనే పేరూ—ఇవన్నీకూడా ఆయన 'యోగాసనాల నిపుణుడు' అని పించేట్టు చెయ్యవు!

ఇంగ్లీషులో మాట్లాడటం ప్రారంభిం చారు, తర్వాత స్వచ్ఛమయిన (కేంద్ర సర్కారు జిల్లాల) తెలుగులోకి దిగారు. ఆయన అసలు పేరు మనకి అనవసరం. పెట్టుకున్న పేరు ముందు 'తల్లావర్ఝుల' అనే ఇంటిపేరు ఉంది. తెలుగు సాహిత్యంతో పరిచయం ఉన్న వాళ్ళందరికీ అది బాగా తెలిసిన ఇంటిపేరు. అంతేకాదు, 17 వ శతాబ్ది చివరినుంచి 18 వ శతాబ్దం మధ్యదాకా ఉన్న నారాయణ తీర్థులవారి సంతతివారే యస్వంత సిన్హాగారు.

నారాయణ తీర్థులది మంగళగిరి దగ్గర ఉన్న 'కాజ' గ్రామం. ఆయన బహుదేశా టనం చేసి చివరికి తంజావూరు సమీపంలో ఉన్న 'తిరుప్పొందురుత్తి'లో సమాధి చెందారు. ఆయనకి సంసారం లేదు. యస్వంత సిన్హాగారు ఆయన తమ్ముడి తర్వాత తొమ్మిదవ తరానికి చెందుతారు.

వీరిది బాపట్ల. మూడవ ఫారమ్‌దాకా అక్కడ చదువుకున్నారు. ఆ తర్వాత రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌కి తరలి వెళ్ళి పోయారు — పేరు మార్పు ఇక్కడే!


'నేను మొదటి ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నాను.' అని ఆయన అన్నప్పుడే ఆయన వయస్సు ఇంతా, అనిపిస్తుంది. ఆ యుద్ధంలో వీరు 'హిజ్ మెజస్టీస్ కేవల్రీ రెజిమెంట్'లో ఉన్నారు.

యుద్ధానంతరం యస్వంత సిన్హాగారికి యోగాసనాలమీద ప్రత్యేకమయిన ఆసక్తి కలిగింది; శ్రీ ఆదూరి రాధాకృష్ణమూర్తి గారివద్దా, శ్రీ బులుసు జోగారావుగారి వద్దా, శ్రీ కోడి రామ్మూర్తిగారివద్దా అనేక విధాల తరిఫీదు పొందారు.

ఇంతలో మహాత్మాగాంధీగారి కాంగ్రెసు ఉద్యమాలు మొదలయ్యాయి. యస్వంత సిన్హాగారు స్వరాజ్యోద్యమాలలోకి దూకారు. ప్రిన్స్ ఆఫ్ వేల్స్ వచ్చినప్పుడు, సైమన్ కమిషన్‌పట్ల నిరసన ప్రదర్శనలు చేశారు, సమ్మెలలో పాల్గొన్నారు!

ఇప్పటికి సుమారు 40 ఏళ్ళుగా హైదరాబాదులో ఉంటున్నారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా ఒకే ఇంటిలో ఉంటున్నారు.

యోగాసన ప్రదర్శనలు ఇస్తారు; సంస్కృత పాఠాలని అనర్గళంగా వల్లించ గలరు (దానికి సన్మానాలు పొందారు కూడా);



ధనురాసనంతో యశ్వంతసిన్హా.

వేలమైళ్ళు నడిచి వెళ్ళిపోగలరు—కాలి మీదనే హిమాలయాలలో 22,000 అడుగులదాకా ఎక్కి వెళ్ళారు; నేపాల్ కాకుండా టిబెట్‌కూడా వెళ్ళారు; మానసరోవరం చూశారు.

'ఈ సాల/గ్రామంలోపల బంగారు ఉంది! ఈ మట్టి మానసరోవరంనుంచి తీసుకు వచ్చాను—ఎంత బరువుగా ఉందో చూడండి! జాగ్రత్తగా చూస్తే బంగారం మెరుపు కూడా కనిపిస్తుంది!

ఈ నాణెం చైనావారు అప్పటికాలంలో చెలాయించింది! ఈ గడ్డి మానసరోవరం ప్రాంతానిది!...' ఇలాగ చెప్పుకుంటూ పోతూ ఏవేవో వింతవస్తువులు చూపించారు ఆయన.

పశుపతినాథ్ ఆలయం పూజారులు ఆయన సంస్కృతోచ్చారణ నచ్చి ఒక పెద్ద రుద్రాక్షమాల ఇచ్చారు. చొక్కా విప్పి బయటికితీసి చూపించారు, యస్వంత సిన్హాగారు దానిని.

ఇదంతా శ్రీ సిన్హాగారి విచిత్రమయిన వ్యక్తిగత జీవితానికి సంబంధించినది. ఆయన దేశానికి మేలుకూర్చే పెద్దపని ఒకటిచేశారు. అదేమిటంటే, ప్రభుత్వ నాయకులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి పాఠశాలలో యోగాసనాల అభ్యాసాన్ని ప్రభుత్వంవారు గుర్తించేట్టు చేశారు.

'మన దేశంలో సైన్యంలో చేరటానికి అప్లికేషన్ పెట్టుకునేవారిలో నూటికి తొంభయిమంది ఏదో శారీరికమయిన లోపం కలిగి ఉంటారు. ఆరోగ్యాన్ని పెంపొందించటం మన ప్రథమ కర్తవ్యం.' అన్నారు ఆయన.

ఇటీవల మద్రాసులో శ్రీమతి ఎం. ఎస్. సుబ్బలక్ష్మి, ఆమె భర్త [illegible] తమ గృహంలో శ్రీ దిలీప్‌కుమార్ రాయ్‌చేత ప్రసంగం చెయ్యించారు.

'నేను ఇంతదాకా కాఫీ పుచ్చుకోలేదు. పిలుపునంతదాకా అన్ని రోగాలని మందు లేకుండా యోగం చెయ్యవచ్చు నంటాను!' వెళ్ళిపోయారు...

యస్వంత సిన్హాగారి కంఠస్వరం ఎంత దృఢంగా ఉంటుందో ఆయన వేసే అడుగు కూడా అంతే! పావుకోళ్ళ టకటకలో

ఆయన చిరునామా:
25 I st. John Road,
Secunderabad-26.
—(ఓ. వి.)

ప్రశ్నావళి

...కె. రామలక్ష్మి...

పి. ఎమ్. జి, రాజంపేట

రామలక్ష్మిగారూ. పర్సనాలిటీ అంటే ఏమిటి?

వ్యక్తిత్వం. రికమెండేషన్‌లతో కంటే స్వంత వ్యక్తిత్వపు బలం మీద ముందుకు తోసుకు పోగల వారే— నిజంగా పర్సనాలిటీ కలవారు.

పి. ఎ, సికింద్రాబాదు

అంతా తెలిసీ ఏమీ తెలియనట్లుండే వారిని ఏమనాలి?

నిజంగా తెలివి కలవారని.

పి. యి. ఆర్, సికింద్రాబాదు

ఎప్పుడూ నవ్వలేనట్లుగావుండే మనిషిని ఏమని భావించాలి ?

ఎప్పుడూ నవ్వని ముఖం— ఎక్కడా వుండదు బ్రదర్.

వి. ఏ ఎమ్. ఎమ్, గొల్లవాని తిప్ప

'మీకు నచ్చకపోతే పేజీ తిప్పేయండి' అన్నారు. అలా అనటం చాలా అసమంజసంగా వుంది. పుస్తకాన్ని కొనటం పేజీ తిప్పేయటానికి కాదని ఆమె గ్రహించాలి.

ఇంకా ఈ ప్రశ్నావళి పనికి మాలినదిగా వుందంటూ తమరు సంపాదకులకు లేఖ రాయడం ఎందుకు?! వారికి తెలియదనేనా? . . . మీ పిచ్చిగాని, అచ్చేసిన 'ప్రతి' పేజీ పత్రిక కొనే 'ప్రతి' పాఠకుడికీ నచ్చి తీరాలంటే ఎలా సాధ్యం? అందుకే కదా విభిన్నాభిరుచులకి తగినట్లు విభిన్నమైన శీర్షికలని పొందుపరుస్తూ వుంటారు సంపాదకులు. మీకు ప్రశ్నావళి నచ్చకపోతే నిర్బంధంగా రేడియోలో జనగణమనలాగా వినిపించడంలేదే— ముందెందుకీ కష్టంయింటు. కొందరి కదో సరదా— అసహ్యించుకుంటూ చదవడం. ఔనా?

ఎస్, నిజామాబాద్

మీ ప్రశ్నల జవాబులు 'ఇతరుల' జవాబుల్లాగా తొణకకుండా జవాబియ్యలేరా ? మీ జవాబులు సీరియస్‌గా వుండవు. కొన్ని మరీ విపరీతంగా వుంటాయి.

చిత్తం. 'ఇంకొకళ్ళ' లాగా జవాబులివ్వడం నా కెలా చేతనవుతుంది. నా బాణి నాది. ఒంటికి మంచిది కాదని తెలిసీ నేను కొంచెం వుప్పూ, కారం ఎక్కువ తింటాను. అన్నీ చూస్తాను. తోచింది రాస్తాను. సాధ్యమైనంతవరకు 'ఏనుగకి అన్నం పెట్టినట్లు'గా కాకుండా ప్రశ్నకు తగినంత మాత్రమే చెప్తాను. తప్పయితే క్షమించాలి మీరు. నాకు సర్వం తెలుసునని నేను అనుకోడం లేదు. ఒకవేళ తెలుసునన్నా మీరు నవ్వుకోరా? ఇక మీ సుదీర్ఘమైన లేఖలోని అంశాలు— ఆడవారు పట్టుమని గంట పనిచేయరు, డ్రస్సు . . . ఇత్యాదులన్నీ పాతపాటలే— ఇక మా ఆయన సంగతి. వారి మీద నాకున్నది గౌరవమో ప్రేమో ఏదో చెప్పలేనుగాని 'శ్రీవారు' అననని అవమానిస్తున్నా నని, కోకండి. అలా అని అవమానించేకంటే, 'ఆయనంటే తప్పేమిటి? ఆయనంటే అగౌరవం అనుకుని 'శ్రీవారంటే' అతి గౌరవం అనుకుందుకు మావారేం ఆషామాషీ మనిషనుకోకండి. ఆయనొక కవి. స్నేహశీలి. ఆడదంటే గౌరవం వున్నవారు.

కె. ఎస్. ఆర్, మార్టేరు

డబ్బు మనుష్యులను కొనకలదేమోగాని మంచిని మమతని మంచి హృదయంకల మనిషిని కొనలేదు కె. రా. గారూ.

ఎంత చక్కటి నిజం బ్రదర్, కోపంలోనైనా మంచి మాట రాశావు. నీ వుత్తరానికి సమాధానం రాయకపోతే యింతకోపం వస్తే ఎలా? నేనిప్పటి వరకూ ప్రశ్నావళి పఠితలకి పర్సనల్ రిప్లైయి రాయలేదు— ఒకటి రెండు పరిస్థితులలో తప్పించి, అదేనా సరదాకి రాయలేదు. డాక్టరుతో సంప్రదించి వ్రాయడం, వారు కోరిన వివరాలు తెలుసుకొని రాయడం జరిగింది. నువ్వురాశావు— 'అధర్మం అంటే' అసహ్యం దౌర్జన్యాన్ని సహించలేకపోవడం న్యాయ రక్షణకి ఆత్మవిశ్వాసం . . .' అంటూ. ఇవన్నీ సగటు మనుషులందరికీ వుంటాయి. అని కూడా నువ్వు గుర్తుంచుకుంటే— 'నాకే ఉన్నాయా మంచి లక్షణాలన్నీ' అన్న అహం పెరగదు.

జె. కె. అర్, విశాఖపట్నం

విజ్ఞులీ తుచ్ఛసుఖాలని అసహ్యించుకుంటారు.

పొరపాటు. విజ్ఞులు జీవిత సుఖాలని అసహ్యించుకోరు. జాగ్రత్తతో నేర్పుతో మితంగా వాడుకొంటారు.

ఎస్. ఎన్. ఆర్, హీరాగిరి (ఒరిస్సా)

రాజకీయ తంత్రంలో—రాజాజీ, ఇందిర, ఎన్. జి. రంగా ఎటువంటివారు ?

రాజాజీ ఆలోచనా వాదే— చిలవలూ పలవలూ వేసి అటుఇటూ ఇటువటూ మళ్లించి రాసి రాసి చూస్తారు— మహామేధావి. ఇందిరమ్మ నేలవిడిచిన సాము చేయని నేర్పరి. ఎన్. జి. రంగా ఎవరినీ ఖాతరు చేయలేరు.

బి. పి, అత్తిలి

అన్నా చెల్లెళ్ల అనుబంధాన్ని రకరకాలుగా కథలు అల్లి నీచంగా చెప్పుకునే ఈ పాడు ప్రజలని ఏమనాలి అక్కయ్యా!

ముందు మీరు అన్నాచెల్లెళ్లని ఈ పాడు ప్రజ కెలా తెలుస్తుందో చెప్పు చెల్లెలా?!

బి. ఎమ్, కావలి

మీరు పొగడ్తలు చీత్కారాలు అని సమానంగా తీసుకోవాలని సమాధానం యిస్తారే ఒక్కొక్కప్పుడు మనస్సుకి బాధగా వుండదా?

బాధపడినా, అది నా దృక్పథాన్ని కుంచించుకునేలా బాధపడను. పొగడ్త స్వీకరించడానికి సిద్ధపడ్డనాడే— విమర్శనీ ఎదురు చూస్తాను. రెండూ ఒక నాణేనికి— బొమ్మా బొరుసులే కదా?

ఎమ్. ఆర్. ఆర్, కళింగపట్నం

పతివ్రతలలో అరవైమూడవరకం మంచిదా? లేక ముప్ఫయిఆరో రకం మంచిదా?

అబ్బా! అన్ని రకాల పతివ్రత లున్నారా?! అందరూ పతివ్రతలే కదా మళ్లీ వాళ్లలో యీ సంఖ్యా భేదం ఏమిటి?

ఇ. బి. వి. ఆర్, పాతకోట

మేనరికాలు శాస్త్రరీత్యా చేసుకోవడం మంచిదేనా అసలు దూరపువాళ్లను చేసుకుంటే మటుకు అందరూ తెలివి కలవాళ్లే పుడతారని నమ్మకం ఏమిటి?

మేనరికాలు చట్టరీత్యానూ సంప్రదాయం రీత్యానూ మంచిదేగాని తరతరాలుగా యిలా మేనరికాలే చేసుకుంటూ వస్తున్న కుటుంబాలలో— వికలాంగులు బుద్ధిహీనులు— రిటార్డెడ్, మాంగోలాయిడ్ పిల్లలు పుట్టే అవకాశాలు ఎక్కువ అవుతాయని వైద్య శాస్త్రజ్ఞులు అంటున్నారు. తరాల తరబడి అనేకుటుంబాల కలయికలు కావడంతో 'మిక్స్‌డ్ బ్లడ్' అయిపోవడం లేదా? ఇక దూరం వాళ్లయినా దగ్గిర వాళ్లయినా పుట్టే పిల్లలు గ్యారంటీగా తెలివైన వాళ్లుకాని, తెలివిలేనివాళ్లు కాని అవుతారని చెప్పలేం. అది మన రాతను పట్టి వుంటుంది. చూడండి, నా చిన్న తనంలో మా తాత 'దీని మెదడులో కోటనందూరు నల్లమట్టి వుంది' అనేవారు. చూశారా? ఆ మట్టి సారవంతమైనదని నేను మా తాతకి నిరూపించానా లేదా!?

టి. వి, హైద్రాబాదు

నాకు కథలు రాసే అలవాటుంది. కొన్ని కొన్ని కథలు బాగున్నాయని నా స్నేహితులు చెప్పారు. మీకు పంపమంటారా ?

నేనేం పత్రిక నడపడంలేదు సోదరీ. ఏం చేసుకోను ఆ కథలన్నీ?!

పెద్దకథ:

జీవన సంధ్యాలు
(మలుపులు)



శ్రీరామచంద్

(గత సంచిక తరువాయి)

స్టేషన్‌కొచ్చి రైలుబండి యెక్కాను. ఏమిటో గ్రామంలో పట్టుకుని పది రోజులు గూడా కాలేదు, స్వగ్రామాన్ని స్వజనుల్ని వదిలి వెళ్తున్నట్లు హృదయం బరువెక్కింది. అయితే ఏదో చిక్కు వీడని సమస్య ముడి వీడిపోయినట్లు మనసు తేలికైంది. సుశీలను చూసి ఎన్నో నాళ్ళయినట్లు—ఆమెను చూడాలని తహ తహ; నా నిర్ణయాన్ని ఆమెకు తెలిపి ఆశ్చర్య పరచాలని, ఆమె కన్నుల్లో వీచే ఆనందరేఖల్ని చూడాలని ఆకాంక్ష...

భవిష్యత్తును గూర్చిన తీయతీయటి ఊహల్లో మధ్యమధ్య తొంగిచూచే మధురమైన స్మృతుల్లో తేలిపోతూ ప్రయాణం సాగిపోయింది.

రైలుబండి స్టేషన్‌లో ఆగింది. క్రిందకు దిగి ఆశ్చర్యపోయాను.

మనసు ఉరకలు పెడుతుండగా సుశీలను చూడాలని పరుగులుతీసే ఆ రైల్లో వచ్చాను. తీరా నేను బండిదిగేసరికి మె బండి యెక్కటానికి ప్లాట్‌ఫారంమీద నిలబడివుంది. ఆమె చేతిలో సూట్‌కేసు వుంది.

ఆశ్చర్యంలోనుంచి తేరుకొని ఒక్క **అంగలో ఆమెను చేరుకున్నాను. సుశీ** అని పిలుస్తూ, ప్లాట్‌ఫారంమీద మసలుతున్న జనం, రైలుబండి కిటికీల్లో నుంచి చూస్తున్న తలలు ఏమనుకుంటాయో అనిగూడా లేకుండా!'...

'ఎక్కడికి ఈ ప్రయాణం...' అడిగాను, ఆశ్చర్యంలోనుంచి తేరుకుని.

'అడగటం భావ్యం కాదేమో...' అంది సుశి తన ఆశ్చర్యాన్ని కప్పిపుచ్చుకోటానికి ప్రయత్నిస్తూ; మాయని నవ్వుతో మిల మిల లాడుతుండే ఆమె కన్నుల్లో పూర్వపు కాంతి లేదు.

'చెప్పి వెళ్ళలేదనా! అందుకే క్షమాపణ **చెప్పుకోటానికి వచ్చాను...' అన్నాను.**

జీవన సంధ్యలు

బహుశా నా మీద కోపంతో ఆ సమాధానం ఇచ్చిందేమో అని.

'సమయం మించిపోయింది సత్యం...' అందామె; తల వంచుకొని.

ఆమె ఏమి మాట్లాడుతుందో అర్థం గాలేదు; 'నా నిర్ణయాన్ని వినకుండానే...' అప్రయత్నంగా అడిగాను.

'నిర్ణయాలు జరిగిపోయాయి...' అంది సుశీ ఏదో చెప్పాలని ప్రయత్నిస్తూ చెప్పలేక.

లేని నవ్వును తెచ్చిపెట్టుకోవటం నావంతైంది. 'నిర్ణయాలు జరిగినా అమలు జరిగేలోగా మారిపోవటం లోకసహజం, మనసులు మారితే నిర్ణయాలు మారుతాయి; మరేవో నిశ్చయాలు జరుగుతాయి' అన్నాను.

నిజమన్నట్లు రైలు ఇంజన్ కూత వేసింది.

'తీరిగ్గా మాట్లాడుకోటానికి వ్యవధి లేదు; అవతల బండి బయలుదేరే టైమైంది...' అంది సుశి. ఇంజన్ దిక్కుగా చూస్తూ.

'నే చెప్పింది విని, అంతగా అవసరమైతే మరో బండిలో వెళ్లవచ్చు...' అన్నాను.

'ఈ జీవితాని కిదొక్కటే రైలుబండి సత్యం; ఈ బండి తప్పిందో నా జీవితం మరే మలుపుకు తిరుగుతుందో యేమో!' అంది సుశి లోలోపల ఎందుకో మథన పడుతూ.

'నీ బాధేమిటో నాకు అర్థం గాకుండా వుంది సుశీ; నన్ను చెప్పనివ్వవు, నువ్వు చెప్పవు; నీళ్లలో ప్రతిబింబించే ఆకాశాన్ని చూచి అందని లోతులనుకున్నట్లుంది నీ భయం...' అన్నాను.

'ఒకప్పుడైతే నీ అభిప్రాయాలకు ఇదే సమాధానం చెప్పేదాన్ని సత్యం...' అందామె నిట్టూరుస్తూ.

'ఇవాళ చెప్పలేనంటావు; అయినా ఇవాల్టి నా అభిప్రాయాలను వింటే అభినందించకుండా వుండలేవంటాను. అసలు ఈ నిట్టూర్పులు, నిరాశతోగూడిన దైన్యం ఎందుకు! ఏమైంది?' అడిగను.

'ఆడదై పుట్టితే ఏమౌతుందో అదే అయింది. స్త్రీ స్వాతంత్ర్యం... సమాన హక్కులు...ఇవి పెట్టిపుట్టిన ఏ ఒకరిద్దరికోగాని అందరికీ వర్తించవు. స్త్రీ ఎంత చదువుకున్నా...ఓ ఇంటిదైతే గాని సమాజంలో గౌరవం పొందలేదు...' అంది సుశి.

'ఇదేం కొత్త కాదుగా...' అన్నాను.

'పాత కథే మరి; ఇంట్లో ఎదిగిన పిల్ల వుందనగానే ఇరుగు పొరుగులు చెవులు కొరుక్కోటానికి, ఇంటికి వచ్చే వాళ్ళు ప్రస్తావించటానికి మరో విషయం అక్కర లేదు; ఈ మధ్య మా ఇంటికి వచ్చే బంధు మిత్రులకు పెళ్ళికొడుకుల ముచ్చట్లు తప్ప మరో ధ్యాసే లేదు. నువ్వు కనిపించక పోవటంతో మా బామ్మకు మతి చెడినట్లయింది. ఏదో ఒక సంబంధాన్ని నిశ్చయించి మూడు ముళ్లు వేయించాలని పోరు సాగించింది. ఇంకా వివరంగా చెప్పాలా...' అంది సుశి నా ముఖంలోకి చూస్తూ.

'అందుకని...' గాభరాగా అడిగాను, ఏదైనా అఘాయిత్యం చేయబోతున్నదేమో అని.

'ఆత్మహత్యకు పాల్పడే పిరికిదాన్ని గను ...అది కేవలం ఆత్మవంచనే అవుతుంది...' అందామె కొంచెం కంఠాన్ని హెచ్చిస్తూ.

'మరి పారిపోతున్నావా...' అనుకోకుండా అడిగాను; తీరా అడిగింతర్వాత ఆమె నన్ను అపార్థం చేసుకుంటుందేమో అనుకున్నాను.

'అబ్బే, లోకంలో ఓ వ్యక్తిగా బ్రతకటానికి బయలుదేరాను...' అందామె హేళనగా నవ్వుతూ...

'అంటే...' అర్థంగాక అడిగను.

'స్వతంత్రంగా జీవించాలని ... తప్పేం లేదుగా...' అందామె, అందుకు కావలసిన చదువు వుందనే ధైర్యంతో.

రైలు ఇంజన్ బయలుదేరబోతున్నట్లు మళ్లీ కూత వేసింది...

సుశీల ఉలికిపడి, 'టైమైంది సత్యం; మరి వస్తాను...' అంటూ పోబోయింది.

'వెళ్లాల్సింది అటు గాదు సుశీ, ఇటు; నువ్వు చెప్పటం అయిందిగా, ఇక నే చెప్పేది వినటం నీ ధర్మం; ప్లీజ్...' అంటూ, పోబోతున్న ఆమెను వారించటానికి అప్రయత్నంగా చేయి పట్టుకున్నాను.

సుశీల గాభరాతో చేయి వెనక్కి లాక్కోబోయింది; 'సత్యం!' అని మందలిస్తున్నట్లు అంటూ.

'ఎక్స్‌క్యూజ్ మీ; చేయి పట్టుకున్నాననేనా! కరగ్రహణమే కల్యాణమహోత్సవం అన్నారు పెద్దలు...' అన్నాను...

నిజమో, కలో తెలియని సందిగ్ధంలో పడి సుశి మౌనం వహించింది.

'నిజం సుశీ; ఈ నిశ్చయంతోనే వచ్చాను...' అంటూ ఆమె చేతిని గోముగా నిమిరాను.

సుశీల తేరుకుని, 'అయితే అదృష్టవంతురాల్నే' అంటూ సిగ్గుతో నా చేతుల్లో నుంచి తన చేతిని విడిపించుకుంది. ఆమె కళ్లు మిల మిలా మెరిసాయి; బుగ్గలు ఎరుపుల్ని పులుముకున్నాయి.

'ఊహూం, ఆ అదృష్టం నాది సుశీ; ఒక్క నిముషం ఆలస్యమైతే మనిద్దరి జీవితాలూ కలియని దారుల్లో ఏ మలుపుకు తిరిగేవో...' అన్నాను.

సుశీల కిల కిల మంది.

ఆ కిల కిలలో సన్నాయి వాద్యం శ్రుతి కలిపింది.


సుశీల :

సత్యం నేనూ భార్యాభర్తల మయ్యాం; జీవితం ఓ నవోదయంలా, ఉదయ సంధ్యా రాగంలా, మధురమైన స్వప్నంలా గడిచిపోసాగింది. జీవితానికి ఇంతకంటే మరేం కావాలి! సత్యం కోసం నేను, నాకోసం సత్యం, ...ఎన్నెన్నో బాసలు, మూగబాసలు, స్వరాల బాసలు; మనసులతోబాటు శరీరాలు గూడా ఏకమై మధువసంతంలో యుగమో క్షణంలా కరగిపోసాగింది; జీవితం అనంత వసంతమే అనిపించింది. వాడని మల్లెల్లో, మాయని వెన్నెల్లో, సువాసనల వెలుగుల్లో విరిసిన పున్నమరేయి అనిపించింది...

సత్యం :

కాని అన్ని రోజులు పున్నమి కావని అప్పట్లో తెలుసుకోలేకపోయాను. పున్నమి కవతల అమావాశిలా జీవితంలో వెలుగు తెరల కవతల చీకటి దొంతరాలుంటాయన్న విషయమే గుర్తుకు రాలేదు అప్పట్లో—

పెళ్లయిన క్రొత్తలో సుఖ సంతోషాల కోసం వెనుకా ముందు చూడకుండా డబ్బు ఖర్చు చేశాను. హనీమూన్ పేరుతో విలాస యాత్ర బయలుదేరి దేశమంతా చుట్టి వచ్చాం ఇద్దరం. కాశ్మీర్ ప్రకృతి సౌందర్యాన్ని, అజంతా శిల్పరమణీమణుల అంద


ప్రతివారికీ
రక్షణ
కావాలి
CINTHOL
DEODORANT
LUXURY
TOILET POWDER
BY
Godrej
ఈ రక్షణ బాక్టీరియానుండి, చెమట
వాసనమండి— మీరు, ఇతరులు
సంకోచపడే అవస్థనుండి—
జి–11 కూడిన
సింథాల్ టాయిలెట్ పౌడరు
మీకీ రక్షణలన్నీ ఇస్తుంది
ఆవేకాదు–సువాసన...
సుమసుగంధము
సింథాల్ —
దుర్గంధములనుండి
సంపూర్ణ రక్షణనిచ్చు
టాయిలెట్ పౌడరు
Interpub/GSP-4/72 R Tel

జీవన సంధ్యలు

చందాల్ని చూచిన నా కళ్ళు నా సుశీలను ఆ సొగసులో నిలిపి వుంచటంకోసం నిరంతరం తహ తహలాడేవి. నాలో రేగిన సౌందర్యపిపాస, సౌందర్యారాధన, సుశీ నారి స్వప్నా వినక అప్పుల తలుపులు తెరిచాయి. వచ్చే జీతంనుంచి వాయిదాలమీద తీర్చవచ్చనే ధైర్యం...డబ్బుండి ఎందుకూ, అనుభవించలేనపుడు అనే వాదం ... కొద్ది కాలమే అయినా జీవితమంటే అదే మరి... కలగా కరిగినా, అనుభవంగా మిగులుతుందని ఆశించాను. కాని ఆనందం మూడు నాళ్ళ ముచ్చటైంది. బ్రతుకు అప్పుల సుడిగుండంలో చిక్కుకొని ఉక్కిరి బిక్కిరవసాగింది. మా జంటను చూసి చాలామందితోబాటు విధి గూడా అసూయపడిందేమో నాకు జబ్బు చేసింది. డాక్టర్లు బ్రతకనన్నారు; కాని నా సుశీ రాత్రింబవళ్లు నిర్విరామంగా సేవలుచేసి నన్ను బ్రతికించుకుంది; కాని బ్రతికి ప్రయోజనం యేంటి?

సుశీల :

ఆయన బ్రతకాలి; నాకోసం ఆయన, ఆయనకోసం నేను బ్రతికి తీరాలి; అభిమానాలు, అనురాగాలు పండినపుడు ఎంత కష్టాన్నైనా భరించాలి. ఎంతటి త్యాగానికైనా సిద్ధంగావాలి. సుఖాల వెనుక ఎంత కష్టంవుందో అనుభవిస్తున్న నాకుతెలుసు; దీన్ని జీవితానికే అనుభవ పాఠంగా తీసుకోవాలిగాని మనసు చెదరగొట్టుకుంటే యెలా? నా బాధల్ని వారు నా గూర్చి బాధపడుతున్నారనే...

సత్యం :

మరి బాధగాక ఏముంది! సుశీనిగూర్చే నాబాధ. ఈ బాధని తరచిచూస్తే, నేరపూరు చేశానా అనిపిస్తుంది: పెళ్ళిచేసుకొని ఆమెకు అన్యాయం చేశానా! వారూ వీరూ ఆమె 'అదృష్టవంతురాలుగాద'న్నట్లు మాటాడబోయారు. నా స్వయంకృతాపరాధానికి సుశీపై అపవాదు వేయటం నేను సహించలేను. నిజం చెప్పాలంటే నేను దురదృష్టవంతుడ్ని...

సుశీల :

ఊహూఁ, ఆ దురదృష్టం నాది; నన్ను పెళ్లి చేసుకునే ఆయన కష్టాల్లో చిక్కుకున్నాడు; నా దురదృష్టమే ఆయన్ని వరించింది. దిగులుతో ఆయన క్రుంగిపోతున్నాడు. ఆయనలో ఆశల్ని చిగురింపజేసి మళ్లీ ఆయన కోలుకునేట్లు చేయటం భార్యనైన నా విధి; అందుకే ఉద్యోగం చేయాలనుకున్నాను. ఆ మాటే చెప్పాను. ఆయన ముఖం వెలవెలా బోయింది.

'తప్పని సరైనప్పుడు తప్పు లేదుగా' అన్నాను.

'అవును, తప్పేముంది, నాకు పోషించే శక్తి లేనప్పుడు...' అంటూ ఆయన నిట్టూర్చాడు.

'అలా ఎందుకనుకోవాలి...' అన్నాను.

'మరో విధంగా అనుకోవటం లేదు సుశీ; భార్య ఉద్యోగం చేస్తుంటే...' అంటూ నసిగాడాయన లోపలి బాధను వెళ్ళబెట్టలేక.

'భర్త తింటూ ఇంట్లో కూర్చున్నాడని నలుగురూ అంటారనా; మరి ఆ అనేవాళ్లు ఆపదలో వచ్చి ఆదుకోరేం! ఇటువంటి పిచ్చి పిచ్చి ఊహల్తో మనసు పాడుచేసుకోకండి...సుఖాల్తోబాటు కష్టాల్ని గూడా పంచుకోవటం అర్ధాంగిగా నా విధి, కర్తవ్యం; భర్త జబ్బుపడి మంచంలో వున్నపుడు, ఉద్యోగం చేయలేని స్థితిలో వున్నపుడు భార్య ఉద్యోగం చేయుటం తప్పుగాదు...' అన్నాను.

'తప్పని నేనన్నానా...కా...ని...' అని ఏమో చెప్పబోయాడాయన:

'సందేహాలు మాని పరిస్థితుల్ని గూర్చి తర్కించండి. పాత అప్పులు పేరుకొని వున్నాయి; క్రొత్త అప్పులు పుట్టటం లేదు; డబ్బొచ్చే మార్గం లేదు; మీ ఆరోగ్యమా ఇలా వుంది; ఒకరి కెదురుగా ఒకరం కూర్చుంటే పొద్దు గడుస్తుంది గాని ఇల్లు గడవదుగా. కొంతకాలంపాటు నేను ఉద్యోగం చేస్తే ఈ సమస్యల బెడద తప్పుతుంది; పాత అప్పులు తీరకపోయినా క్రొత్త అప్పుల కోసం దేవులాడాల్సిన అవసరం వుండదు...' అంటూ నచ్చచెప్పటానికి ప్రయత్నించాను.

'అవును, కొన్ని పరిస్థితుల్లో మగవాడు ఆత్మాభిమానాన్ని చంపుకోక తప్పదు...' అన్నాడాయన ముఖం ప్రక్కకు తిప్పుకుని.

ఆ మాటలాయన నన్ను బాధపెట్టటానికన్నారేమో అనుకున్నాను. కాని ఆయన బాధేమిటో అర్థం చేసుకున్న తర్వాత అది ఆయనపడే బాధగాని నన్ను బాధపెట్టటానికి అన్నమాటలు కావని గ్రహించాను.

'క్షమించండి; మీ ఆత్మాభిమానాన్ని కించ

వరచాలని ఉద్యోగం చెస్తానటం లేదు... మీకిష్టం లేకపోతే వద్దు, ఉద్యోగం వూసే యెత్తను...' అన్నాను.

సత్యం :

సుశీ ఉద్యోగం చేస్తానంటే మొదట నాకు ఆమెపై కోపం వచ్చింది. అవును, చేతగానితనంలో మనిషిలో ఉక్రోషం పొంగుతుంది; తన తప్పును, ఓటమిని ఒప్పుకోవాల్సి వచ్చినపుడు కోపం రేగుతుంది. అది సహజమే మరి. అదే మనిషికి ఋషికి గల వ్యత్యాసం. అయితే ఋషులు గూడా అప్పుడపుడూ కోపానికి లొంగిపోవటం జరిగింది; మరి మానవ మాత్రుల విషయం...

పరిస్థితుల్ని పునర్విమర్శించుకున్న తర్వాత నాపై నాకే కోపం వచ్చింది. ఆమె చేస్తున్న సేవకు త్యాగానికి నేనివ్వగలదేముంది! వేదనతో నా మనసు మూగబోయింది. సుశి కాలక్షేపంకోసం ఉద్యోగం చేస్తాననటం లేదు; కష్టాల్లోంచి ఏదో ఓ విధంగా గట్టెక్కటానికి ఆమె ఉద్యోగం చేయటం తప్ప మరి గత్యంతరం లేదు. అటువంటి పరిణామాలకు కారణం నేనేగా మరి! విధి నాకు శిక్ష విధించిందనేకంటే నన్ను నేనే శిక్షించుకోవాల్సిన పరిస్థితి యేర్పడింది. మనసు సరిగాలేక యేమేమో ఆలోచిస్తున్నాను; ఆ ఆలోచనలకు కళ్ళెం వేసి సుశీల మాటల్ని నెమరువేసుకున్నాను. నా సుఖాన్ని కోరి ఆమె ఉద్యోగం చేస్తానంటున్నది; ఆమె సుఖాన్ని కోరి ఔననటం నా కర్తవ్యం...

సుశీల ఉద్యోగంలో చేరింది.

* * *

సుశీల :

తీరా ఉద్యోగంలో చేరింతర్వాత ఎందుకు చేరానా అనిపించింది. అంతకాలం ఆయనకు సహచర్యంలో గడిపిన నేను ఆయనకు దూరమైపోతున్నట్లనిపించింది. అవును, ఆఫీసుకు, రోజూ మా మధ్య కొద్ది గంటల దూరాన్ని కల్పించింది. ఈ ఉద్యోగం మా ఇద్దరి మనసుల మధ్య శాశ్వతమైన దూరాన్ని కల్పిస్తుందేమో అని నాకెందుకో అనుమానం కల్గసాగింది. తగ్గట్టు నాలో తెలియని విశ్రాంతి ప్రబలసాగింది. పగల్లా ఆఫీసు, ఆఫీసు వదలితే ఇంటి పనులు, వంట... ఆయన సేవ...జీవితానికి విశ్రాంతి లేకుండా పోయింది. కాని నాలో రేగవలసిన విసుగు, చెలరేగవలసిన చిరాకు ఆయనలో ప్రబలటం ఆశ్చర్యంగానే వుంది...

సత్యం :

సుశీ ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఎందుకో నాకూ తెలీకుండానే నాలో ఓ విధమైన దుగ్ధ, అనూహ్యమైన ఉక్రోషం చెలరేగసాగాయి. ఆమె ఉద్యోగంలో చేరటం వలన జీవితానికి కావలసినవన్నీ గాకపోయినా జీవించి వుండటానికి కావలసినవి సక్రమంగా అమరుతున్నాయి. కాని అంతకు ముందు ఏవీ అమరకపోయినా లేని ఏదో వెలితి నన్ను వేధించసాగింది. సుశీల పూర్వపు సుశే; మనిషిలో, మాటలో చేసే సేవలో లోపం లేకపోయినా ఏమో మార్పు గోచరించసాగింది. బహుశా అది నాలోని మార్పేమో! పగలు ఒంటిగా ఇంట్లో కూర్చోటం వలన విపరీతమైన ఆలోచనలు చుట్టుముట్టేవి; విసుగు జనించేది: ఈ విసుగు చిరాకుగా మారి, పగలంతా ఆఫీసు పనితో అలసిపోయి వచ్చిన సుశీపైన నిష్కారణంగా విరుచుకు పడేవాడ్ని; ఆమె కళ్ళనీళ్ళ పర్యంతమయ్యేది. నా తప్పు నేను తెలుసుకుని లోలోపల కుమిలిపోయేవాడ్ని. సుశీని కౌగిలిలోకి తీసుకుని లాలించేవాడ్ని...

రోజులు గడిచేకొద్దీ పగలు ఒంటరితనం వలన అసహనం — నాలో వృద్ధిగా సాగింది. అలా బయటకు వెళ్ళి స్నేహితులను కలుసుకోవటమో, లైబ్రరీకి వెళ్ళి పుస్తకాలు తిరగేయటమో చేయకూడదా అని సుశీ సలహా ఇచ్చింది. నిజమే క్లబ్‌లో కొద్దిసేపు గడిపితే పొద్దుపోతోంది. మనసుకు ఊరటా కల్గుతుంది. ఓ రోజు క్లబ్‌కు వెళ్ళాను...

రాజు, శివం, మణి, మూర్తి పేకాడుతున్నారు. వాళ్ళకేం, దిగులు లేని జీవితాలు. పెద్దలు ఆర్జించి ఇచ్చిపోయారు; కష్టపడి సంపాదించాల్సిన అవసరం లేదు; బరువూ బాధ్యతలు లేవు; కులాసా జీవితం; దిలాసా బ్రతుకు; ఎక్కడున్నా గడిచిపోతుంది.


నన్ను చూచి ఎన్నాళ్ళకెన్నాళ్ళకంటూ చిరునవ్వులు ఒలికించారు.

'మళ్లీ మనిషిగా చూడగల్గాంరా...' అన్నాడు మణి, పేకముక్కల్లోంచి తలెత్తకుండానే.

'వాడి భార్య వాడ్ని మనిషిగా యేంటి మనిషిగానే చేస్తుంది...' అన్నాడు రాజు, ముక్కవిగుతూ...

'ఏరా మాట్లాడవు, మహర్షివయ్యావేంటి...' అంటూ ముక్క అందుకున్నాడు శివం.

'అన్నట్లు మనవాడి సతీమణి ఉద్యోగం చేస్తున్నదట గదూ...' ఏదో కొత్త విషయాన్ని డిస్కవర్ చేసినట్లు అన్నాడు మూర్తి...వాడి భార్యకు ఉద్యోగం చేయా



ల్సిన అవసరంలేదు మరి; ఆమె పుట్టింట్లో వుందో, అత్తగారింట్లో వుందో వాడికే తెలి యదు! లేను గుర్రాలతోబాటు మకాం ఊరూరుకూ మారుతూ వుంటుంది; రేసులు లేకపోతే పేకాటతో పొద్దు గడు స్తుంది.

'ఎందరు భార్యలు ఉద్యోగాలు చేయటం లేదు; వేడి నీళ్ళలో చన్నీళ్ళని, ఈ కాలంలో భార్యాభర్తా, ఇద్దరూ ఉద్యోగాలు చేసి గడించకపోతే ఈ మహాపట్నాల్లో గడపటం కష్టమే,' అన్నాడు మూర్తి; అతడికి జీవితం అంటే యేమిటో తెలుసు...

'మనవాడి ఉద్యోగం ఎప్పుడో ఊడిం దిగా ' అన్నాడు శివం, వెకిలిగా నవ్వుతూ.

'పీడా వదిలింది; భార్య ఉద్యోగం చేస్తుంటే, మరి ఉద్యోగం దేనికి; ఆరోగ్యం గూడా సరిగా లేదుగా; హాయిగా ఊరూ, వాడా తిరుగుతూ, క్లబ్‌తో కులా సాగా పేకాడుతూ గడపవచ్చు...' అన్నాడు మూర్తి.

వాళ్ళ మాటలకు నాకు నవ్వు వచ్చింది, ఏడుపూ వచ్చింది; జీవితం అంటే యేంటో తెలియని వీళ్ళా నా స్నేహితులు, అనుకున్నాను. 'అదేంట్రా వెళ్తున్నావ్!' అని పిలుస్తున్నా వినిపించుకోకుండా

జీవనసంధ్యలు


వచ్చేశాను.

ఇంటికి వచ్చానన్నమాటేగాని వాళ్ళ మాటలు నా చెవుల్లో రింగ్‌మంటూనే వున్నాయి. క్లబ్‌కు ఎందుకు వెళ్ళానా అని పించింది. నామీద నాకు కోపం వచ్చింది. ఆ కోపాన్ని ఆఫీసు నుంచి తిరిగొచ్చిన సుశీ మీద చూపాను. ఆమె కిమ్మనలేదు. ఆమె మౌనం నాలో మరింత కసిను రెచ్చగొట్టింది. ఆమె మనసును నొప్పించాను.

సుశీల :

ఆయనకు ఎందుకు నామీద కసి! నేనేం లోపం చేశానని! ఆయన విపరీ మాటీపోటీ మాటలు వింటుంటే తల పగలగొట్టుకొని చచ్చిపోదామా అనిపించేది. ఉద్యోగాలు చేసే భార్యలందరి జీవితాలు ఇంతేనా !

వారికి సుఖమనేది లేదా! ఒక్కోరాత్రి ఆయన మనసును నొప్పిస్తూ అనే మాటలకు నిద్రగూడా వచ్చేదిగాదు; నాకు ఇటువంటి శిక్ష ఎందుకు విధించావు దేవుడా అంటూ కుమిలిపోయేదాన్ని; కోరి ఆయన్ను పెళ్ళిచేసుకుని నాకు నేనే శిక్ష విధించుకున్నా ననుకునేదాన్ని. ఓరోజు



అర్ధరాత్రి చటుక్కున మెలుకువ వచ్చింది. కళ్ళు తెరచి చూచాను; ఆయన, గుడ్డలు చిన్న సూట్‌కేసులోకి సర్దుకొని వెళ్ళబోతు న్నాడు.

అర్ధరాత్రి ప్రయాణం ఎక్కడికని అడిగాను పడకమీదనుంచి లేచి వెళ్ళి.

'ఏమో !' అన్నాడాయన...

'మీకు తెలియకుండానే వెళ్తున్నారా ?' అడిగాను.

'కాళ్ళు ఎక్కడికి తీసుకుపోతే అక్క డికి, సుఖంలేక పోయినా శాంతి లభించే చోవుకు...' అన్నాడు, జీవితంలో మనః శాంతి కరువైనట్లు.

'ఇక్కడలేని శాంతి ఎక్కడ లభి స్తుంది !' అడిగాను.

'లేని శాంతితో ఆత్మవంచన చేసుకుని బ్రతకటం దుర్లభంగా వుంది...' అన్నా రాయన.

ఆయన ఏం మాట్లాడుతున్నాడో నాకూ అర్థంగాలేదు. అయోమయంతో అమాటే చెప్పాను, గుమ్మానికి అడ్డు నిలుస్తూ...

'నన్ను నేను అర్థం చేసుకోలేని స్థితిలో వున్నాను; గుమ్మానికి అడ్డు తొలుగు...' అంటూ కర్కశ స్వరంతో అన్నాడాయన.

'గుమ్మానికి అడ్డు తొలగినా వివాహ బంధమనే శాశ్వతమైన అడ్డు యెలా తొలుగు తుంది !' బాధను దిగమింగి కటువుగా అడిగాను.

ఆయన నివ్వెరపోయారు. అంతలోనే తేరుకుని, 'అంటే ఆ బంధాన్ని గూడా తెంచి వెళ్ళమనా!' అన్నారు నా ముఖంలోకి సూటిగా చూస్తూ.

'ఆ బంధాన్ని తెంచినా అనుబంధం తెగిపోదుగా !' ఎందుకు మీరీవిధంగా మారి పోయారు ! నలుగురిలో నవ్వులపాలవుతా మని గూడా లేకుండా ఎందుకు పారిపో దలచారు ! కారణం లేకుండా నన్నీవిధంగా ఎందుకు హింసిస్తున్నారు !' ఎంత అణచు కున్నా దుఃఖం ఆగిందికాదు. ఆదుఃఖంలో అడగాల్సినవన్నీ అడిగాను. 'ఆ బంధాన్ని గూడా తెంచివెళ్ళమనా !' అన్న ఆయన ముళ్ళవంటి మాటలు నా గుండెల్ని నులిమి వేస్తున్నట్లనిపించింది. ఎందుకో కళ్ళు తిరిగినట్లై తూలి పడబోయాను,

'సుశీ!' అంటూ ఆయన చటుక్కున నన్ను పట్టుకున్నారు.

'ఆనాడు పూలబాసలని, మూగబాసలని చేసిన బాసలు, జబ్బుతో బాధపడుతూ పొందిన సేవలు మరచిపోయారా!' హీన స్వరంతో నన్ను నేను నిలతొక్కుకోటానికి ప్రయత్నిస్తూ,

'నన్నుక్షమించు సుశీ; ఈ తప్పు నీది కాదు నాది...' అన్నారాయన నన్ను మంచంవద్దకు తీసుకువెళ్లి కూర్చొబెట్టూ.


'అందుకు నాకు ఈ విధంగా శిక్ష విధించదలచారా! మీరు లేనప్పుడు నేనెందుకు! ఉద్యోగం ఎందుకు! ఈ అశాంతి, ఆవేదనకు, అగాధాలకూ నా ఉద్యోగమే కారణమైతే రేపే రాజీనామా ఇస్తాను. మీతోబాటే నేను; మీరెక్కడుంటే అక్కడే నేను...' అన్నాను నా నిశ్చయాన్ని తెలుపుతూ.

'నన్ను క్షమించు సుశీ'. అంటూ ఆయన నా చేతులు పుచ్చుకుని నా ప్రక్కనే కూర్చున్నారు. ఆయన కంఠంలో పశ్చాత్తాపం జీరాడుతున్నది. కన్నుల్లో దైన్యం మిలమిలలాడింది. 'నాకు నీ ఇష్టమొచ్చిన శిక్ష విధించు; లోకానికి వెరచి పిరికిపాడినై పారిపోదలచాను. నీకు తీరని అన్యాయమే చేసుకట్టాను. ఆనాడు రైలు స్టేషన్‌లో ఓ క్షణం ఆలస్యమైవుంటే ఇద్దరి జీవితాలు ఏ మలుపులకు తిరిగి వుండేవో తెలియదుగాని ఈనాడు నీకు మెలకువ రావటం ఓక్షణం ఆలస్యమైవుంటే అధఃపతనమే జరిగివుండేదనటం నిజం...ఇక మనిద్దరినీ ఏశక్తీ విడదీయలేదు; ఇప్పుడప్పుడే రాజీనామా ఇవ్వాల్సిన అవసరం లేదు; రేపటినుంచి నేనుగూడా ఏదైనా ఉద్యోగానికి ప్రయత్నిస్తాను; నాకు ఉద్యోగం దొరికింతర్వాత నువ్వు రాజీనామా ఇవ్వచ్చు ...' అన్నారాయన నన్ను దగ్గరకు తీసుకుంటూ.

అబ్బ, తుపాను వెలసింది...

ప్రళయానంతరం ప్రశాంతి అన్నారు... కాదు, జీవితం క్రొత్త మలుపులకు మళ్లింది. ●

(అయిపోయింది)



జ రి గి న క థ

ఒక వ్యక్తిమీద అనేక అభిప్రాయాలు వున్నట్టే — ఆ ఆస్పత్రిమీద కూడా అనేకానేక మంచీ — చెడ్డా అభిప్రాయాలున్నాయి. సూర్యానికి ఆ ఆసుపత్రి అంటే ఒకరకమైన భయం. తీరా అతను కూడా అందులోనే చేరాల్సి వచ్చింది. ఆ వార్డులో ఇంకా శెట్టిగారు, శ్రీనివాసు వున్నారు. ఆసుపత్రిలో చేరాక సూర్యానికి గత మంతా కళ్ళముందు కదలింది. అతను యవ్వనంలో ప్రవేశించగానే మొట్ట మొదటిసారిగా విశాలాక్షి మీదకి మనసు పోయింది. సూర్యం చెల్లెలు గౌరి. ఆమె జ్ఞాపకం రాగానే అతని కళ్లలో నీళ్లు నిండాయి. గౌరి భర్త గోవిందరావు ముక్కు సూటిగా ప్రవర్తించేవాడు. అతనితో ఎప్పుడూ గొడవే. గోవిందరావు అకస్మాత్తుగా హాస్పిటల్లో మరణించాడు. ఆఫీసరుగా ప్రమోషన్ రావడం సూర్యం జీవితంలో ఒక పెద్దమలుపు. అంతా అతన్ని ప్రశంసించినవారే. బొంబాయిలో గీతతో పరిచయం అయింది. గీత అతన్ని ఎప్పుడూ ఆడిస్తూ వుండేది. అతన్ని పెళ్ళిచేసుకోవాలని గీతకి వున్నా సూర్యం త్రోసి పుచ్చాడు. ఇదంతా జ్ఞాపకం చ్చి కాస్సేపు ఆ వాతావరణాన్ని మరచిపోయాడు.

11

'నేను నేను కాదు. యిది నాదికాదు అనే ఆలోచన నామీద నాకే వున్న అభిమానాన్ని తగ్గించి యెదుటివాళ్ళ మీద అభిమానాన్ని వృద్ధి చేసింది. నాలో క్రొవ్వు వత్తి అప్పటికే తయారవుతున్నా ఆ అజ్ఞాత వ్యక్తి వెలిగించాడు. ఆ వెలిగించిన వాడే దేవుడు. దేవుని స్పర్శ అతని ఆకారంతో వూహించుకోగలుగుతున్నాను. నా జీవితంలో పెనుగాలులు వీవాయి — వస్తున్నాయ్. ఆ గాలులకు ఆ దీపం ఆరతోంది. అతని స్పర్శ తలపులను సృష్టించి మళ్లీ వత్తిని వెలిగిస్తున్నాయ్.'

శ్రీనివాస్ యింత చెప్పి ఆయాసం వలన కామోసు ఆగిపోయాడు. ఇప్పటికి యితను చెప్పిన వృత్తాంతం సూర్యంలో యెన్నెన్నో విచిత్రానుభూతులను సృష్టించింది. అతనికి కొద్దిగా కాఫీ అందిచ్చాడు. అది త్రాగేసరికి పిలుపు వచ్చింది. ఎక్స్‌రే తీసాక మళ్లీ చక్రాల కుర్చీమీద తిరిగ వచ్చాడు.

వార్డుకు తిరిగి వచ్చి మంచం మీద పడ్డాడు. మనిషి నీరసంగా వున్నా సాహ సిస్తున్నాడు. ముఖంలో బాధను చిరు నగవు తెరతో కప్పడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇంకా అతని దగ్గర నించి విన వలసినది సూర్యంకు యెంతో వుంది. శ్రీనివాస్ నిద్రపోతున్నా కాస్సేపు అక్కడ కూర్చున్నాడు; తరవాత తన పరుపు మీదకు వచ్చేసాడు. ప్రక్కనున్న ఖాళీ మంచం మీదకు పరుపు వచ్చింది. ఆ పరుపుపై తెల్ల దుప్పటి పరుస్తున్నారు. తన మనసు స్వచ్ఛమైన తెలుపులానే వుంది. ఆ తెల్లని తెరపై తన గురించి విమర్శన ప్రొజక్టరు ద్వారా ఫిల్ము వేసుకుని చూస్తున్నాడు.

సూర్యం యెదుటి వాళ్ళ దగ్గర నించి యెన్నెన్నో కాంక్షించాడు. వాళ్ళప్రేమ, అభిమానం, కీర్తి, గౌరవం— తను యెంతో త్యాగం చేసినట్లు, యెంతో మంచి సాధించినట్లు—ఈ త్యాగాన్ని, మంచినీ యెదుటి వారు శ్లాఘించాలని వుబలాటపడ్డాడు. ఎన్నెన్నో పొందాలని కోరుకున్నాడు. తన సంతోషం కోసం యెదుటి వారి ప్రేమ, హృదయం, అందం, ఆవేశం, స్పర్శ యింకా యెన్నెన్నో కాంక్షించాడు. అతను తన చేతులూ, అందం, మెదడు తనవి అనుకున్నవి అన్నీ ప్రేమించాడు. ఇవన్నీ లోభం ముద్దకాకపోతే యింకేమిటి? ఈ లోభాన్ని క్రొవ్వువత్తిగా మార్చే అవకాశం శ్రీనివాస్ యిచ్చినట్లుంది. దానిని వెలిగించే వాడు యెవడో?

అది విశాల కాకూడదా అన్న ఆలోచన మనసులో నించి పూర్తిగా తుడిచి పెట్ట లేదు. సాయంత్రం నాలుగైంది. ఆమె గురించి యెందుకు తలచుకోవాలను కున్నాడు. ఇప్పుడు ఆమె పరాధీన. మళ్లీ ఆమెను తలచుకోడానికి అధికారం తన ఒక్కడికే వుందనుకున్నాడు. ఆమె తొలి వలపులో దైవత్వం వుంది. అది యెవడి అధీనం అవుతుందో ఆమె మీద సర్వాధి కారాలు వాడివే! ఆమె తొలి కన్నీరు శ్రావణ మేఘాలు రాల్చిన తొలివర్షపు చినుకులంత నిర్మలంగా వుంటాయ్. అవి ముట్టుకో గలిగే అదృష్టం యెవరికి పడ్తుందో వాళ్ళకే ఆమెపై అన్ని అధి కారాలు సంక్రమిస్తాయ్. ఆమె పడుతున్న బాధలను వాటి నివారణోపాయాలను వూహించుకునే హక్కు తనకు వుంది.

'మా ఆవిడ వస్తోంది' అన్నాడు దగ్గరగా కూర్చున్న శ్రీనివాస్. ఆమె వార్డులో కాలుపెట్టి ముందుకు వెళిపోతుంటే 'యిక్కడ' అన్నాడు. ఆమె యిటు తిరగ్గానే

'విశాల!' సూర్యం సర్వేంద్రియాల్లోనూ ప్రతిధ్వనించింది. ఊపిరి ఆగిపోయినంత పని అయిపోయింది. ఆమె అలా కొయ్యబొమ్మలా నిల్చుండి పోయింది.

'ఇలాంటి స్నేహితుడు కావాలని జీవితకాలం తపస్సు చేస్తే చివరికి యీ ఆసుపత్రిలో ప్రసాదించాడు. ఆ స్నేహితుడు— ఇతనే సూర్యం — మా ఆవిడండీ — శ్రీమతి విశాలాక్షి — విశాలా అని పిలిస్తే ఆమెకు కోపం' శ్రీనివాస్ లెక్చర్లు యిద్దరికీ వినపడలేదు.

'ఒకప్పుడు యెలా వుండేదంటారు, జగన్మోహిని. ఇప్పుడు చిక్కిపోయింది. సాధారణంగా యెవరి పెళ్ళాం గురించి వాళ్ళు గొప్పగా చెప్తుంటారు. అలా అనుకోకండి, చాలా మంచిపిల్ల.' ఇప్పటికీ యెవరూ మాటాడకపోవటంతో 'ఏమండీ! నిద్దర పోతున్నారా?' అని శ్రీనివాస్ సూర్యాన్ని తట్టాడు.

'అతనికేమయ్యింది?' విశాల మెల్లగా అడిగింది.

'తిన్నది సరిగ్గా జీర్ణం కాలేదట. అజీర్ణం యెందుకొస్తుంది చెప్పు?' నాకేం తెలుసు అన్నట్లు విశాల ముఖం పెట్టింది.

'అనవసరంగా ఆలోచిస్తూ కూర్చుంటే ఏంవస్తుంది. ఈ రెండురోజుల్లో చూసాను. యేదో శాశ్వతంగా పోగొట్టుకున్న మనిషి దిగులుగా ఆలోచిస్తూ కూర్చుంటాడే అలానే యితను ఆలోచిస్తూ వుంటారు. ఏమో? ఏమో? ఎవర్ని ప్రేమించి పొందలేకపోయారో? ఇతనికి గొప్పగుట్టు. తన గురించి ఒక్కముక్క చెప్పాడేమో అడుగు.'

'చెప్పడానికి యేమీలేదు' అన్నాడు సూర్యం.

'ఇతను గుట్టుమనిషని యీ సమాధానం చెప్పటంలేదూ?'

'మాటాడండి. వస్తాను' అంటూ సూర్యం అక్కడనించి లేచి బయటకు వచ్చేసాడు. గబగబ నడచి రోడ్డుమీద పడ్డాడు. అలా నడుస్తూనే కేంటీన్ చూసాడు. వెళ్ళి అక్కడ కూర్చొని కాఫీ అడిగి త్రాగేక చమట పట్టింది. ఆ చెమటతోపాటు కన్నీటిబొట్లు రాలింది. తలపట్టుకుని అక్కడే చాలసేపు కూర్చుండిపోయాడు. చీకటి పడ్డవరకు తిరిగి వార్డుకు వెళ్లలేదు. తన ప్రవర్తన శ్రీనివాస్‌కు అనుమానం కలిగిస్తుందేమో నన్న భయంతో 'పాతస్నేహితు డొకడు కలిసాడు. ఆలస్యమైనందుకు క్షమించండి.'

'మా ఆవిడ వేగంగానే వెళిపోయింది.'

అతను కొంత వణుకుతూ అనగానే సూర్యం అతను అనుమానించాడేమోనని భయపడ్డాడు. దగ్గరకు మెల్లగా వెళ్ళగానే మళ్ళీ నిన్నటివేళకే శ్రీనివాస్‌కు జ్వరం ముంచుకుని వచ్చింది. సిగరెట్ మీద సిగ



లేచి కూర్చున్నాడు.

'డాక్టరు వద్దన్నాడుగా...'

'వాళ్ళు చెప్తారు. వాళ్ళను మానీయండి.'

'క్షమించండి...' అంటూ చేతిలో నీటి తీసుకున్నాడు.

శ్రీనివాస్ యేమీ అనకుండా ముఖం ప్రక్కకు త్రిప్పివేసాడు. సూర్యం గుండె వడి యింకా తగ్గలేదు.

'కోపం వచ్చిందా?' అన్నాడు.

'నాకా—కోపమా? నేను చాలమందికి శ్రమ యిస్తున్నాను. నాకుండవలసినంత ఓర్పు, మనోనిగ్రహం వుండటంలేదు. ఒకోసారి కోపంతో చెయ్యరానిపనులు చేసేస్తుంటాను. ఏంటోనండి రామరాను శక్తి తగ్గిపోతోంది. ఏంటో గాబరాగాబరాగా వుంటుంది, ఒకోసారి మనసు పట్టు తప్పిపోతోంది.'

'మీరలా బాధపడకండి. మీకు వచ్చిన భయమేమీ లేదు. అన్నిటికీ నేనున్నాను. మీ సోదరునిగా భావించండి.'

'అలా భావిస్తే మీరు నాకు దూరమౌతారు. మంచిమిత్రుడు ఒక్కడుంటేచాలు. ఆ ఒక్కడ్నీ యింతకాలానికి పొందాను. మీకు చాలా శ్రమపెట్టున్నాను...ఇంకా పెట్టబోతున్నాను.'

'మీరు అలా అనుకుంటే మీ విషయంలో నాకు యేది చెయ్యడానికి అవకాశం యివ్వరు.'

'ఇస్తాను. అంతా మీకే యిస్తాను. నాకింకెవరూ లేరు.' శ్రీనివాస్ కళ్లల్లో నీరు తిరిగాయి.

'మీ ధైర్యం అంతా యేమైంది?'

శ్రీనివాస్ పెద్దగా నిట్టూర్చాడు.

కాస్సేపయ్యాక 'ధైర్యంలేక కన్నీరు కార్చలేదు. నేను చచ్చిపోతానన్న అధైర్యం నాకెప్పుడూ లేదు. ఇంతకాలానికి నా ఆత్మ యింకో ఆత్మతో బాసలాడుకొగలిగినందు వలన వచ్చిన ఆనంద భాష్పాలివి. మనసు అనురాగంతో జల్లిన పన్నీరిది—సూర్యంగారూ...దేవుడు దొడ్డవాడు.'

'అయితే...'

'ఆపేసారు...అడగండి'

'ఇంతకాలం మీ ఆత్మలో యింకో ఆత్మ కలవలేదా?'

'లేదు'

నాలుగుమంచాలు

'అనురాగంతో యీ నయీ పన్నీరు జల్లలేదా?'

శ్రీనివాస్ ముఖం ప్రక్కకు త్రిప్పేసాడు. సూర్యం పెద్దగానిట్టూర్చాడు. కళ్ళు మూసుకుని చీకటిని చూసాడు. కానీ అందులోనూ వెలుగురేఖ కదలుతోంది.

*　　*　　*

రాత్రి పదకొండుదాటినా సూర్యానికి నిద్దర పట్టలేదు. ప్రకృతి అంతా మూగపోయినట్లు నిశ్శబ్దంగావుంది. నిశీధి నివ్వెరపోయి దైన్యంగా తలవంచుకుని కదిలిపోతోంది. ఆకాశంలోని మేఘాలు చీకటి తలపై ముసుగుకప్పి చీకటితో పాటు ప్రయాణం చేస్తున్నాయ్. వస్త్రాపహరణం చేసే దుశ్శాసనునిలా పడమటికొండలు మేఘాలను లాక్కుంటున్నాయ్. ఆపదలో చిక్కుకున్న అందాలభరిణ రోదిస్తున్నట్లు ప్రకృతి ఘీంకారం వినిపిస్తోంది. ఆమె కన్నీటిబొట్లులా వర్షపుచుక్కలు వచ్చిపడింది.

విశాలను యీరోజు మళ్ళీ చూసేవరకు అతని మనఃఫలకంమీద తొలిరూపంతోనే విహరించింది. సానపెట్టిన మన్మధ బాణంలా ఆమె అనేక రూపలావణ్యాలతో వెలిగి, వివిధ నాట్యభంగిమలతో నృత్యం చేసి, కమ్మనిరాగాలను ఆలాపించి, సువాసనలను వెదజల్లే పుష్పాలపరిమళాలతో గుభాళించింది. ఒళ్ళంతా కళ్ళుచేసుకుని, మనస్సంతా ఆమెపై లగ్నంచేసి ఆమె మృదువుగా పలికిన పలుకులు, పలుకుల్లో వొలికిన అమృతం ఆస్వాదిస్తూ, ఆవీణాకంఠాన్ని మళ్ళీ మళ్ళీ మీటిస్తూ, ఆ చూపుల్లో కులుకుతున్న ప్రణయానికి ముగ్ధుడౌతూ మౌనంగా గడిపేవాడు. ఊహలోనే ఆ విగ్రహాన్ని స్పృశించుకుని కళ్ళుమూసుకుని ఆ జగన్మోహినిని చూస్తూ మురిసిపోతుండేవ సూర్యం యీనాడు చూసిన స్త్రీ ఆనాటి విశాల అంటే తన కళ్ళనే నమ్మలేకపోయాడు.

విశాలను అతను శరత్కాలంలోనే చూసాడు. శరత్కాలపు పున్నమినాటి వంద మామలానే అతని మనసులో ఆమె నల్చిపోయింది. ఆమె యిప్పుడు వర్షఋతువులో మేఘాలచాటున పాలిపోయిన చందమామలా వుంది. ఆమె ఒళ్ళంతా గెంటి యున్న యౌవ్వనం యిప్పుడు రోగంతో నీరసించి నిద్రపోతున్నట్లుంది. ఈ కొద్దికాలంలో యెంతమార్పు? గౌరికి తనకు రక్త సంబంధం వుంది. విశాలకు తనకు జన్మజన్మాల సమ్బంధం. అది లేకపోతే ఆమె అతనిని తొలిసారి కౌగలించుకుని కన్నీటితో నిష్క్రమించలాడదు. ఇంకోవ్యక్తికి తనపై అధికారం అంకురించినా దాన్ని మౌనంగా ధిక్కరించలేదు. తొలిసారి వుదికిన వలపుల వసంతంలో విలాసంగా తనతో విహరించి మళ్ళీ వసంతంలో యింకొకరిని చేపట్టలేదు. మనసు అంతర్గతమైనది మనిషి అగుపించేవాడు. మనిషి చేసేవి అగుపిస్తాయ్. మనసులోనిది కనపడదు. ఆ యోగి వృంగవు డన్నట్లు మనిషి బ్రతుకంతా నటనే— విశాల లోకంకోసం నటించాలి. ఆమెచేసిన చేష్టలు సంఘానికి నచ్చాలి. ఆమెదే కాదు. తనచేష్టలూ నచ్చాలి. తన చేష్టలూ నచ్చాలంటే తనూ నటించాలి. విశాలకూ తనకూ బాహ్యంగా యేమీ సంబంధంలేదు. ఆమె భర్తకూ ఆమెకే ఆ సమ్బంధం. ఆ సంబంధం ఫలించడానికి తను సహాయపడాలి. అది రెండు విధాలుగా చెయ్యాలి. తొలిది ఆమె పసుపు కుంకుమ నిల్పటానికి తను గట్టి ప్రయత్నం చెయ్యాలి. గౌరి విషయంలో ఆర్థికంగా తను పొందిన అసహాయత యీనాటికీ తనను తానే విస్మరించుకుంటూ దుఃఖపడేటట్లు చేస్తుంది. ఈనాడు విశాల విషయంలో బాధ్యత తీసుకోడానికి ఆర్థికంగా తను అంత చిక్కుల్లో లేడు. డబ్బు సహాయం పొందే పరపతి యిప్పుడు తనకున్నది. ఈ పరపతిని బాగా వినియోగించి శ్రీనివాస్ వేగంగా కోలుకునేటట్లు చూడాలి. దానికి అతనిని చూస్తున్న డాక్టరును కలుసుకోవాలి. రెండోది అతను కోలుకున్నాక ఆమె అతనిపై వన్నిరుజల్లే అవకాశం కల్పించాలి. ఆ పన్నీటిజల్లు వలన ఆతను సుఖపడ్తాడు. సుఖంవలన కోరికలు పుట్తాయ్. కోరికలవలన సంతతి కలుగుతుంది. అద్వాలలో బిడ్డడు పాత అభిమానాలను త్రెంచి క్రొత్త ప్రేమలను చిగురింపచేస్తాడు. రక్త సంబంధంతో ఒక నిధమైన వంతెనను యిద్దరిమధ్యా వేస్తాడు. అప్పుడు యీ సంసారంలో వరదలు వచ్చినా యేరు దాటవచ్చు. ఆ వంతెనను నిర్మించే అవకాశం యిచ్చి తను విశాలకు మళ్ళీ



కనపడకుండా యెక్కడికో వెళిపోవాలి. ఇది వరకు సినిమాలో ప్రేమ కథలు చూసి యిలా యెక్కడ జరుగుతాయని అనుకునే వాడు. ఇప్పుడు తన కథ సినిమా కథలా తయారయింది.

ఇవన్నీ తల్చుకునేసరికి రాత్రి పన్నెండు దాటిపోయింది. ఐనా తనకు నిద్ర పట్టడం లేదు. ఇంతలో శెట్టిగారి గొంతుక వినిపించింది. 'రామం' అని ఆత్రుతగా పిల్చాడు. ఆ కుర్రాడు రోజంతా పనితో అలసిపోయి వున్నాడేమో మత్తుమందు తిన్నట్లు నిద్రపోతున్నాడు. శెట్టిగారు 'అమ్మో' అని మూలుగుతున్నారు. సూర్యం గబ గబ లేచి 'ఏమండీ' అని దగ్గరకు వెళ్లాడు. 'నొప్పి —నొప్పి' అన్నాడు. సూర్యం ఆ నొప్పిన చోట రాసినా తగ్గలేదు.

'బాణం దూసుకు పోయినట్లుంది ... అమ్మో...'

సూర్యం గబ గబ డ్యూటీ డాక్టరు దగ్గరకు వెళ్లాడు. అతనిని తీసుక వచ్చాడు. అతను పరీక్షచేసి ఒక యింజక్షను యిచ్చాడు. కొంతసేపటికి శెట్టిగారు పడుకున్నారు. ఐనా సూర్యం అతని దగ్గరనే అలా కూర్చున్నాడు. రెండోవేపు శ్రీనివాస్ నిద్దరపోతున్నా జ్వరంతో కాస్త చికాకు పడుతున్నాడు. ఎదుటి మంచం యింకా ఖాళీగా వుంది. ఈ నాల్గు మంచాలవేపు ఒకసారి చూసాడు.

నాలుగు మంచాలు

ఈ మంచాలు యెన్ని యేళ్ల బట్టి యిక్కడ వున్నాయో ? వీటిమీద యెందరెందరు రోగులు, యెన్నిరకాల బాధలను అనుభవించారో ? ఎందరు రోగాలను జయించారో? ఎవరు రోగాలకు లొంగిపోయారో ? ఈ నాల్గు మంచాలకు యిప్పుడు యేర్పడిన సమన్వయం యింకెప్పుడూ యేర్పడి వుండదు. ఈ నాల్గు మంచాలమీద వున్న వ్యక్తులకు ఒకరి జీవితంతో యింకొకరికి సంబంధం వుంది. శ్రీనివాస్ చెప్పిన మాటలు బట్టి చూస్తే ఆ ఖాళీ మంచం మీద పోయిన వ్యక్తి గోవిందరావు మనస్తత్వం కలవాడు. ఈ శెట్టిగారికీ గోవిందరావుకు సంబంధం వుంది. విశాలవలన శ్రీనివాస్‌తో సమ్మంధం యేర్పడింది. ఇందులో యెవరెవరు జయాపజయాలను యెదుర్కొని యే సందేశాలను యిస్తారో ?

తిరిగివచ్చినా ఆలోచనలపుట్టను నేలమట్టం చెయ్యలేకపోయాడు. ఆ పుట్టలో చెదపురుగులు కదులుతున్నట్లు ఒళ్ళంతా గిలిగింతలతో బెదరసాగింది. సుగత నిద్దర వేకువఝామున మంచి నిద్దరైంది. తనకు తెలివి వచ్చేసరికి చెట్లపై యెండ పడుతోంది. దగ్గరగా శ్రీనివాస్ కూర్చున్నాడు. మనిషి నీరసంగానున్నా ముఖంలో వెలుగు పోలేదు.

'ఆలస్యంగా లేచారు'

'ఆలస్యంగా పడుకోవటం, ఆలస్యంగా లేవటం అలవాటై పోతోంది.'

'ఈవేళ మీరు టెస్టుకు వెళ్లాలి కదూ ? ముక్కులోనించి రబ్బరు గొట్టం కడుపులోకి దించేస్తారు.'

'అంతతో సరిపోతుందా ? దీని అంతు చూడకుండా మళ్లీ వెళ్లాలనిలేదు.'

'అజీర్ణవ్యాధి అంత చెడ్డ వ్యాధి యింకొకటి లేదు. దేవుడు అసలైన కడుపునే కన్నాలు చేసాడన్న మాట. మీలాంటి మంచి వాళ్లకిది యెందుకొచ్చిందో ?'

'మీరు చెడ్డవారా ?'

'నా మంచీ చెడూ నాకెలా తెలుస్తుంది? మీకు తెలియాలి. కష్టాలు వచ్చినప్పుడల్లా ఒక యోగి పుంగవుడు చెప్పినది జ్ఞప్తికి వస్తుంది.'

'ఏంటది?'

'దేవుడు మంచివాళ్లను కొద్దిగా పైకెత్తి దించేస్తాడు. పడినా దెబ్బలు తగలవు. చెడ్డవాళ్ళను సిరిసంపదలు, సుఖంలో దిగువకు దించకుండా పై పైకి అలా యెత్తేస్తుంటాడు. కానీ అంత యెత్తునించి ఒక్కసారే వదిలేస్తాడు.'

'పిప్పి అయిపోతాడన్నమాట'

'అంతా న్యాయంతో వుంది. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరిగి తన న్యాయాన్ని అది పాలిస్తోంది. మనిషి తన న్యాయాన్ని తను పాలించాలి'

'మనకు శ్మశాన వైరాగ్యంలా ఆసుపత్రి వైరాగ్యం రాలేదు కదా?'

సూర్యం వేసిన యీ ప్రశ్నతో శ్రీనివాస్ నవ్వుతూ 'నిజమే. ఇదేమిటి మనం వేదాంతోపన్యాసాలతో కూర్చుంటున్నాం. ఒక చక్కని ప్రేమగీతిక పాడండి'

'పాచినోటితోనా?'

'ఫరవాలేదు. బెడ్ కాఫీలా వుంటుంది'

'ఆ మెరుపు కన్నె నా
ప్రేయురాలు, ఆమె
పంచల ద్వగంచల మ్ముల
ఛాయలుండె
నే విహరింతు, ఆమె
కెమ్మోవి గాయు
లేత వెన్నెల కొరకే అర్పింతు నాను



మనస్సు జీవితమ్మును ఆమె
మధురమధుర
భాషణమ్ముల కొరకె నే బలవరింతు'

'ఆహా ఎవరు రాసారండి?'

'పురిపండా'

'నేనూ యిలాగే పలవరించాను — పొందాను.'

సూర్యం మౌనంగా అదెలా సాధ్యం అన్నట్లు ఒకసారి శ్రీనివాస్ వేపు చూసాడు. 'విగా సంశయం నాకు తెలుసు. రాత్రి జ్వర తీవ్రతలో యేమేమో అబద్ధాలు వాగాను. మా ప్రియురాలు తళుకు మెరుపుల ఛాయలందు విహరించక పోతే యిక్కడ వుండే ధైర్యం నాకు లేకపోయేది. అయ్యో — ఆ గీతికలో ప్రియురాలు మెరుపు కన్నె కదూ — ఆ సౌదామిని యెలా అందుతుంది?'

'ఇంతలో శెట్టిగారు లేచి సైగ చేసారు. ఇద్దరూ అతని దగ్గరకు వెళ్ళారు. ఇంకా అతని ముఖంలో భయం తాండవిస్తోంది. సూర్యం చెయ్యిపట్టుకుంటూ.

'రాత్రి మీరు లేకపోతే చచ్చిపోయేవాణ్ణి'

'మీరు ధైర్యంగా వుండండి. ఏ జబ్బు యేం చెయ్యలేదు'

'పిరికివాడు రోజూ చచ్చిపోతుంటాడని పెద్దలంటారు' అని శ్రీనివాస్ అందుకున్నాడు.

'బాబూ! మా తాత పిరికోడు. తండ్రి అంతకంటె పిరికోడు. మరి నా సంగతి చెప్పకండి'

'మీ కొడుకులు పిరికివాళ్ళు కారే!' సూర్యం అందుకున్నాడు.

'ఆ పిరికి తనం లేకపోవటమే పెచ్చి రేగి పోతున్నారు'

'ఏం చేస్తున్నారండీ? బాగా ఆర్జిస్తున్నారుగ' శ్రీనివాస్ అన్నాడు.

'అవును. ఆర్జిస్తున్నారు. నేను యేభయ్యేళ్ళు కష్టపడి గడించినంత ఒక్క నెలలో దోచేద్దామని వుబలాటం. యేపారం లోనూ న్యాయం వుండాలి బాబూ.'

'మీరు పిసినారి కదా?' శ్రీనివాస్ అంటే,

'నా విషయంలో నేను పిసినారి నయ్యాను. నా కోసం అణాఖర్చు పెట్టే మిగతాది యేపారం మీద పెట్టాను. కానీ యెదుటి వాడికి అన్యాయం సెయ్యలేదు. నేను పిరికోణ్ణి కాబట్టి, న్యాయాన్ని కెళ్ళాను. నా కొడుకుల్లో ఆ పిరికి లేదు. అందుకే వద్దన్నా దొంగ యేపారం చేస్తున్నారు.'

సూర్యంకు శెట్టిగారి నిజస్వరూపం ప్రత్యక్షంకాగానే అతనిమీద యెనలేని గౌరవం యేర్పడింది. అతని కొడుకుల అన్యాయం అతనిలోభానికి అంటగట్టేసారు. పేసినట్ల కొడుకులు. వాడు అతనిదైపోయింది.

'మీకేమండి కొడుకులు భుజాలవంటి వాగు. మీ కాలు క్రింద పడనివ్వరు !' శ్రీనివాస్ అంటే

'వాళ్ళిదంతా అభిమానంతో చేస్తున్నారనా?'

'కాదనగలరా?'

'మీరింకా చిన్నవారండి. లోకం సంగతి తెలీదు.'

శ్రీనివాస్‌తోపాటు సూర్యంకూడా ఒక్కసారి వెనుకకు తగ్గాడు.

'చెప్పండి. లోకం సంగతి వింటాం !'

నాలుగువంచాలు

'ఈవేళ కళ్ళుమూస్తే రేపటికి రెండో రోజు, పదిరోజులు తరవాత మరచిపోతారు.'

'అభిమానం మరవనివ్వదు.'

'నామీద అభిమానం వుంటే మీరన్నది ఒప్పుకుంటాను.'

'మరెవరిమీద?'

'నా డబ్బుమీద — నే గడించిన ఆస్తి మీద.'

'ఎవరి కివ్వవలసింది వారికిస్తారుగా !'

'ఇంకా పదివేలు నాదగ్గర వున్నాయని వాళ్ళ అంచనా.'

'నిజంగా వున్నాయా?'

'ఉన్నాయా — లేవు — నేనుగాని మూట గట్టుకపోతానా? నేను బాధతో ఛస్తుంటే ఆ డబ్బుగుట్టు లాగుదామని అభిమానం నటిస్తున్నారండీ — అభిమానం.'

'నేను నమ్మను' అన్నాడు శ్రీనివాస్.

'నమ్మించాలా?'

'చెప్పండి.'

'అసలైన అభిమానమే వుంటే ఇద్దర్లో యెవడో ఒకడు రాత్రుళ్ళు దగ్గరవుండి సేవ చేసేవాడా? ఆ రామంకున్న అభిమానం వాళ్ళకుందండీ? నాలుగు రాత్రుళ్ళు పెళ్ళాలను వదిలివుండలేరూ?'

ఈ చివరి ప్రశ్నతో శెట్టిగారు కొడుకుల అభిమానం విషయమై యెంత బాధ పడుతున్నదీ అర్థమైపోయింది. సూర్యం అతని గాథలో అగాధాలను మనసులో అన్వేషిస్తుంటే శ్రీనివాస్ చనువుకొద్దీ 'అయితే శెట్టిగారూ! మీ కొడుకులకు అభిమానం లేదు. కూతుర్ల అభిమానం యెందుకు లెండి. బయటకు పోయారు. మీ ఆవిడ కొడుకుల తరఫే అనుకుంటాను. అలాంటివి మీకు చావంటే అంత పిరికెందుకు?'

'బాగా అడిగారు. నేను ఒక్కరికోసం బ్రతకాలి. నాకు హెచ్చు వద్దు — మరో ఐదేళ్ళు బ్రతికితే చాలు — ఒక కోవెల కట్టించేస్తాను.'

'దేవుడికి బాగా యెరచూపించారే! ఈ లంచం పుచ్చుకుని సహాయం చేస్తాడో లేదో చూడాలి' అన్న శ్రీనివాస్ మాటలకు.

'ఈ వారంలో తేలిపోతుంది' అన్నాడు విచారంగా శెట్టి. ఇంకా అతనిని ప్రశ్నలతో బాధపెట్టడం యిష్టంలేక పైకి నల్లగా కనిపిస్తూ, పిరికివాడుగా పరమ లోభిగా చలామణియైన యీ శెట్టిగారిలో యింతటి మానవత్వం వున్నందుకు సూర్యం ఆశ్చర్యపోయేడు. మానవత్వం యేదో ఒక పాలులో లేకుండా మనిషి పుట్టుకే రాదు. కొందరి మనుషుల్లో పెద్ద అక్షరాలతోనూ మరికొందరిలో చిన్న అక్షరాలతో నూ ఈ మానవత్వం వుంటుంది. పెద్ద అక్షరాలు, అందరికీ కనిపిస్తాయ్, చిన్నవాటికి కళ్ళద్దాల అవసరం వుంది. పరీక్షగా చూస్తేగానీ కనిపించదు. అతని సంగతి పూర్తిగా తెలుసుకోవాలని సూర్యం అనుకున్నాడు. (ఇంకా వుంది)



హ్యూలెట్స్ మిక్స్చర్ జీర్ణశక్తికి ఉపకరిస్తుంది.


మీరు అజీర్ణంతో బాధపడుతున్నారా! కడుపునొప్పి ఎక్కువగా వున్నదా? అందువల్ల అసౌకర్యంగా వుంటుంది. ఏకాగ్రత లోపిస్తుంది. అకారణంగా కోపం వస్తుంది.

వెంటనే హ్యూలెట్స్ మిక్స్చర్ తీసుకోండి. అది చాలా త్వరగా, శక్తివంతంగా పనిచేసి కడుపునొప్పిని తొలగిస్తుంది.

అది కడుపులోపల — రక్షణ కవచంవంటి ఒక పొరను కల్పిస్తుంది. ఆమ్లపదార్థాలని నిర్మూలించి, ఆహారం సులభంగా జీర్ణమవడానికి తోడ్పడుతుంది. హ్యూలెట్స్ మిక్స్చర్ పిల్లల జీర్ణకోశ వ్యాధులకు కూడా చాలా మంచిది.

విరేచనాలని అరికట్టడానికి హ్యూలెట్స్ మిక్స్చర్ (నల్లనిమూత) వాడండి

సి. జె. హ్యూలెట్ అండ్ సన్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
150-A/2, మౌంటు రోడ్డు, మద్రాసు-2



అందమైన భార్య

ప్రకాశరావు

కొన్ని సంఘటనలు మరపురాకుండా వుండిపోతే మరి కొన్నింటిని తేలిగ్గా మరచిపోతాం. అవసరంలేని విషయాలనూ, బాధాకరమైన సంగతులనూ బయటకు తోసి కావలసినవి మాత్రం జ్ఞాపకం పెట్టుకోగలగడం మానవుడి మేధస్సుకు గొప్ప వరం. కాని మనం మరిచిపోయా మనుకున్న విషయాలు కొన్ని మెదడులో మరుగున పడివుంటాయి. వాటి అవసరం వచ్చినప్పుడో, మరో సందర్భం వల్లనో నిద్రాణమైవున్న జ్ఞాపకాలు ఒక్కసారిగా మళ్ళీ జరిగినట్లే కదులుతాయి కళ్ళ ముందు. నా విషయంలో అంతే జరిగింది ఒకసారి.

బెనర్జీ నేనూ ఒకేచోట లెక్చరర్లుగా చేరడం కేవలం యాదృచ్ఛికం. ఖరగ్‌పూర్‌లో చదువుకుంటున్నప్పుడు వంటబట్టిన బెంగాలీ మమ్మల్నిద్దరినీ మరీ సన్నిహితులుగా చేసింది. బెనర్జీ బాగా సరదా మనిషి. ఇంటర్వ్యూకు వచ్చినప్పుడు మొదటిసారి కలుసుకున్నాం మేము.

మనసులో ఎంత విషాదముంటే ముఖం మీద చిరునవ్వు అంతతీయగా వుంటుం దనడానికి చక్కని ఉదాహరణ బెనర్జీ. తండ్రిపోయిన తరవాత కష్టపడి ఎమ్.ఈ. పూర్తి చేసుకున్నాడు. ఆ తరవాత కలకత్తాలోనే కొన్నాళ్ళు వుద్యోగం చేసి ప్రస్తుతం నాతోబాటు ఢిల్లీలో చేరాడు. ఇద్దరు ఆడపిల్లల పెళ్ళిచేయడం భారత దేశంలో సాధారణ విషయం కాదు. ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళి చేయడానికి బెనర్జీ ఎంత శ్రమించినదీ తేలిగ్గానే వూహించుకోవచ్చు. నా పెళ్ళై మూడేళ్ళైనా నాకంటే వయసులో కొద్దిగా పెద్దవాడైన బెనర్జీకి ఇంకా పెళ్ళి కాకపోవడానిక్కారణం అదే నేమో. రెండవ చెల్లి పెళ్ళి కూడా అయి నిలదొక్కుకోగలిగిన తరవాత తల్లి పోరు పడలేక తన పెళ్ళివిషయం ఆలోచించడం మొదలెట్టాడు. బెనర్జీ ఇంటికి అప్పుడప్పుడు పోతూ వుండడంవల్ల నాకు తెలిసిన విషయాలివి.

ఓ రోజు హడావుడిగా దూసుకువచ్చాడు బెనర్జీ నాగదికి. చేతిలోవున్న కాగితాలను బల్లమీద పడవేసి కుర్చీలాగి కూర్చున్నాడు. గోవిందా అనుకుని కలం జేబులో వేసుకుని పుస్తకాలు మూసి పక్కకు నెట్టాను. నేనడగబోయే లోపునే ఒక్కముక్కలో తేల్చాడు తను వచ్చిన పని.

'మనం చండీఘర్ వెళ్ళాలి.'

'మనం అన్నావు గనక ఎందుకు?, ఎప్పుడు? నేకూడా నీతో ఏడవడం ఎందుకు? నేనుకూడా వస్తానని ఎందుకనుకుంటున్నావు?...లాంటి ప్రశ్నలకు జవాబులు అదే క్రమంలో ఇవ్వాల్సిన అవసరం ఎంతేనా వుంది.' కుర్చీలో వెనక్కివాలి అన్నాను.

'అదే వరసలో ఇవ్వాలివ్వడం కష్టం: టూకీగా చెప్పాలంటే నీవుకూడా రావడం ఎంతేనా అవసరం. పైగాభాభీజీ లేరు గనక ఈ మూడురోజుల సెలవుల్లో నీవు రాగలవని నా అభిప్రాయం — వస్తావనే నా నమ్మకం.'

నాకు నవ్వొచ్చింది; అసలు విషయా న్నతడు వదిలేసి పదేపదే నీవూ రావాలి అంటూంటే. 'అసలు విషయం చెప్పలేదు. నీవు చండీఘర్‌కు వెళ్లడం ఎందుకు? నీతోబాటు నేనూ అఘోరించడం ఎందుకు?'

'చెప్పాలంటే చాలా పెద్దకథ. అందు కని నీకు విసుగు రాకుండా ముఖ్య విష యాలు మాత్రం చెప్తాను. ఇప్పుడే క్లుప్తంగా చెప్పాలంటే...ఇదో...'

ఆ తరవాత ఏం మాట్లాడకుండా కోటుజేబులోంచి ఓ కవరు తీసి నాముందు గిరాటేశాడు.

అతన్నే చూస్తూ ఆ కవరు విప్పి కాగితాలు బయటకు లాగాను. బెనర్జీ నిర్లక్ష్యంగా బయటకు చూస్తున్నాడు. ఆ కాగితం మడతల్లో ఒక అమ్మాయి ఫోటో కనిపించేసరికి దాదాపు అంతా అర్థ మైంది. ఆ వుత్తరం అమ్మాయి తండ్రి వ్రాసింది—బెంగాలీలోవుంది.

'పెళ్లి చూపులా ?'

బెనర్జీ నన్నే చూస్తున్నాడు. అవు నన్నట్టు తల పంకించాడు.

మళ్లీ ఆ ఫోటోవేపు చూశాను. ఆ అమ్మాయి సౌందర్యం ప్రస్ఫుటమయ్యే చక్కని కోణంలో తీసిన ఫోటో అది. కుడిచేయి సున్నితంగా బల్లమీద మోపి, రెండోచేయి క్రిందికి జార్చి చీర కుచ్చెళ్ళను నాజూగ్గా పట్టుకుని, తల కొద్దిగా ఎడంవేపు తిప్పివుంది. నిండుగా చీరలో వున్నా ఆమె అవయవ సౌందర్యం కొట్టవచ్చినట్టు కనిపిస్తూంది. చక్కని నిష్పత్తిలోవున్న శరీరాకృతి, రీటా ఫరియా ఆకారాన్ని జ్ఞప్తికితెచ్చే లావణ్యం ఆమెది. ఆకర్షణీయమైన గుండ్రని మొహం. సంపూర్ణ యవ్వనంలోవున్న మనోహర రూపవతి ఆమె. ఇంత చక్కని అమ్మాయిని వెతుక్కోగలగడం బెనర్జీ అదృష్టం అను కున్నాను.

కవర్లోకి ఫోటో తోస్తూ చిన్నగా నవ్వి అన్నాను, 'కంగ్రాట్స్! ఎవరీమె ?'

'చెప్పాగా చాలా పెద్ద కథ అని. అయినా చెప్పమంటే నాకేం అభ్యంతరంలేదు ... దాదాపు నాలుగునెల్లక్రింద ఓ బెంగాలీ దినపత్రికలో ప్రకటన వేయించాను. ఒక అందమైన, ఎమ్.ఏ. పాసై నెలకు ఎని మిదివందల జీతంతో ఢిల్లీలో వుద్యోగం చేస్తున్న ఇరవైతొమ్మిది సంవత్సరముల బెనర్జీ యువకునికి అందమైన, చదువు కున్న భార్య కావలెను— అంటూ. దానికి జవాబుగా యాభై వుత్తరాలు వచ్చాయి. వాటిలో పన్నెండుమందిని ఎన్నుకుని ఫోటో జాతకం పంపమని వ్రాశాను. పది ఫోటోలు వచ్చాయి. ఈ అమ్మాయి నా ప్రథమ ఎన్నిక—బహుశ ఈమెనే...' అంటూ ఆగి పోయాడు.

కవరు తిప్పిచూశాను. బెనర్జీ తల్లి పేర వ్రాసివుంది. నాకు చటుక్కున జ్ఞాపకం వచ్చింది. అదే ఆంధ్రలో అయితే ఇలాంటి ప్రకటనలనెవ్వరూ గంభీరంగా తీసుకోరు. 'ఆఁ! ఎక్కడా చెల్లని సరకు' అని చప్ప రించేస్తారు. అలా పత్రికల్లో ప్రకటిం చడం ఇంకా ఏదో అగౌరవమైన విషయం గానే భావిస్తారు మనవాళ్ళు.

'ఇంటరెస్టింగ్! బెంగాలీల్లో ప్రక టనలద్వారా పెళ్ళిళ్ళు కుదరడం అంత సామాన్యమైన విషయమా?' మామూలు గానే అడిగాను నేను.

'అవును ఏం? ఒకవిధంగా చూస్తే చాలా అవసరంకూడా. వుద్యోగరీత్యా దూర ప్రాంతాల్లో వుండిపోయిన వాళ్ళతో సంప్ర దించడం మరోలా సాధ్యంకాదు. మా చెల్లె ళ్ళిద్దరికీ ఇలాగే కుదిరాయి.'

ఈ విషయంలో బెంగాలీలు వింతో ముందున్నారనిపించింది నాకు. కట్నం విష యంలో మధ్యవర్తిద్వారా ఒప్పందం కుదిరింతరవాత కానీ అసలు విషయానికి దిగరు. కట్నం లేకుండా వివాహాలు జరగడం ఇంకా అరుదే మనలో.

'బెంగాలీల్లో వరకట్నం పూర్తిగా నశించిపోయిందనలేం. కాని కట్నం తీసుకోక పోవడమనేది అరుదుకాదు. నిజానికి నేను కట్నమే కాదు, మరే విలువైన బహుమతి కూడా స్వీకరించుకోదలుచుకోలేదు' బెనర్జీ సాలోచనగా దృఢంగా అన్నాడు.

మళ్లీ కాస్సేపాగి చిలిపిగా అన్నాడు, 'నాక్కావలిసింది అందమైన భార్య, చక్కని స్నేహితురాలు, లాలించే ప్రియురాలు ... అంతే. డబ్బు నేనూ సంపాదించగలను.'

బెనర్జీకి ఆ అమ్మాయి ఎంత నచ్చిందో అతని తల్లితో మాట్లాడిన తర్వాత బాగా అర్థమైంది నాకు. నేనేమీ ఆశ్చర్యపోలేదు. తన కొడుకు ఫలానాతేదీ వచ్చి అమ్మాయిని చూస్తాడనీ, నచ్చిన విషయం తెలియజేసి సంప్రతింపులకు ఎప్పుడు రావలసిన సంగతి అతడే చెబుతాడనీ వ్రాశానని చెప్పారు ఆమె నాకు. దీన్నిబట్టి బెనర్జీ ఆ అమ్మాయిని తప్పక పెళ్లిచేసుకోదలచుకున్నాడని అనిపిం చింది నాకు. ఈ పెళ్లిచూపులు కేవలం ఒక వంకగా తీసుకుని తన నిశ్చయాన్ని వాళ్లకు చెప్పడానికి మాత్రం వెళ్తున్నాడని వూహించుకున్నాను. ఆ అమ్మా - తండ్రి, చక్రవర్తిదికూడా ఏమంత స్థితిగతులున్న కుటుంబం కాదు. ఆయన పెన్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. ఈ అమ్మాయికి ఇద్దరు చెల్లెళ్ళూ, బి. ఈ పాసైన అన్నా వున్నారు. బెనర్జీకంటే మంచి సంబంధం వాళ్ళకు దొరకడంకూడా బహుశ కష్టమే అనిపిం చింది నాకు.

బెంగాలీల్లోకూడా ఇలా పెళ్లిచూపు లకు అబ్బాయి వంటరిగా వెళ్ళడు. బెనర్జీ తల్లి పెద్ద వయసువల్ల దూర ప్రయాణాలు చేయలేరు. అందుకే ఆవిడ నన్ను కూడా వెళ్ళమని అడిగారు. నిజానికి పెళ్ళి చూపులు ఎలా జరుగు తాయో నాకూ తెలియదు. మా ఆవిడతో పెళ్లికి ముందునుండీ బాగా పరిచయం గనక పెళ్ళి చూపుల్లాంటివి ఏవీ లేకుండానే మా పెళ్ళి అయిపోయింది. పైగా వుత్తర దేశస్థుల ఆచార వ్యవహారాలు అట్టే తెలి యవు నాకు; అయినా బెనర్జీ వెంట బయ ల్దేరక తప్పలేదు.

సాదరంగా ఆహ్వానించాడు చక్రవర్తి మా ఇద్దరినీ. చండీఘర్‌లో పంచాయత్ భవన్‌లో మకాంవేసి మర్నాడు వుదయమే వెళ్లాం వాళ్లింటికి. ఆ రోజే సాయంత్రం లోగా తిరుగు ప్రయాణమవ్వాలని మా ప్లాను

చక్రవర్తి మామూలు లావులో కొద్దిగా పొడుగ్గా వున్నాడు. మేం కూర్చుంటుండగా చక్రవర్తి భార్య కూడా వచ్చి పలకరిం చింది. చక్రవర్తి కొడుకు కూడా కాస్సే పటి తరవాత వచ్చి కూర్చున్నాడు. మాతో

లాటు. బెనర్జీ అతన్ని నిశితంగా చూస్తూండటం గమనించాను నేను. కాస్సేపు మామూలు సంభాషణల్లోనే గడిచింది.

హఠాత్తుగా అన్నాడు చక్రవర్తి. 'అమ్మాయిని ఇప్పుడే చూస్తారా? లేక భోజనాల తరవాత చూస్తారా ... మీ యిష్టం...'

బెనర్జీ ఇబ్బందిగా నావేపు చూశాడు. అతని కళ్ళల్లో ఆత్రుత గమనించి నాకు నవ్వొచ్చింది. ఆ అమ్మాయిని కళ్ళారా చూడాలని తహ తహ లాడిపోతున్నాడు అతను.

'...ఇప్పుడు చూడ్డానికీ మాకు అభ్యంతరం లేదు.' మీ ఇష్టం అన్నట్లుగా అన్నాను.

ఇంతలో ఓ పదిహేడేళ్ల అమ్మాయి ట్రేలో ప్లేట్లు, టీ పట్టుకుని వచ్చింది. ట్రే టేబుల్‌మీద వదిలి నమ్రతగా నమస్కరించింది. 'పూర్ణిమ' అని పరిచయం చేశాడు చక్రవర్తి.

చక్రవర్తి కొడుకు బెనర్జీకి ప్లేటు అందిస్తూంటే చక్రవర్తి మరో ప్లేటు నాకు జాగ్రత్తగా పట్టుకుని అందించాడు. నెమ్మదిగా ఫలహారం చేస్తూ మాట్లాడు కుంటున్నాం. బెనర్జీ కదలికల్లో తొందర, ఆదుర్దా స్పష్టంగా కనిపించింది నాకు. రసగుల్లా తింటుంటే రెండుసార్లు పొల మారింది అతనికి. వీలైనంత గంభీరంగా వుండడానికి ప్రయత్నిస్తున్నాడతను. మంచి నీళ్ళ గ్లాసు బల్లమీద పెడుతూ అడిగాడు బెనర్జీ,

'మీ అబ్బాయి ఏం చేస్తున్నాడు?'

చక్రవర్తి మొహం కొద్దిగా ముడత పడింది. సాధ్యమైనంత మామూలుగా అన్నాడు, 'పోయిన ఏడే బి.ఈ. పాసయ్యాడు .. ఇప్పుడు వుద్యోగ ప్రయత్నంలో వున్నాడు. ఈ నెల్లోనే దొరకవచ్చు.'

మళ్ళీ అన్నాడు చక్రవర్తి 'అమ్మాయి బి. ఏ. ప్యాసై రెండేళ్ళయ్యింది. ఈ మధ్యే సంగీతం బాగా నేర్చుకుంది. కుట్లూ అల్లికలూ చాలా బాగా వచ్చు; ఫ్యాబ్రిక్ పెయింటింగ్, చిత్రలేఖనం కూడా వచ్చు. ఈ డిజైన్ మా అమ్మాయి వేసిందే' టేబుల్ మీది బట్టను చూపించాడు.

చక్రవర్తి భార్య తెర తొలిగించి ఓసారి చక్రవర్తివేపు చూసి లోపలికి వెళ్ళింది.

ఇప్పుడే వస్తానని చక్రవర్తి ఆమె వెనకే వెళ్ళాడు. పూర్ణిమ వచ్చి ప్లేట్లు జాగ్రత్తగా పట్టుకుపోయింది.

గదిలో నేనూ బెనర్జీ మాత్రం వున్నాం. అతడేదో ఆలోచిస్తూ గదిని నలువేపులా పరీక్షగా చూస్తున్నాడు. గది ఆడంబరంగా కాకున్నా అందంగా అలంకరింపబడి వుంది. సోఫా సెట్ రంగులోనే పెయింట్ చేసి వున్నాయి గోడలు. చిన్న గాజు అలమారులో బొమ్మలు పేర్చి వున్నాయి. గోడకు రెండు వర్ణచిత్రాలు తగిలించి వున్నాయి. కిటికీలకు పసుపు పచ్చని తెరలు ఎండ లోపలికి రాకుండా అడ్డు పడుతున్నాయి. బెనర్జీ ఒక్కసారిగా లేచి కిటికీ తెరలు పక్కకు జరిపాడు; నా పక్కన కూర్చుంటూ రహస్యంగా అన్నాడు,

'ఈ పచ్చని తెరలు కళ్ళను మోసం చేస్తాయి తెలుసా! ఆమె శరీర వర్ణం సరిగ్గా తెలియదు.'

నాకు ఇది ఘోరమనిపించింది. అతన్ని మోసం చేయడానికి చక్రవర్తి తెలివిగా పచ్చతెరలు కట్టాడనుకోవడం. నేనేదో అనబోయేలోగా చక్రవర్తి వచ్చాడు. ఆ వెనకే మందగమనంతో ఆయన కూతురూ, ఆ వెనక తల్లీ వచ్చారు.

నేననుకున్నట్టే అసాధారణ సౌందర్యఖని కాకపోయినా అత్యంతాకర్షణీయమైన విగ్రహం ఆమెది. ఆమె ప్రతి అవయవమూ పొందుగా శిల్పి తీర్చి దిద్దినట్లున్నాయి. నల్లని పొడవాటిజడ ఆమె పచ్చని దేహచ్ఛాయవల్ల ఇంకా నల్లగా కనిపిస్తూంది. ముఖాన ఎర్రటి బొట్టు తళతళ లాడు తూంది. నమస్కరించి, మేం కూర్చున్న తరవాత తలవంచుకు కూర్చుంది ఆమె.

ఇక బెనర్జీ ప్రశ్నలడగడం మొదలెట్టాడు.

'మీ పేరు?'

'బందన చక్రబొర్తి.' (వందన చక్రవర్తిని బెంగాలీలు అలాగే ఉచ్చరిస్తారు.)

'మీ హాబీలు ఏమిటి?'

'సంగీతం కొద్దిగా వచ్చు. పెంటింగ్, కుట్లూ నేర్చుకున్నాను.'

'వంట బాగా వచ్చా?'

ఆడపిల్లకు ఎన్ని వచ్చినా రాకపోయినా వంటమాత్రం వచ్చితీరాలి. అసలు ఆడపిల్లలు వంటకు తప్ప మరి దేనికీ పనికి రారని మనవాళ్ళ అభిప్రాయం.

'మృష్టాన్నం వండేప్పుడు చక్కెర మొదటే వేస్తారా? లేక అంతా వుడికిం తరవాత వేస్తారా?'

బెంగాలీలో పరమాన్నాన్ని మృష్టాన్న మంటారు.

'బి. ఏ. తరవాత చదువెందుకు ఆపారు?'

'బి. ఏ. లో సబ్జక్ట్సు ఏమిటి?'

ఇలా కాస్సేపు బోరుకొట్టి ఆతరవాత అడిగాడు—ఏదేనా పాడి వినిపించమని. ఆమె కంఠం శ్రావ్యంగా వుంది; బాగా సాధన చేసివుంటుంది.

'స్వరాలు ఎన్నిరకాలు?'

'శుద్ధస్వరమనీ, వికృతస్వరమనీ రెండు రకాలు—చలస్వరమనీ, అచలస్వరమనీ కూడా విభజిస్తారు.'

'వికృతస్వరాలు ఎన్నివిధాలు?'

'కోమల వికృతమనీ, తీవ్ర వికృతమనీ రెండు విధాలు'

'రాగాలు ఏవేవి నేర్చుకున్నారు?'

'...కళ్యాణ్, బిహాగ్ ... భూపాల్, భైరవీ...'

'భైరవీరాగానికీ భైరవ్‌రాగానికీ తేడా చెప్పగలరా?'

యూ. పీ. ఎస్. సీ ఇంటర్వ్యూలో అడిగినట్లడుగుతున్నాడు. సంగీతం వచ్చునన్న పాపానికి ఇంత తరిచి అనుమానంగా ప్రశ్నలు వేయడం ఎందుకు? ఆ మాటకువస్తే పెళ్ళి తరవాత సాధన చేసుకోవడానిక్కూడా తీరుబడి వుండదు చాలామందికి. మా వాడికి నిజానికి సంగీతం ఏమాత్రం రాదు—ఏదో కొద్ది పరిచయం తప్ప.

ఆ అమ్మాయి వీడువేసిన ప్రశ్నకు ఒక్కసారిగా బిత్తరపోయింది. ఏదో జవాబివ్వ బోయి ఆగిపోయి తల వంచుకు కూర్చుంది, జడను చేత్తో తడుముకుంటూ హిందూస్తానీ సంగీతంలో భైరవ్, భైరవి రెండు వేరే రాగాలనీ; భైరవ్‌లో రి, ధ మాత్రం కోమలస్వరాలు, భైరవిలో అన్నీ కోమల స్వరాలనీ ఎవరో చెప్పగా విన్నట్టు జ్ఞాపకం అని బెనర్జీ చెప్పాడు తర్వాత నాకు.

మావాడు ఆ అమ్మాయి పూర్తిగా నచ్చినట్టే మాట్లాడి ఇక్కడికి వచ్చి శల్య


అతనంటే నాకుప్రాణం. అతన్తో ఎట్లాచెప్పేది?
Binaca
Binaca
Green

పరీక్షచేయడం నాకు బొత్తిగా నచ్చలేదు. విశానికి ముళ్ళమీద కూర్చున్నట్టుగా ఫీల య్యాను అంతసేపు. ప్రేక్షకుడుగా వున్న నాకే అంత బాధాకరంగా అనిపిస్తే ముద్దా యిలా పరీక్షింపబడుతున్న ఆ అమ్మాయి స్థితీ, ఓర్పుగా కూర్చున్న ఆ అమ్మాయి తలితండ్రుల అవస్థా వర్ణించడమే కాదు. వూహించుకోగలగడం కూడా నాకు సాధ్యం కాని పని. 'అమ్మాయి అంటే అంత లోకువా!' అని మాత్రం అనుకోగలిగాను. తన చెల్లెళ్ళ పెళ్ళికి అంత గొడవపడ్డ తరవాత కూడా బెనర్జీ ఇలా ప్రవర్తించడం క్షంతవ్యం కాదనిపించింది నాకు. బాధలవల్ల మనిషి మానవుడిగా మారతాడంటారు, కొందరు—అంటే లోతుగా ఆలోచించలేని వాళ్ళు మానవత్వాన్ని ఏ పరిస్థితుల్లో కూడా సంతరించుకోలేరు.

ఈ ధీరుడు వేసే ప్రశ్నలకు తడబడుతూ, కొంత భయంవల్లా, కొంత స్త్రీ సహజమైన లజ్జవల్లా కుంచించుకు పోయి కూర్చుంది ఆ అమ్మాయి.

ఒక్కసారిగా నావేపు తిరిగి అన్నాడు బెనర్జీ.

'నీవేం అడగవేం? నీవూ అడుగు ఏదేనా.'

ఆ అమ్మాయి తలెత్తి నా వేపు చూసింది. బెదురుగా రెప రెపలాడాయి కళ్ళు. నేనేం అడుగుతానో అనేమో!

చిరాగ్గా అన్నాన్నేను, 'నీవడిగిన ప్రశ్నలు

అందమైన భార్య

చాలు. ఇప్పుడా అమ్మాయి అడుగుతూంది నిన్ను.'

అంతా ఒక్కసారి నవ్వారు. వందన చక్రవర్తి కూడా ఫక్కున నవ్వింది.

'అవును!' ఉదారంగా అన్నాడు బెనర్జీ, 'ఏదేనా అడగాలంటే అడగండి.'

ఆ అమ్మాయి తలవంచుక్కూర్చుంది, పమిట సర్దుకుంటూ. తల్లి ఒకసారి హెచ్చరించినా ఏం మాట్లాడలేదు.

ఇక చాలు అన్నట్టుగా చూశాన్నేను చక్రవర్తి వేపు. విడుదల పొందిన దామ చిలకలా ఫీలైంది ఆ అమ్మాయి.

ఆ తరవాత కాస్సేపటికి అలా చూసి వస్తామన్న మిషమీద బయటపడ్డాం మేమిద్దరమూ. తోవలో అన్నాడు బెనర్జీ.

'నే చాలా నిరాశ పొందాను రఘూ, ఈమె నేననుకున్నంత అందంగా లేదు. ఆ ఫోటో చూసి చాలా మోసపోయాననిపిస్తూంది నాకు.'

'కాదు. వందన చక్రవర్తిని వున్న దానికంటే ఎన్నోరెట్లు ఎక్కువ సౌందర్యవతిగా వూహించుకున్నావు నీవు.'

తీవ్రంగా చూశాడు బెనర్జీ. కాస్సేపాగి చిన్నగా అనుమానంగా అన్నాడు.

'ఈ అమ్మాయికి ఇద్దరు చెల్లెళ్ళన్నట్టు రాశాడు ఈయన. కాని మనకు ఒక చెల్లెలే కనిపించింది. నా వుద్దేశ్యంలో మనం చూసిన ఇద్దరమ్మాయిలకూ మధ్య కూతురు ఆమె అని. ఆమె ఈ ఇద్దరి కంటే అందంగా వుండేదిరాలి, అందుకే ఆమెను మనకు చూపించలేదు...'

నేనేం మాటాడలేదు.

'కాని...ఈయన కొడుకు చదువులో మొద్దబ్బాయిలా వున్నాడే. ఈ అమ్మాయికి ఇరవై రెండేళ్ళన్నారు — అంటే ఆమె అన్నయ్యకు ఇరవైనాలుగు ఇరవైఐదేనా వుంటాయి. ఇరవైనాలుగేళ్ళకు బి. ఏ. దాటా డంటే బండియెక్కాడో...'


'నీవు పెళ్ళి చేసుకునేది అమ్మాయిని కదూ', చిరాకును సాధ్యమైనంతగా కప్పిం పుచ్చి సౌమ్యంగా అన్నాను. 'ఆమె రెండేళ్ళ క్రిందే బి. ఏ. పాసైందన్నారు; సంగీతం, వేరే పనికి వచ్చే విషయాలూ కూడా నేర్చుకుందావిడ...'

'కావచ్చు! కాని ఆ అమ్మాయి రక్త సంబంధీకుల ప్రభావం పుట బోయే (మా) పిల్లలమీద చాలా వుంటుంది.''

'జెనటిక్స్ చాలా కాంప్లెక్స్ సబ్జెక్టు బెనర్జీ. ఆ విషయంలో ఏమీ తెలియని వాళ్ళం మనిద్దరం చర్చను దిగితే చాలా హాస్యాస్పదంగా వుంటుంది. ఏవో కాకమ్మ కబుర్లు చెప్పుకుని లాభంలేదు ..నీక్కావలిసింది చక్కని స్నేహితురాలూ, లాలించే ప్రియురాలు మాత్రం — అని అన్నావు గుర్తుందా?'

'అవును కాని ఈ అమ్మాయి నేననుకున్నంత అందంగా లేదు,' బెనర్జీ మళ్ళీ మొదటికొచ్చాడు. 'ఈమె నిజంగా అందగత్తె అయివుంటే నేనీ విషయాలేవీ ఆలోచించక పోయేవాడిని. ఆ ఫోటోలో ఈమె అంత అందంగా లేకపోతే అసలు ఇక్కడికి కూడా వచ్చేవాడిని కాదు. వీళ్ళదేమంత గొప్పకుటుంబమని!... నేనెంతో ఆశతో వచ్చాను రఘూ. అందమైన భార్య కావాలని నా కోరిక. అది బలహీనతే అనుకోరాదేనా అను.'

'కుటుంబ వ్యక్తుల ప్రభావం పిల్లల మీద వుంటుంది అని ఓ వేపు అంటూనే మరోవేపు ఈమె అందంగా వుండివుంటే అవేం ఫరవాలేదు అంటున్నావు. ఈ అమ్మాయి అతిలోక సౌందర్యవతి కాకపోవచ్చు కాని అందంగా లేదు అని నేనన



శోభ.'

'ఆ అమ్మాయి నవ్వినప్పుడు నీవు గమనించలేదా ? ముందు పళ్ళు మరీ పెద్దగా వికారంగా వున్నాయి...'

'గుర్రాలను కొనేముందు ఇలాగే పరీక్షిస్తారు.' —వళ్ళు మండింది నాకు.

తిరిగి వాళ్ళింటికి వెళ్ళినప్పుడు ఓ ఏడేళ్ళ పాపను తన చిన్నకూతురని చక్రవర్తి చెప్పినప్పుడు బెనర్జీ మొహంలో కత్తివాటుకు నెత్తురు చుక్కలేదు. ఏదో తప్పు చేసినవాడిలా చూపులు తిప్పుకున్నాడు నానుండి. భోజనాలప్పుడు మాటల్లో అన్నాడు చక్రవర్తి.

'...నెలాళ్ళక్రితమే ఓ సంబంధం వచ్చింది. అబ్బాయి జర్మనీలో సెటిల్ అయ్యాడు. కొద్దినెల్ల కోసం వచ్చాడట ఇక్కడికి. అన్నీ దాదాపు కుదిరినట్లే అనిపించింది. కాని ఆ అబ్బాయి పెళ్ళిచేసుకుని వెళ్తాడట—ఆతర్వాత ఏడాదికి వచ్చి తీసుకు పోతాడట అమ్మాయిని. ఈ ఏర్పాటు నాకు తృప్తికరంగా అనిపించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో మా అమ్మాయిని ఇవ్వలేనని ఖచ్చితంగా చెప్పాను...'

తిరిగి వెళ్తుంటే తోవలో ఇది జ్ఞాపకం వచ్చి అన్నాడు బెనర్జీ '—ఆయన కబుర్లు విన్నావా ! ఎవరో జర్మనీలో సెటిల్ అయ్యాడట, ఈయన కూతురును చేసుకుంటానంటే వీలేదు పొమ్మన్నాడట. సరుకు వెల్లబడి కావడానికిలాంటి కబుర్లు చాలా ముఖ్యం. ఇంతోటి అందగత్తెలు ఎవరూ లేరేమో !' వెటకారం ధ్వనించింది బెనర్జీ మాటల్లో. చాలా సేపు వాదించుకున్నాం మేము.

'ఆ అప్రస్తుత విషయాలు వదిలేయి. అసలు అందమంటే ఏమిటో చెప్పు నాకు.'

'అందమంటే ఏమిటి, ఏమిటి ? అందమంటే అందమే.' చిరాగ్గా అన్నాడు బెనర్జీ.

మొదటే అన్ని విషయాలూ జాగ్రత్తగా పరిశీలించి, ఏదేదో ఊహించుకుని వెళ్ళి ఆ అమ్మాయి చేత డ్రిల్ చేయించి నీళ్ళు కారిపోయి వచ్చాడు. అందమైన భార్య లభించడం అంత తేలిక విషయం కాదు. ఇలా చాలా ట్రిప్పుల తర్వాతగాని బెనర్జీ పెళ్ళి కాలేదు. ఈ వందన చక్రవర్తిని బొత్తిగా మరిచి పోయాన్నేను— నిజం చెప్పాలంటే ఆమె గురించి మళ్ళీ ఎప్పుడూ ఆలోచించలేదు నేను.

ఈ మధ్యే స్టుట్‌గార్ట్ యూనివర్సిటీ స్కాలర్‌షిప్ పుణ్యమా అని జర్మనీ వెళ్ళాన్నేను. సెలవురోజు షాపింగ్‌కని బయల్దేరి బస్సుదిగినప్పుడు నావెనకే ఎవరో జంట బెంగాలీలో మాట్లాడుకుంటూ దిగితే అప్రయత్నంగా వెనక్కి తిరిగాను. ఊహించని వింతేదో హఠాత్తుగా ఎదురొన్నట్లనిపించింది. మనస్సు ఒక్కరిగా వెనక్కి పరుగెత్తింది — మరుగున పడిపోయిన జ్ఞాపకాల కోసం. ఆమెకూడా నన్ను గుర్తించినట్లుగా నవ్వి పలకరించింది.

తక్షణంలో జ్ఞాపకం వచ్చింది నాకు. ఆమె ఒకప్పటి వందన చక్రవర్తి. ●

పళ్ళు - గుణాలు

జామిపండు

జామి పళ్ళలో తెలుపు, ఎరుపు అని రకాలున్నాయి. అనకాపల్లి జాంపళ్ళు మన ఆంధ్రప్రదేశ్‌లో ప్రశస్తమైనవిగా ప్రసిద్ధి చెందేయి.

బాగా పండిన జామిపండు వేడిచేసి నీరు పెంచుతుంది. ఉష్ణతత్వం గలవారి గుండెకు పొట్టకు బలాన్ని యిస్తుంది. ఎక్కిళ్ళు వస్తున్నప్పుడు జాంపండు తింటే ఆ ఎక్కిళ్ళు తగ్గుతాయి.

నీళ్ళ విరేచనాలవుతున్నట్లయితే ఒకటి రెండు పచ్చికాయలు నమలి మ్రింగండి. లేదా వాని కషాయాన్ని త్రాగండి. తగ్గుతాయి.

గంజాయి తీసుకోవడం వల్ల మత్తుగా వికారంగా ఉన్నట్లయితే— జామి ఆకుల కషాయాన్ని తగు మోతాదులో యివ్వండి. మత్తు వదులుతుంది.

లేత జామి ఆకుల కషాయాన్ని తగు మోతాదులో యిస్తే పురాణ నీళ్ళ విరేచనాలు, కడతాయి. కలరా సోకినప్పుడయే విరేచనాలు, వాంతి కూడా కడతాయి.

వాతతత్వం గలవారు జాంపళ్ళు అధికంగా తింటే కడుపు నొప్పి, తలనొప్పి వస్తుంది. కడుపులో పిటపట లాడుతుంది. కడుపు బిగవడుతుంది. జ్వరం రావచ్చు. జాంపండులోని గింజలు, పైతొక్క సులభంగా జీర్ణంకావు. మూలవ్యాధి గలవారికీ పండు మిక్కిలి అపథ్యమయినది. పండు ఏమాత్రం కుళ్ళినా అది మరి తినకూడదు.

ఈ పండు యొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు :— 1. అనుములు 2. సోపు.

కర్బూజాపండు

ఈ పండు శరీరానికి సమశీతోష్ణాన్ని కలుగజేస్తుంది. మహాశాంతి నిస్తుంది. మంచి బలాన్ని యిస్తుంది. శీఘ్రంగా జీర్ణమయి వేగంగా రక్తంలో కలుసుంది. రక్తాన్ని శుభ్రపరుస్తుంది. శరీరానికి ఉత్సాహాన్ని యిస్తుంది. బుద్ధిని వికసింపజేస్తుంది. శరీరంలో గల దుష్ట పదార్థ కూటమిని విడగొడుతుంది. కిడ్నీస్‌నకు సత్తువనిస్తుంది. మూత్రపు సంచిలోని రాళ్ళను కరిగించి మూత్రం బాగా జారీ అయేటట్లు చేస్తుంది. బాలింతలగు స్త్రీలకు బాగా పాలు పడేటట్లు చేస్తుంది. ఉబ్బుజబ్బు, పాండు రోగం గలవారికిది ఎంతో మేలు చేస్తుంది.

ఎగ్జిమా గలవారు ప్రతిరోజూ ఒకపండు చొప్పున కొన్ని దినాలపాటు తిన్నట్లయితే ఎగ్జిమా నయమవుతుంది. అన్నికాలాలలోనూ ఈ పండు దొరకదు. కావున ఈ పండు విత్తులను జాగ్రత్త చేసి వాని చూర్ణాన్ని తగు మోతాదులో పుచ్చుకోవచ్చును. ఈ పండుకు గల గుణాలే యించుమించుగా విత్తుల చూర్ణానికి కూడా ఉంటాయి. విత్తుల చూర్ణాన్ని లేదా కషాయాన్ని తగు మోతాదులో యిస్తే టైఫస్ ఫీవరు తగ్గుతుంది.

ఈ పండును పరగడుపున తిన్నట్లయితే ఆకలి మందగిస్తుంది. తలనొప్పి వస్తుంది. పైత్య జ్వరం కూడా రావచ్చు. అందుచేత పరగడుపున ఈ పండు తినకూడదు. భోజనానంతరం సుమారు రెండు గంటల తరువాత తినడం మంచిది. పైత్యతత్వం గలవారికి, శరీరంలో రక్తం అధికంగా ఉన్నవారికి ఇది హాని చేస్తుంది. అమితంగా తింటే విరేచనాలవుతాయి. గుండెకు హాని కల్గుతుంది.

ఈ పండు యొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు :— 1. తేనె 2. మిరియాల పొడి 3. పంచదార 4. పుల్లదానిమ్మపండు 5. పాలు.

సేకరణ: ఆకుండి నారాయణమూర్తి

వారఫలం

26-5-1972 శుక్రవారం మొదలు 1-6-1972 గురువారం వరకు

మేషం: లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. సంతోషకరమైన వార్తలను వింటారు.

వృషభం: భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు లాభిస్తాయి. పోటీవారిలో గౌరవం బాగుంటుంది. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. వారం ఆఖరులో వ్యతిరేక పరిస్థితి యేర్పడుతుంది. కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తారు.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అననుకూలమైన వార్తలను వింటారు.

మిధునం ఇతరుల నిమిత్తం చేసే ప్రయత్నాలు సులువుగా నెరవేరతాయి. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. వారం ఆఖరులో మీ ఆలోచనలు లాభదాయకంగా ఉంటాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. ఆడంబరం కోసం వ్యయం జరుగుతుంది.

కర్కాటకం: వృత్తివ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. పోటీవారితో వాదప్రతివాదాలు తగవు.

స్త్రీలకు— నూతన విషయాలను తెల్సుకొంటారు. దైవకార్యాలు నెరవేరతాయి.

సింహం: ఆదాయం కంటే ఆదాయపు అధికంగా ఉంటుంది. పోటీవారిలో గౌరవం లభిస్తుంది. స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో వ్యాపారంలో మీ ఆలోచనలు ఫలిస్తాయి. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణిస్తుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. ప్రయాణాలోచనలు చేస్తారు.

కన్య: అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు.

స్త్రీలకు— వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. పుణ్యకార్యాలు చేస్తారు.

తుల: రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. నూతన విషయాలను తెల్సుకొంటారు. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. వ్యాపారంలో పోటీవారి పోటీ తగ్గుతుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. శుభకార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

వృశ్చికం: వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. పోటీవారిలో గౌరవం బాగుంటుంది. ప్రయాణాలోచనలు చేస్తారు. నూతన వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు లాభిస్తాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

ధనుస్సు: అధిక వ్యయం జరుగడం వలన ఆర్థికంగా ఒత్తిడి రాగలదు. మీ తాలూకు వస్తువులు పోవచ్చును. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. బంధుమిత్రులను కల్సుకొంటారు.

మకరం: వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. మీ ఆలోచనలు లాభిస్తాయి. వారం ఆఖరులో ఆకస్మికంగా చికాకులు యేర్పడతాయి. విద్యావైజ్ఞానిక రంగాల్లో మీ కృషికి ఆటంకాలు వస్తాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు.

కుంభం: వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి. సజ్జనసాంగత్యం లభిస్తుంది. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. సమయానికి యేదో ఒకవిధంగా డబ్బు చేతికి రాగలదు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

మీనం: ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. మిత్రులకు సహాయం చేస్తారు. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరతాయి.

స్త్రీలకు— వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. దైవకార్యాలు నెరవేరతాయి.

—మహేష్



ఎద్దుకి ఎద్దు సమవుజ్జీ ఉన్నప్పుడే మంచి జత

ఎరువుల విషయంలో కూడా అంతే. నేల అవసరాలకు అవి సరితూగాలి. కాబట్టి మీరు మీ నేలను పరీక్ష చేయించాలి. మంగళగిరిలో నున్న ట్రాంబేవారి భూసార పరిశీలనా కేంద్రములో ఎఫ్. సి. ఐ. ఈ పని ఉచితముగా చేసిపెడుతుంది. నేలగురించి మరియు ఎరువుల సిఫార్సులను గురించిన ఎఫ్.సి.ఐ వారి నివేదిక మీచేతుల్లో ఉండా అంటే, సమృద్ధికరమైన పంటలు పండించటానికి మీకుకావలసిన ఎరువులను ఎన్నుకోవచ్చు. ఎఫ్.సి.ఐ వారి స్థానిక ప్రతినిధులవద్దగాని లేదా వారి డీలర్లవద్దగాని ఉచిత కరపత్రములను పొందండి.
వ్యవసాయములో మొదటిమెట్టు అయినటువంటి "మీ నేల నెరిగి పంట పండించండి" అనబడే సూత్రాన్ని గుర్తుంచుకోండి.



ఇతర వివరములకు వ్రాయండి:

ది ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్

(కేంద్రప్రభుత్వ యాజమాన్య సంస్థ) ట్రాంబే యూనిట్

6-10-173, ఫతేమైదాన్ రోడ్, హైదరాబాద్-4

సీరియల్



రాగధార

విమలారామం

జరిగిన కథ

మాధవరావు ఆ వూళ్ళోకి స్కూలు మాస్టారిగా వచ్చాడు. ఎవరికో ఉపకారం చెయ్యపోతే అతను కుక్కకాటుకు గురి అయ్యాడు. బామ్మగారు అతన్ని యింటికి తీసుకువచ్చింది. అనురాధ తొలి చూపుల్లోనే అతన్ని ఆకర్షించింది. ఆమె తండ్రి అభిప్రాయం ప్రకారం అతను ఆ యింట్లోనే వుండిపోవలసి వచ్చింది. ఆ రోజున తూలుతూ వచ్చాడు మాధవరావు. అతనుకూడా తన తండ్రిలాగా తాగుబోతు అయినందుకు విచారించింది అనురాధ. అతనికి హితబోధ చేసింది. మాధవరావు తప్పు తెలుసుకున్నాడు. ఆతర్వాత అనురాధ అతనికి మరింత చేరువైపోయింది. ఆ తర్వాత అతనిదగ్గర చదువు కోవడం ఆరంభించింది. రంగరాజు కొడుకు రాజారావు ఊరికి ప్రెసిడెంటుగా నెగ్గాడని ఆమె చాలా బాధపడింది. మాధవికి పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళిపోయింది. రాజారావు రాధని నిర్బంధించాడు. మాధవరావుకు సంబంధించిన ఒక రహస్యాన్ని వెల్లడించాడు. రాధ నమ్మలేదు. రాజారావు అత్యాచారం చెయ్యబోగా ఆమెకి స్పృహతప్పింది. మాధవరావు ఆమెని రక్షించాడు.

14

గతరాత్రి నిద్రలేమితో ఇంకా ఒళ్ళంతా నొప్పులుగా ఉంది. వెంట్రుకవాసిలో— ప్రమాదం తప్పినందుకు మనస్సుకు శాంతిగానూ ఉంది. గాయాలతో రాత్రంతా అతను బాధపడి వుంటాడు. ఎలావుందో చూద్దామని ప్రొద్దున్నే అతని గదికి వెళ్ళాను.

అతనింకా పక్కమీదనుంచి లేవలేదు. ఒకనిమిషం తదేకంగా చూస్తూ నిలబడ్డాను. అందమైన ఆ ముఖం బేండేజీలతో వెలవెల బోతోంది. ఏడాదినుంచి నాకు తెల్సినంతవరకు వేణుగోపాల్ తప్ప అతన్ని చూడటానికి ఎవ్వరూ రాలేదు. ఒంటరిగా అతడెలా జీవిస్తున్నాడో మరి. జాలేసింది. గబుక్కున అతన్ని అక్కున చేర్చుకొని ఒళ్ళంతా నిమరాలనిపించింది. ఎన్నో అనిపిస్తాయి. అనిపించినవన్నీ చేయలేము. అలా చేయలేకపోయినప్పుడే అవి మరింత మధురంగా ఉంటాయి. ఏమిటో ఈ వింత! 'కొన్ని కోరికలు తీరకుండా ఉంటేనే మనకెంతో బాగుంటుంది.' నేనిది వరకు మాధవితో చెప్పినమాటలు నాకే ఇప్పుడు వర్తించాయి.

రాజారావు చూపించిన ఫోటో గుర్తుకు వచ్చింది. ఆ అమ్మాయి అందంగానే ఉంది. చెల్లెలే అయివుంటే ఈ సహృదయుడు చెల్లెలి ప్రేమను దూరం చేసుకుంటాడా? లేదు. ఆమె చెలెలు అయివుండదు. అతని మనసుతో ఆటలాడి మోసగించి ఉంటుంది. అందుకనే తన గత చరిత్రను తలుచుకొని అతను బాధపడుతూంటాడేమో!

వేణుగోపాల్ చెప్పినట్లు అతడు అందరికీ దూరమైన నిర్భాగ్యుడు. అటువంటి వ్యక్తికి నేనిప్పుడు సర్వస్వమవటం ... అద్భుతమైన విషయం. ఆనందించవల్సిన విషయం...

ఆ అదృష్టమే నాకు దక్కాలి. అంతకు మించి అతని గతంతో నాకు సంబంధం లేదు. ఏమయినా ఉంటే అతన్ని తన బాధా స్మృతులనుంచి మరిపించగలిగేనంతవరకే కావాలి. అంతే! అంతవరకే నాకు కావాలి...

ఆలోచనల్లో మునిగివున్న నాకు అతడు సన్నగా మూలగటం వినిపించి ఉలిక్కిపడ్డాను. దగ్గరగావెళ్ళి ఒంటిమీద చెయ్యివేసి ఛకితనయ్యాను. ఒళ్ళు పేలిపోతోంది.

సరిగ్గా ఏడాదిక్రితం ఈ రోజుల్లోనే కుక్కకాటుతిని జ్వరం తెచ్చుకున్నాడు. ఇప్పుడు మళ్ళీ నామూలాన గాయాలు తగిలి బాధపడుతున్నాడు. కన్నుల నీరు తిరిగింది. 'మాస్టారూ?' అని పిలిచాను.

అతడు బరువెక్కిన కళ్ళను తెరిచాడు. నిమిషంపాటు నా కళ్ళల్లోకి అలాగునే చూస్తూండిపోయాడు.

నేను ముందుకువొంగి,' ఎలావుంది?...' అన్నాను.

'జ్వరం తగిలినట్లుంది ... తలపోటుగా, ఒళ్ళు నొప్పులుగా ఉంది.' అతని గొంతు హీనంగా వుంది.

'అవును...బాగా నీర్సంగా వున్నారు... లేచి ముఖం కడుక్కోండి. మాత్ర వేసుకొని కాఫీ త్రాగుదురుగాని...' అన్నాను ఒంటిమీద చెయ్యివేస్తూ.

పాలిపోయిన అతని పెదవులపై చిరుహాసం మెరిసింది. 'డాక్టరమ్మ ఆజ్ఞ!...'

తేలికపడిన మనస్సుతో అతనికి ఆసరా యిచ్చి లేవదీసి ముఖం కడిగించాను. రెండు మాత్రలతో కాఫీ త్రాగించాను.

'రాధా!... రాత్రి సరిగ్గా నిద్రపోలేదను

కుంటాను.'

తల దించుకొని అన్నాను: 'మీరిలా బాధపడుతుంటే నాకు నిద్రెలా పడుతుంది? ... ఇదంతా నామూలానే జరిగింది...'

'రాధా!...ఎందుకు నిన్ను నువ్విలా అనుకుంటావ్? నాకీగాయాలకన్న నీమాటలు ఎక్కువ బాధిస్తున్నాయి తెలుసా!... ఏడాది క్రితం పిచ్చికుక్క కరచినప్పుడు మీ నాన్నగారన్నమాటలు ఇప్పటికీ నాకు గుర్తున్నాయి. మనుషుల్లో వున్న వెర్రి కుక్కల మాట నేను మర్చిపోయాను ... అందుకనే నాకీగాయాలు. లేకపోతే, అన్ని దెబ్బలు తినేవరకు అవతల వ్యక్తిని ఉపేక్ష చేస్తుండేవాడినా ... ఏమయినా, అన్నిటికన్న ముఖ్యమైన నిన్ను దక్కించుకున్నాను. ఆ తృప్తి ముందు నాకీగాయాల బాధ ఏమంత? ... నీ సేవలో గాయమంతపోయి మరొకటి లేదు అనూ!' అతని చిరునవ్వులో అనంతమైన అనురాగం తొణికిసలాడింది.

'మీ గాయాలు చూసి నేను బాధపడుతుంటాను. నా బాధ చూసి మీ రానందిస్తుంటారు. వండి. అదేగా మీరనేది' నా కంఠం గాద్గదికమైంది.

'నా పిచ్చి రాధా! ఎందుకీ తర్కణ నాకు...నీ కన్నీళ్ళు నన్ను మరింత బాధిస్తాయని నీకు తెలియదూ!'

నేను పలకలేదు. అతను నాచేతి వ్రేళ్ళను నిమురుతూ ఉండిపోయాడు.

వీధి అరుగుమీదకు ఎవరో వచ్చినట్లు అలికిడయి నేను వెళ్ళి చూసాను. హెడ్మాస్టారు! 'రండి మాస్టారూ!' అని లోపలికి ఆహ్వానించాను. చటుక్కున కంటి తడిని తుడుచుకున్నాను.

'ఏమిటయ్యా! మాధవరావూ! ... ఈ కళ్ళేమిటి? అంతే నేను విన్నది నిజమేనన్నమాట!'

నా గుండె ఝల్లుమంది.

'అబ్బె ఏదో చిన్నగొడవ ...' అన్నాడతను మాటలు త్రుంచేస్తూ.

హెడ్మాష్టరి ముఖం వెలవెలబోయింది. 'ఎంతపని జరిగింది? అసలు రాజారావుతో నీకెందుకు వచ్చిందయ్యా! వాళ్ళసలే పొగరుమోతు వాళ్ళు...వాళ్ళతో తగవు తెచ్చుకొని... అబ్బబ్బే! నువ్వుకూడ ఇంత తొందర పడతావనుకోలేదు...'

'మాస్టారూ! మీరు పెద్దవారు! నన్ను మీరేమన్నా భరించాలి ... కాని, మీ చెప్పు



దాకా వచ్చిందేదో చెప్పండి. అసలేం జరిగిందో నేను తర్వాత చెప్తాను. నిన్నాళ మీరింకా నాది తప్పంటే మీరేం చెయ్యమంటే అది చేస్తాను.'

'రాధమ్మని రాజారావు కిచ్చి పెళ్లి చేయటానికి రంగరాజుగారితో డాక్టరుగారు సంప్రదించటం జరిగిందని ... ఊరంతా పుకారుగా వుంది. తండ్రులిద్దరూ మద్రాసు నుంచి రాగానే, తాంబూలాలు పుచ్చుకుంటారని అంతా అనుకుంటున్నారు. అలాంటి పిచ్చి ఆశలు పెట్టుకోవద్దని నువ్వు రాజారావును హెచ్చరించినట్లు మీ మధ్య ఏదో ఘర్షణ బయలుదేరినట్లు డాక్టరుగారు పెద్దింటివారితో వియ్యమందటం ఇష్టం లేక నువ్వు గొడవచేసినట్లు ... ఆ ఘర్షణలో నువ్వు రాజారావును కొట్టినట్లు — అడ్డు రాబోయిన గవరయ్యను చితగ్గొట్టినట్లు...నిప్పుండాలే కాని పొగ లేవడానికి అడ్డేముంది. చిన్నదానికి చిలవలు పలవలు అల్లేస్తారు...'

అతను, నేను ముఖాముఖాలు చూసుకొని తెల్లబోయాము. నాకు కోపంతో ఒళ్ళు మండిపోయింది; ... 'ఊళ్లోవాళ్ళ కబుర్ల మీదనే నా పెళ్ళి ఆధారపడి వుంటుందా మాస్టారూ! అసలువాళ్ళు మాట్లాడుకోందే వీళ్ళకెందుకు మధ్య...'

'అది లోకసహజం తల్లీ! మనం తొందరపడటమెందుకు? అదీ నేననేది...'

'తొందరపాటు కాదు మాస్టారూ! ఆయనే నిన్న సమయానికి రాకపోతే డాక్టరుగారి అమ్మాయి శవాన్ని అంతా చూసి ఉండేవారు ... రాజారావు జైలుకెళ్ళి వుండేవాడు...'

'అయ్యో!...ఏం జరిగిందమ్మా అసలు' హెడ్మాష్టారి కంఠం వణికింది

నేనతనివైపు చూశాను. అతడు నన్నాగమని సైగచేసి జరిగిందంతా వివరంగా చెప్పాడాయనకు.

'...ఎంత ప్రమాదం తప్పింది?'

'...పుకారు లెటువంటివయినా న్యాయానికి అన్యాయం జరగదు. పెద్దవాళ్ళిష్టం ... పెళ్లి చేసుకునేవాళ్ళిష్టం. ఒకరి విషయాల్లో ఇంకొకరు జోక్యం కల్పించుకోనవసరమేముంది చెప్పండి? డాక్టరుగారు ఊరికి వెళ్ళేటప్పుడు నా కప్పగించిన బాధ్యత కోసం నేను తొందరపడవల్సి వచ్చింది.

రాగధార

సోది అన్యాయమనిపిస్తే అది నా తప్పు కాదు. ఒక ఆడపిల్లను తెలిసీకూడ ప్రమాదం నుంచి రక్షించకపోవటం అధర్మం కాదా? ఇప్పుడు మీరు చెప్పండి...నేను చేసింది తప్పైనా?'

హెడ్మాస్టారు క్షణంసేపు మాట్లాడలేదు. '...నన్ను క్షమించు బాబూ! విషయం తెలియక నేను కూడ నిన్ను నిందించాను.'

ఆయన చేతులు పట్టుకుంటూ అతనన్నాడు. 'మీరంత మాటనకండి ..నా కిటువంటి బాధలూ, నిందలు క్రొత్త కాదు. కాని, ఆత్మీయులచేత హర్షింపబడని పనిచేసి భరించలేను. మీరు నన్ను నమ్మారు. నాకంతే చాలు.'

'లేదు బాబూ!...నేనూళ్లోవాళ్ళ మాట నమ్మలేదు. స్ఫటికంలాంటి నీ సంస్కారం నాకు తెలియంది కాదు. అదీ గాక రాజశేఖరంగారికి నీయందు ఎంత అభిమానముందో నాకు బాగా తెలుసూ... సరే నీ ఆరోగ్యం జాగ్రత్త! మళ్ళీ నేను వచ్చి చూసేవరకు స్కూలుకు రావద్దు. తెల్సిందా!'

సంతోషం పట్టలేక, 'మా మాస్టారు మంచి మాస్టారు!...' గబుక్కున అనేశాను.

ఆయన గలగల నవ్వారు 'పిచ్చి తల్లీ!'

అతను ముసి ముసిగా నవ్వాడు వాతావరణం ఆహ్లాదంగా ఉంది. మనస్సుకు హాయి కలిగింది.

'ఇక పోయివస్తానయ్యా మాధవరావూ!' అని ఆయన లేవబోతుంటే గుమ్మంలోనే ఎదురు వచ్చారు రాఘవరావు గారు.

'రండి బాబయ్యగారూ!' అని లోపలికి పిలిచాను.

అతన్ని చూస్తూనే, 'అయితే నేను విన్నది నిజమేనన్నమాట!' అన్నారు రాఘవరావుగారు.

నా మనస్సు చివుక్కుమంది. జరిగిందొకటయితే ప్రచారాని కెక్కింది మరొకటి. నిజం ఏదయినా ఊరంతా అతని గురించి చెడుగా చెప్పుకోవటం నాకు బాధాకరం కాదూ!

'...నేను మీలాగే విన్నాను రాఘవరావుగారూ! కాని, నిజా నిజాల రూపం మాత్రం వేరు...' అన్నారు హెడ్మాస్టారు.

'...పుకార్లని నేను నమ్మలేదు కాని... రాజశేఖరం ఊళ్లో లేకుండా ఇలాంటి గొడవలు జరగటం నన్ను కంగారుపెట్టింది. అసలు నీకు, రాజారావుకి మధ్య...'

'...జరిగింది నేను చెప్తాను వినండి...' అని హెడ్మాస్టారు పూసగుచ్చినట్లు అతను చెప్పిన కథంతా చెప్పారు. నేనీలోపల రెండు కప్పులతో కాఫీ తెచ్చి యిచ్చాను.

'ఎంతపని జరిగింది?' అన్నారు రాఘవ

ఇప్పుడు నేను సజీవుణ్ణి!

ఇప్పుడు నేను సజీవుణ్ణి
ఏదో నాలుగు ముక్కలు రాస్తున్నా
ఏదోవిధంగా సంసారయాత్ర సాగిస్తున్నా.


ఒంటో శక్తికి లోపం లేదు
ఇంట్లో భుక్తికి లోటులేదు
కనుక మనవి చేస్తున్నా
నాకివ్వవద్దు బహుమతి
చిన్నదైనా, పెద్దదైనా సరే.

నేను కన్ను మూసిన తర్వాత
నాపేరు మాసిపోయిన తర్వాత
నా రచనలకు వర్జ్యం వచ్చినప్పుడో
లేదా
రాహుకాలం, యమగండం వచ్చినప్పుడో
ఏదో నా ఒక రచనకు
ఇవ్వండి బహుమతి.

అందువల్లనైనా
మళ్లీ నా పేరు ప్రాణం పోసుకుంటుంది.
నా రచన సన్నని వెలుగు చూస్తుంది.
నన్నుచూచిన వాళ్ళూ చూడనివాళ్ళూ
నారచనలు చదివినవాళ్ళూ చదవనివాళ్ళూ
తెచ్చుకున్న కన్నీటితోనైనా
మెచ్చుకుంటారు.
కనీసం
నా వారసులైనా
నా రచనల్ని వెలికి తీస్తారు
వాటి మీది దుమ్ము దులుపుతారు,
అందుకే,
మళ్లీ మొదటికి వస్తున్నా
నాకివ్వవద్దు బహుమతి
చిన్నదైనా, పెద్దదైనా సరే.
ఇప్పుడు నేను సజీవుణ్ణి!

—చల్లా రాధాకృష్ణశర్మ

బాపుగారు ఆశ్చర్యంతో తల మునకలవుతూ, "అసలె రాజశేఖరం కోపిష్టివాడు. ఈ విషయం తెలిస్తే భగ్గుమంటాడు. ఏమయినా అతను వచ్చేసరికి వాతావరణం చల్లబడే లాట్లు చూడటం మన విధి. అసలు కథను కూడ నలుగురి చెవిని వేయటం మంచిది. దానితో వాళ్ల దుష్ప్రచారానికి ప్రతిక్రియ జరిగినట్లవుతుంది. అందరికీ శ్రేయోభిలాషి కనుక కర్ణంగారికే మాట చెబ్దాము. అంతగా రంగరాజు పే టేగిపోకుండా ఒక ఆయుధాన్ని ఆయన చేతికివ్వటం మంచిది... ఇక పాత్రే, వ్యవహారాలు ప్రతిబింబించి రాగాన పడకుండా



ఆరునెలలు రాగానే మీపాపకి గుజ్జుగాచేసిన అన్నం, పప్పు ఆకుకూరలు పెడితే తప్పు అతడు బుద్ధిబలము దేహబలము కలవాడుగాపెరగలిచ్చు

మీ కుమారునికి ఆరు నెలలు వచ్చిన తరువాత తల్లి పాలు చాలవని ఆధునిక విజ్ఞానం నిరూపించింది. తల్లి పాలతోపాటు అన్నం వంటి ముద్ద ఆహారం కూడా అవసరం. అతని మెదడుకి, దేహానికి బలమిచ్చి, వ్యాధులను నిరోధించగల శక్తి నిచ్చే బలవర్ధక పదార్థాలుగల ఆహారం అవసరం.

ఈ బలవర్ధక పదార్థాలు అతనికి ఎటులో లభిస్తాయి? బియ్యంనుంచా! అవును. భారత దేశంలో మామూలుగా తినే అన్నం నుంచి ఈ పుష్టికరమైన పదార్థాలు లభిస్తాయి. అన్నం మీ ఇంట లభించేదే గనుక ఎంతో తేలిక. చాలా చవుక. పసిపాపకి కావల్సిన కొద్ది మెతుకులు, మీరు తినే మీ కంచం నుంచే పెట్టవచ్చు. పాపకి కావల్సిన శక్తి సామర్థ్యాలనిచ్చి ఆరోగ్యవంతునిగా, సౌఖ్యంగా ఉంచగల మంచి శక్తి అన్నానికి వుంది

అందుచేత మీ పాపకి ఆరు నెలలు రాగానే, తేలికగా అరగడానికి వీలుగా బాగా వుడికిన అన్నం మెత్తగా కలిపి తినిపించడం ప్రారంభించండి. వీలయితే కొంచెం పప్పు ఆకు కూరలు కూడా పెట్టండి. అధిక పుష్టి లభిస్తుంది

ఇవి కొద్ది మొత్తాలలో తల్లిపాలకి తోడుగా పెడితే, మీ పాప ఆరోగ్యానికి అద్భుతంగా తోడ్పడతాయి

అన్నం, ఆకు కూరలు, పప్పు తింటే పిల్లలు ఆరోగ్యంగా ఆనందంగా పెరుగుతారు.

మన మాధవరావు వేళగాని వైపు ఒంటరిగా షికారుకు వెళ్ళే అలవాటు తగ్గించు కోవాలి...'

'ఒకళ్ళకి భయపడి ఎంతకాలం ఈ ప్రపంచంలో బ్రతగ్గలం ?' అన్నాడతను నిర్లిప్తంగా.

'ఆ మాట నిజమే బాబూ! కాని, మూర్ఖుడి చేతికి రాజముద్రికనిచ్చిన ప్రజల నమ్మకాన్ని మార్చటం ఒక్కరోజులో జరిగే పని కాదు కదా! అందుకనే మన జాగ్రత్తలో మనం ఉండాలి. ధర్మమే జయించినా గెల్చినవాడికున్న వివేకం ఓడినవాడి కుండదు...' అన్నారు హెడ్మాస్టారు.

'మీరన్నది నిజం. కొడుకు ఎలాటి వాడయినా పరువుకోసం ఎటువంటి పని చేయటానికయినా సిద్ధపడతాడు రంగరాజు. రాజశేఖరం వచ్చేవరకు...నువ్వు చాల జాగ్రత్తగా ఉండాలయ్యా మాధవరావూ!' అన్నారు రాఘవరావుగారు.

'కంటికి రెప్పలా చూసుకునే రాధమ్మ ఉందిగా !...' అన్నారు హెడ్మాస్టారు నవ్వుతూ. 'రాత్రిళ్ళు సహాయంగా ఉంటాడు మన శంకరయ్యని పంపుతానమ్మా !'

'మీ అందరికీ శ్రమెందుకు మాస్టారూ! ...రేపటికదే తగ్గిపోతుంది.' అన్నాడతను.

'అబ్బాయ్! ఎంత మంచివాడివయినా అంత మొండితనం పనికిరాదు...మా పెద్దవాళ్ళబాధ నీకేం తెలుసు?' ఆయన చిరుకోపంలోని ఆప్యాయతకు అతని కళ్ళు,

రాగధార

నా మనస్సు ఆర్ద్రత చెందాయి.

ప్రపంచం అంతా పగబట్టినా ఆత్మీయుల అండవుంటే మనస్సుకి ఎనలేని తృప్తి కలుగుతుంది; మనస్థైర్యం లభిస్తుంది. ఆ క్షణంలో నాన్నగారు దగ్గఱ లేరన్న బాధ కలుగలేదు నాకు.

హెడ్మాస్టారు, రాఘవరావుగారు వెళ్ళిపోయారు. ఎప్పుడోకాని ఇల్లు కదలని శ్యామలాంబగారు కూడ మధ్యాహ్నం వచ్చి కొంతసేపు మాట్లాడి ధైర్యం చెప్పి వెళ్ళింది.

ఆవేళాళ్ళా ఒళ్ళు తెలియకుండ పడివున్నాడు అతను. శంకరయ్యను మాస్టారు పంపటం మెరుగిచ్చింది నేను మానసికంగా దిగజారిపోకుండా ధైర్యోక్తులు పలుకుతూ అతనికి శుశ్రూష చేసాడు శంకరయ్య.

అతనంటే స్కూలు పిల్లలు ఎంత అభిమానిస్తారో...ఆడపిల్లలు ఎంత ముచ్చట పడతారో శంకరయ్య వర్ణించి చెప్తుంటే నా మనస్సుకు ఎంతో హాయి అనిపించింది. మనసిచ్చిన వ్యక్తి అందరి మన్ననలు పొందుతున్నాడంటే ఏ స్త్రీ ఆనందించదు ?

కాని, అటువంటి వ్యక్తికి కూడ మరి కొందరు శత్రువులు తప్పలేదు. ఆపదలు తప్పలేదు. ఇవన్నీ తనకు మనసిచ్చిన స్త్రీ మూలానే సంభవించటం అతని దురదృష్టం కాక మరేమిటి ? అలా అనుకునేసరికి నా మనస్సు వికలమైపోయింది.

ఆనందించిన క్షణంలోనే ఆవేదనతో కలగిపోయే దురదృష్ట వంతురాల్ని నేను. కడుపునిండా ఎప్పటికయినా నవ్వుకోగలనా? మమ్మల్ని వేరుచేసి వేధించకు భగవాన్! అతన్ని సంపూర్ణ ఆరోగ్య వంతుడిని చెయ్యి ప్రభూ!

* * *

దైవం నా ప్రార్థన ఆలకించాడు. ఆ మరునాటి కతనికి జ్వరం తగ్గుముఖం పట్టింది. నేను కుదుటపడ్డాను.

ఆ మధ్యాహ్నం నాన్నగారినుంచి ఉత్తరం వచ్చింది. బామ్మకి కులాసాగా వుందని, రెండుమూడు రోజుల్లో బయలుదేరి వస్తున్నామని వ్రాసారు. మనస్సు తేలిక పడింది.

సాయంత్రం సీతామణి వచ్చింది. ఆ అమ్మాయిని చూస్తే ఒకందుకు నాకు చిరాకు వస్తుంది. ఎక్కడెక్కడి వార్తలు ఇట్టే సేకరిస్తుంది. అది అందరికీ చేరవేస్తుంది. మరి అంతనేర్పు, ఓర్పు ఎక్కడిదో నాకు తెలియదు. అయితే మంచిపిల్ల! చాడీలు చెప్పినట్లుగా చెప్పదు. నేనన్నా, నాపాటలన్నా, మా దొడ్లో పూలన్నా చెవి కోసుకుంటుంది.

ప్రతివ్యక్తిలోను ఏదో ఒకలోపం ఉండ వచ్చు. అంతమాత్రాన సమూలంగా ఆవ్యక్తి ప్రవర్తనను శంకించటం ఏం సబబు ? అభిమానించే వ్యక్తికి అనురాగం పంచి యివ్వటం ధర్మం! అందుకనే సీతామణి నాకు స్నేహితురాలు కాగలిగింది.


రంగరాజుగారు మద్రాసునుంచి వచ్చారని ...రాజారావుని అతను కొట్టిన విషయం విని మండిపడిపోయారని... ఏదో గొడవ చేసేలా ఉన్నారని సీతామణి చెప్పింది.

'...మరి రాజారావు కిప్పుడొంట్లో ఎలా వుంది ?...'

'అతనికేం దుక్కలా ఉన్నాడు. నిన్న సాయంత్రం కోడిపందాలకు వెళ్ళాడు...' అంది సీతామణి నవ్వుతూ.

'పాపం, దెబ్బలు కొట్టినవాడు జ్వరం తెచ్చుకుంటే దెబ్బలు తిన్నవాడు పందానికి వెళ్ళాడన్నమాట !'

నా మనస్సులోని వ్యంగ్యాన్ని ఎంత వెళ్ళగక్కుకున్నా ఊహించిన భయం నిజమైంది. మరోగంటకి రంగరాజుగారి కమత



గాడు సుమ్మంలో ప్రత్యక్షమయ్యాడు: '...మాష్టర్ని పెద్దారిగారి సారి రమ్మన్నా రమ్మా !...' అన్నాడు.

'ఆయనకు జ్వరంగా వుంది. లేవలేని పరిస్థితిలో వున్నారని చెప్పు...'

'అలాగే చెప్తాలెండి...'

వాడు వెళ్ళిపోయాక ఇలా కబురు వచ్చిందని అతనికి చెప్పాను. అతను చలించ లేదు. ఐదు నిముషాలసేపు దీర్ఘాలోచనలో ఉండిపోయాడు... 'బహుశ, నేను త్వరలో ఊవూరు విడిచి వెళ్ళిపోవల్సి వస్తుందేమో రాధా !'

ఉలిక్కిపడ్డాను. వెంటనే ఆమాటలకి కోపం ముంచుకొచ్చింది...' 'కావచ్చు. అనూరాధతో సహా వెళ్ళవల్సి రావచ్చు.' అన్నాను.

అతను ఒక్కక్షణం నిర్ఘాంతపోయి ఎగాదిగా చూసి అన్నాడు... 'నాకంత అదృష్టమా అని !'

'నన్ను దురదృష్టవంతురాల్ని చేయా అని వుందా మీకు ?'

'రాధా !...'

'అవును. లేకపోతే, మిమ్మల్ని మీరు వేరుచేసుకొని మాట్లాడతా రెందుకు ?'

'...నిన్ను వేరుచేసుకొని నేనెలా బ్రతుకుతాను అనూ !... ఇప్పటి పరిస్థితిలో నా అనురాగమే నా అనూకి ఆపద తెచ్చి పెడుతోందని నాబాధ.'

'అదే నిజమయితే ఆ ఆపదకంటె నేను కోరుకునేది మరేదీలేదు.'

'అబ్బ, నీకు తెలియదు రాధా !... నా బాధ నీ కర్థంకాదు...'

'నాకు తెలుసు. మీరే నాకోసం అన్ని బాధలు భరించాలని సిద్ధమవుతున్నారు నేనంత స్వార్థపరురాల్ని కాను.'

అతను మాట్లాడలేదు. కొంతసేపటి వరకు నా కళ్ళల్లోకి చూస్తూ ఉండి పోయాడు.

నేను దగ్గరగా వెళ్ళి అతని కుడిచేతిని నా చేతుల్లోకి తీసుకొని నిమురుతూ కూర్చున్నాను.

అతనివైపు మరొకసారి చూసి 'ఏమిటలా చూస్తున్నారు ?' అని అడిగాను.

తన ఎడమచేతిని నా చేతుల మీద వేస్తూ, 'ఇదంతా కల కాదుకదా!... రాధా!' అన్నాడతను.

'కాదు. మీ అనురాగ మంతటి సత్యం!'

'ఎందుకో మనస్సంతా ఆవేదనగా ఉంది రాధా! నీకు నా మనస్సునయితే అందించాను కాని...నా గురించి ఇంతవరకు చెప్పుకోలేక పోయాను.'

'ఎప్పటికయినా మీరు, మీ మనస్సు ముఖ్యం...మీ చరిత్ర కాదు.'

'ఏడాది క్రితం ఇలా రోగపీడితుడిగా పడి వున్నప్పుడు నువ్వు అడిగినా చెప్పలేక పోయాను. ఈవేళ నువ్వు అక్కర్లేదంటున్నా నా గురించి అంతా నీకు చెప్పుకోవాలనిపిస్తోంది అనూ!...'

'మీరు నీరసంగా ఉన్నారు. ఇప్పుడు విశ్రాంతి కావాలి!'

'రేపటి పరిస్థితి ఎలా వుంటుందో తెలియదు. నా రాధకు అంతా చెప్పుకుని మనస్సుని తేలిక పర్చుకోనీ అనూ! లేకపోతే, ఈ ఒంటరితనంలో ఆ అసంతృప్తి అలానే ఉండిపోతుంది...'

'రాధ సమక్షంలో మాధవునికి ఒంటరితనం ఎక్కడిది?' అన్నాను అతని జుట్టులోకి వేళ్ళు పోనిస్తూ. నన్ను నేను మర్చిపోయిన పరిస్థితి అది. ఒక అమాయిక

రాగధార

శిశువును సాకుతున్న అనుభూతి ఒడలెల్లా కదలించివేసింది.

'అనూ!... నా అనూ!...' అంటూ అతడు నా అరచేతుల్ని బుగ్గలకి రాసుకుంటూ కళ్ళు మూసుకున్నాడు. అతడు పరవశించి పోయాడనుకున్నాను. లేదు. అతడు ఏడుస్తున్నాడు. బలవంతంగా దుఃఖాన్ని ఆపుకోవాలని ప్రయత్నిస్తున్నాడు.

సంభ్రమాశ్చర్యాలతో నేను శిలలా మారిపోయాను. మేరు గంభీరుడైన ఆ వ్యక్తి ఇంత జాలిగా కన్నీరు పెడతాడని నేనెప్పుడూ ఊహించలేదు. అతన్నాస్థితిలో చూసి నేనెలా నిలద్రొక్కుకున్నానో నాకే తెలియదు. అతని శిరస్సు నా వక్షానికి హత్తుకొని మౌనంగా ఓదారుస్తూ ఉండిపోయాను.

ఎంత గంభీరుడైనా ప్రతి పురుషుని లోను అంతరాంతరాలలో బేలతనం ఒకపాలు ఉంటుందని నాకావేళనే తెల్సింది. ప్రియాతి ప్రియమైన స్త్రీ సమక్షంలోనే పురుషుని గంభీరత కరిగి నీరవుతుందని నాకు తెల్సింది. అంతకుమించి పురుషుడు తన్ను తాను స్త్రీ కర్పితమైపోయే క్షణం మరింకెప్పుడూ లభించదని నాకు తెల్సింది.

అటువంటి స్థితిలో ఆ పురుషుని ఓదార్చగల మరొక స్త్రీ అనుభూతి ఎలా వుంటుందో నేను చెప్పలేను కాని ... నాకుమాత్రం అపూర్వమైన అనుభవ మనిపించింది. ఆ పురుషుడు పసివాడుగా కనిపించాడు. ఆ పసివాడిని గుండెలకు హత్తుకోకుండ ఎలా ఉండగలను!

అలా ఎంతసేపు ఉండిపోయామో తెలియదు. అతని వెచ్చని కన్నీటితడి నా జాకెట్టులో కింకిపోయింది...గుండెలమీద చల్లగా స్పర్శించేసరికి తెలివి తెచ్చుకున్నాను.

అతని కన్నీళ్ళు నా పమిటచెంగుతో తుడిచాను. ఉద్వేసిత హృదయంతో అతని నుదిటిని నా పెదవులదరి జేర్చుకున్నాను. ఒక్కమాటలో నన్ను నేను మర్చిపోయాను. నా దోయిలిలో అతని ముఖం మబ్బుల చాటునుంచి బయల్వెడలిన చంద్రబింబంలా ప్రకాశించింది.

'అనూ!'

'ఊఁ!'

'నాకిప్పుడెంతో హాయిగా వుంది. ఇన్నాళ్ళ అనుభవంలో నీవు నా మనస్సుకింత దగ్గరగా వచ్చావని తెల్సుకోలేకపోయాను. తెల్సిన మరుక్షణంలో ఒంటరితనంలో కరడుగట్టిన వ్యధంతా బద్దలయింది. నీ అనురాగ స్పర్శలో నా వ్యధంతా కరిగి హరించి పోయింది. ఇలా తేలికపడిన హృదయంతో మనసులోని నాలుగు మాటలు చెప్పుకోవాలని వుంది. చెప్తాను వింటావా రాధా!'

'మీకిప్పుడీ శ్రమ ఎందుకు!'

'నా పిచ్చి రాధా! నాకిప్పుడెంత బలంగా వుందో తెలుసా?...నా గుండెల్లో పొంగి పొరలుతున్న ఆనందలహరి నీకు వినిపించటం లేదూ? ఈ ఉత్సాహంలోనే నా మనస్సు విప్పి చెప్పుకోనీ రాధా!'


'సరే, చెప్పండి.'

కొంతసేపు నాటో చూస్తూ ఉండి పోయాడతను. అప్పటికే ఊరు మాటు మణిగింది.


అతని చేతివేళ్ళు నా చేతులపై ముద్రలు వేస్తున్నాయి.

అతడు తన కథ ప్రారంభించాడు.

(ఇంకా ఉంది)



సమానత్వమా? చాకిరీయా?



కె. రామలక్ష్మి

ఎటు చూసినా వివాదాలే. 'సమానత్వం కావాలి' అనో, 'ఆడాళ్ళకెందుకు యీ సమానత్వం!' అంటూనో. ఎప్పుడూ ఆడవాళ్ళని వెనకేసుకొచ్చే నేను దీన్నిగురించి గట్టిగా ఆలోచించాలి కదా. అయ్యలారా, అమ్మలారా—ఆడవాళ్ళం రెండోతరగతి పౌరులా? —ఆడపిల్ల పుట్టినంతమాత్రాన సెకండ్ క్లాసా? తక్కువా? సిగ్గుచేటు! స్త్రీ స్వాతంత్ర్యంకోసం, సమానత్వంకోసం — మనదేశంలో గగ్గోలు పెట్టకుండానే—అన్ని ఉద్యోగాలు అన్నారిన్నాళ్ళు. కాని నిన్న మొన్న ఇందిరాగాంధీ—ఆడాళ్ళని ఉద్యోగాలలో, ఊళ్ళేలడంలో రిజర్వేషన్ కొట్టి పారేస్తున్నానని తిరిగి నొక్కి చెప్పిందా—రిజర్వేషన్స్ అక్కడే ఉంచేశారు!

'మాతో సమంగా జీతంవస్తే మాతో సమంగా అమోదించండి' అంటున్నారప్పుడే పురుషులు. నిజమే—సమానత్వం ఏం పూల బాట అనుకున్నామా? మగవాడితో సమానం అనుకున్నప్పుడు—వాళ్ళలాంటి దౌర్భాగ్యపు పరిస్థితులలో కొట్టుమిట్టాడుతున్నారో మనం అంతేకదా. 'రాత్రి షిఫ్టులు పని చెయ్యండి చూద్దాం' అంటారు. రైళ్ళల్లో అమ్మాయిలు, టెలిఫోన్లలో అమ్మాయిలు—అక్కడికి చెయ్యడం లేనట్లు! అంతెందుకు. 'చిన్నకూచీ నువ్వు రోగంవచ్చి ఒళ్ళు తెలియక పడివుంటే పేదదీర్ఘి నుదురు తుడిచి సమయానికి మందులు అందించే చిట్టి నర్సుల సంగతి మరిచిపోయావా?' అని అడగండి. అంతెందుకు, మనిషిని మనిషితో పోలిస్తే — ఆడవాళ్ళూ—మగవాళ్ళంత తెలివైనవాళ్ళూ గట్టివాళ్ళూ కష్టపడి పనిచేసేవాళ్ళూను. మనకంత చొరవ లేకపోవచ్చు కాని దానికి కొన్ని వందల రెట్లు ఓర్పూ నేర్పూ వున్నాయి కదా! యింట్లో పెంపుడు జంతువులా పెళ్ళాం వుండాలి. మళ్ళీ సంపాదించమూ సంపాదించాలి అంటే యికపై కుదరదు.

పొద్దుటే పేపరు మగాళ్ళే ఎందుకు చూడాలి? మనం చూడొచ్చు. వారానికో నెలకో యింత డబ్బు మన మొఖాన పడేసి 'అంతా ఏం చేశావు?' అని అడిగే హక్కు వాళ్ళకే ఎందుకు? బజారుకెళ్ళి వాళ్ళనే ఆ డబ్బుతో కావలసినవన్నీ కొంటకి తెమ్మనండి చూద్దాం. ఏ సిగరెట్లకో తీరుకో నిలవేసుకున్నా డబ్బు యింకెక్కడ మిగులుతుంది? మనం చూద్దాం. ఇద్దరికి కాయి తోలడంవస్తే 'కాస్త ఓసారి మాట్లాడకండి' 'వెనక్కూర్చుని ఏ వాగుడేమిటి' అనే ఆయన్ని అనే ఛాన్సు మనకీ వుండా అంటాను. ఈ సమానత్వం మూలాన్న మనకి పోయేదేం లేదండీ. వెనక్కి ఆలోచించి చూస్తే—ఆడదొస్తే లేచి సీటిచ్చే మగాళ్ళెంతమంది ఈ రోజుల్లో? తోపుడు తలుపులు తోసుకు బయటికి పోతారే గాని ఎవరేనా ఆగి తలుపు పట్టుకున్నారా మీ రివతల పడేదాకా!! ఇలాంటి చిన్న చిన్న గౌరవ చిహ్నాలే చేయిజారి పోతున్నప్పుడు—అప్పుడే గ్రహించివుంటారు ఆడది కనిపించేటంత అబల కాదని.

పెళ్ళి అయాక కూడా ఉద్యోగాలు చేయాలని మనం ఎప్పుడో గ్రహించాం. అంటే ఏమిటి రెండు ఉద్యోగాలు చేయడానికి ఒప్పుకున్నామన్నమాట. ఇదెవరూ గ్రహించినట్టు లేదు. ఇది తెలుసుకున్నప్పుడే—మన సమానత్వం ఎక్కడ?... ఆడవాళ్ళూ—మగవాళ్ళూ కలిసి సాధిస్తేనే గాని నిజమైన సమానత్వం రాదు. పనిలో వారితో సమానంగా చేసినప్పుడు ఇంటిపని మనతో సమానంగా వారెందుకు చేయలేరు? పాపం! చేతకాకపోవచ్చు గాని పెంచేభారాన్ని ఎందుకు ఫిఫ్టీ ఫిఫ్టీగా పంచుకోరు? అయ్యో—సమానత్వం కోసం పోరాడాం. దరిదాపు సాధించాం. యిక దాన్ని నిలుపుకోవలసిన నేర్పు మనలోనే వుంది!' —'ఏమిటి అలా కలవరిస్తున్నావు?' అంటూ మావారు తట్టి లేపేదాకా తెలియలేదు నేను పగటికల కంటున్నానని—వారి లోకాన్ని ఎడ్రస్ చేస్తున్నాను—నిద్రలోనే!! రామ! రామ!!

క్రొత్తయేటి కలిమి

చైత్రశష్పతన్వాపాత సౌరభములు
సౌమనస్య సౌందర్యముల్ సంతరించి
నెమ్మనమ్ముల క్రొంగొత్తనెయ్యములను
పండించి కూర్చుత శాంతిసౌఖ్యములను.

తలిరు తొగరు అలరు సొరుపులగు పిలుపు
కమ్మతెమ్మెర తలిమము గంధపూత
క్రొత్తవల తావి తలపులకోర్కులందు
క్రొత్తయేటికలుము కానుకోమరు మిగులు.

— సౌంధ్యశ్రీ

కొత్తకి విశ్వాసం



మల్లాది వెంకటకృష్ణమూర్తి

స్వరాజ్యరావు ఇంటినుంచి కూరల మార్కెట్‌కి రెండు ఫర్లాంగుల దూరం వుంటుంది. అయిదునిముషాల నడక.

సంచీ పట్టుకుని చక చకా నడుస్తున్నాడు స్వరాజ్యరావు, చేతిలోని సంచీ వూపుతూ. ఆ రోజు రెండవ శనివారం. శెలవుదినం. కూరలు కొనుక్కురావడానికి వెళ్తున్నాడు మార్కెట్‌కి, శనివారం కూరలు చవకగా దొరుకుతాయని. మర్నాడు ఆదివారం. మార్కెట్‌కి శెలవ. కాబట్టి నిలవ వుండవని కూరలు చవకగా అమ్మేస్తారు.

కూరల మార్కెట్ నాలుగడుగుల దూరంలో వుండనగా ఆగిపోయాడు స్వరాజ్యరావు. చూపులు, మార్కెట్‌కి కొంచెం దూరంలోవున్న జనంమీదకి వెళ్ళాయి. దీర్ఘ చతురస్రంగా నిలబడి వున్నారు మనుషులు, చెట్టు క్రింద. వాళ్ళ మధ్యనుంచి డప్పు చప్పుడు వినిపిస్తోంది. మధ్య మధ్యలో డమరుకు చప్పుడు. ఈలలు.

చూడంగానే గ్రహించగలిగాడు స్వరాజ్యరావు ఎందుకు అలా నిలబడి చూస్తున్నారో!

గారడీ!

వాళ్ళ మధ్య గరడీవాడు. తమాషాలు చేస్తున్నాడు. స్వరాజ్యరావు వుత్సాహంతో పొంగిపోయాడు. చాలా రోజులయింది గరడీ ఆట చూసి.

స్వరాజ్యరావుకు గారడీ ఆటంటే చాలా ఇష్టం. చిన్నప్పటినుంచి ఎన్నో ఆటలు చూసాడు. ఎప్పుడు చూసినా, వాళ్ళుచేసే విచిత్రాలు కొత్తగానే వుంటాయి. వినోదంగా వుంటాయి. విసుగనిపించవు.

ఆ రోజు శెలవుదినమే గాబట్టి, త్వరగా అన్నం తిని ఆఫీసుకి వెళ్ళాలనే తొందర లేదు అప్రయత్నంగా ఆ గుంపు వైపు నడిచాడు, ఆట చూడటానికి.

ప్రేక్షకులలో చాలామంది లోక్లాస్‌కి సంబంధించినవాళ్ళు. వాళ్ళే ఎక్కువగా ఆనందిస్తున్నారు. స్వరాజ్యరావులాంటి చదువుకున్నవాళ్ళు చాలా తక్కువ.

చిన్నప్పుడు స్కూలుకు వెళ్ళేటప్పుడయినా, స్కూలునుంచి తిరిగి వచ్చేటప్పుడయినా గరడీ ఆట పూర్తయ్యేదాకా చూసి కాని మరీ కదిలేవాడు కాదు. అంత సరదా స్వరాజ్యరావుకి.

చిన్నపిల్లలందరూ ముందు చుట్టూ కూర్చుని వున్నారు. పెద్దవాళ్ళు వాళ్ళ వెనకాలనిలబడి చూస్తున్నారు ఆ మనుష్యుల మధ్య గారడీవాడు ఒకవైపు, వాడి సహాయకుడు మరోవైపు నిలబడివున్నారు, అందరూ వినేటట్లుగా, గట్టిగా మాట్లాడుకుంటూ.

స్వరాజ్యరావు గారడీవాడు అమర్చిన సామానువంక చూశాడు. ఆసామాను చూసి గ్రహించగలడు స్వరాజ్యరావు, ఏ ఏ ప్రదర్శనలు ఇస్తాడో.

ఒకమూల మనిషి పుర్రె. దాని నోట్లో అంటించని కొత్త సిగరెట్. ఆ పుర్రెకి నూటిగా వరసగా పేర్చిన రక రకాల ఎముకలు. మధ్యలో నేలలో కొట్టిన మేకుకు కట్టివున్న ముంగీస, ప్రక్కనే రెండు పాములుండే బుట్టలు. ఆ బుట్టల ప్రక్కన ఒక బక్కెట్టు. పాములు ఆడించే నాదస్వరం. మాసిపోయిన గుడ్డతో కట్టిన రెండు మూటలు. నాలుగు కత్తులు.

గారడీ చేసేవాడి వెనకాల కట్టివున్న గుర్రం ఎందుకో అర్థం కాలేదు. స్వరాజ్యరావుకి. ఎప్పుడూ గారడీ ఆటల్లో గుర్రాన్ని చూడలేదు. బహుశ కొత్త ఫీట్ ఏదయినా వుండవచ్చు, తను ఇంతక్రితం చూడనిది, అనుకున్నాడు.

బక్కచిక్కిపోయి వుంది ఆ గుర్రం. బండి లాగే శక్తి కూడా దానికి లేదు అని చూడగానే తెలుస్తోంది, స్పష్టంగా. బాగా ముసలిదిలాగా వుంది. ఆ గుర్రానికి రెండు

కోటి విద్యాలూ

పైపులా గవ్వలు కట్టేవున్నాయి. క్రింద వున్న పచ్చ గడ్డి తింటోంది అది.

ఆట ప్రారంభం అయి చాలాసేపు అయినట్టుగా వుంది. గారడీవాడి సహాయకుడికీ, గారడీవాడికీ, సంభాషణ నడుస్తోంది

''ఎంత డబ్బు కావాలి నీకు ?' అడుగుతున్నాడు గారడీవాడు.

'అయిదు వందలు.'

'ఇందాక వంద చాలన్నావు. ఇప్పుడు అయిదువందలు అంటున్నావు ?'

'అవును అయిదువందలు కావాలి.'

'దేనికి ?'

'పెళ్లి చేసుకుంటాను.'

'పిడికి వెళ్ళా ?' అన్నాడు గారడీవాడు ప్రేక్షకులవైపు తిరిగి. కుడిచేతిలోవున్న ఎముకతో, తన సహాయకుని అందరికీ చూపిస్తూ.

అందరూ నవ్వారు.

'సరే ! అయిదువందల రూపాయలా ? డాలర్లా ?'

అడిగాడు గారడీవాడు.

'రూపాయలు.'

'సరే ! అయిదువందల రూపాయల నోట్లు తెప్పిస్తాను. ఇది రెండుచేతులతో పట్టుకుని చేతుల రెండూ గట్టిగా మూసుకో.'

చిన్నగవ్వ అందరికీ చూపించి, తన సహాయకుడికి ఇచ్చాడు. సహాయకుడు గవ్వ చేతులో పట్టుకుని, 'అయిదువందల రూపాయలనోటు ఎలా తెప్పిస్తావు ? అసలు వుండదుగా ?' అని అడిగాడు, అనుమానంగా.

'మంత్రంతో తెప్పిస్తాను. గట్టిగా పట్టుకున్నావా ? ఇప్పుడు ఆ వుద్రేకంతో నీరెండు చేతులూ మూడుసార్లు తిప్పు.'

సహాయకుడు అలాగే తిప్పాడు. కుడివైపు మూడుసార్లు, వుద్రేకంతో, తన చేతులని.

చేతిలోని ఎముక, గారడీవాడు, సహాయకుడి చేతులవంక చూపిస్తూ ఏదోమంత్రం చదివాడు.

'ఇప్పుడు తెరు. చేతిలో అయిదువందల రూపాయలనోటు వుంటుంది.'

ప్రేక్షకులు అందరూ సహాయకుడి బిగించిన చేతులవంక చూస్తారు, నోటు తయారయిందేమోనని.

'ఏమయ్యోయ్ ! నా చేతులు రావటం లేదు. ఏం చేసావు ?'

సహాయకుడు చేతులు విడదీయడానికి బ్రహ్మ ప్రయత్నం చేస్తున్నాడు. కాని విడిపడటంలేదు అవి.

'ఎందుకురావు వస్తాయి.'

'అరె ! అతుక్కుపోయాయి. నువ్వే ఏదో చేసావు విడదియ్యి.'

గారడీవాడి మీదకి వచ్చాడు. విడిపడని చేతులతో, సహాయకుడు.

'నీ చేతులు నువ్వు పట్టుకుని, నన్ను తియ్యమంటావే.'

'నువ్వే ఏదో చేసావు. తియ్యి' అని చాడు సహాయకుడు.

'నేనేం చేసాను. పిల్లంతా చూడటంలా ? కావాలంటే అడుగు వాళ్ళనే.'

ప్రేక్షకులవంక చూపించాడు చేతో, గారడీవాడు.

'నాకు డబ్బువద్దు, పెళ్లివద్దు. చేతులు విడదియ్యి'

బాగ నటిస్తున్నాడు సహాయకుడు, చేతులు విడదీసుకోవాలని చేసే ప్రయత్నం, కోసం

ప్రేక్షకులు నవ్వుతున్నారు, వాళ్ళ మధ్య వినోదానికి.

'నవ్వకండయ్యా. ఎందుకు నవ్వుతారు. చేతులు విడదీయి రో' అరుస్తున్నాడు సహాయకుడు.

'తిట్టుకో, డోంట్‌కేర్. ఇప్పుడు చూడండి. పిడికి పెళ్లిచేస్తాను.'

గారడీవాడు ఏదో మంత్రం చదివి, ఎముక సహాయకుడి నెత్తిమీద తిప్పాడు.

అందరూ విచిత్రం చూస్తున్నారు.

'మొదలు పెడుతున్నాను పెళ్లి.'

ఎముకతో నెమ్మదిగా తన నెత్తిమీద కొట్టుకున్నాడు గారడీవాడు.

'కొట్టకురో' అరిచాడు సహాయకుడు. తన తలమీద మళ్లీ కొట్టుకున్నాడు గారడీవాడు నవ్వుతూ. తల విదిలించాడు సహాయకుడు. కొట్టకురో. నీకే దెబ్బ. చేతులు కట్టేసి, పెళ్లి చేస్తానని, కొడతావా '

ప్రేక్షకుల కందరికీ అర్థమవుతున్నా

గారడీవాడు ఏదోమంత్రం వేసాడని, తన నెత్తిమీద కొట్టుకొంటున్న దెబ్బ, సహాయకుడికి తగులుతోందని.

సహాయకుడు ఆ పురెదగ్గరకి వెళ్ళి మళ్ళీ అతుక్కుపోయిన రెండుచేతులూ దానిచుట్టూ తిప్పాడు మూడుసార్లు. అయినా విడిపడలేదు.

ప్రేక్షకులు ఘొల్లున నవ్వారు.

మళ్ళీ గారడీవాడి దగ్గరకి వెళ్ళాడు కోపంగా, చేతులు విడదీయమంటూ.

కాస్సేపు అందరూ వినోదించిన తరాత మళ్ళీ మంత్రంచదివి విడదీసాడు, సహాయకుడి చేతులు, గారడీవాడు.

అయిదువందల రూపాయలనోటు సంగతి అంతా మరిచిపోయారు.

'మీ దగ్గర ఎవరిదగ్గరయినా తినేందుకు ఏమయినా వుందా ? బాగా ఆకలివేస్తోంది నాకు ?.' అని చుట్టూ చూసి, ఎవరి దగ్గరా ఏమీ లేదా? ఏరా? నీదగ్గరేమయినా వుందా ?' అని అడిగాడు సహాయకుడి వంక చూసి.

'ఊ. ఇది తిను.'

ఒక మూలవున్న ఒక కత్తి తీసి అందించాడు, సహాయకుడు కోపంగా.

'సరే! అలాగే తింటాను. ఏదీ, నీ చేతులు రెండూ మళ్ళీ దగ్గరపెట్టు' అన్నాడు వినయకతో తడుతూ.

బెదిరిపోయినట్టుగా నటించాడు సహాయకుడు. 'వద్దు. మళ్ళీ చెయ్యద్దు.'

కోటివిద్యలూ

అన్నాడు రెండు చేతులూ, రెండు జేబుల్లో దాచుకుని.

స్వరాజ్యరావు నవ్వుకున్నాడు.

'మీరు అంతా చూశారుగా. ఈ కత్తి అసనుని ఇచ్చాడు వీడు, తినలేనని అనుకొని. ఈ కత్తి మీ అందరి కళ్ళముందూ మింగుతాను. జాగ్రత్తగా చూడండి. ఒక కత్తి కాదు. రెండు తింటాను.'

పక్కనే వున్న ఇంకో కత్తి అందుకున్నాడు.

స్వరాజ్యరావు కత్తులవంక చూసాడు జాగ్రత్తగా. చాలా పలచగా వున్నాయి, రేకుల్లా. అడుగున్నైనే వుంది పొడుగు.

గారడీవాడు రెండు కత్తుల చివరలూ నోటిలోపెట్టి నెమ్మదిగా లోపలికి పోనించసాగాడు కత్తులని. అందరూ వూపిరి బిగబట్టి చూస్తున్నారు. రెండు కత్తులూ పూర్తిగా లోపలకి వెళ్ళిపోయ్యాయి, పిడిదాకా.

గారడీవాడు చుట్టూ తిరిగీ, అందరికీ చూపించాడు. తర్వాత నెమ్మదిగా కత్తులని మళ్ళీ బయటికి తీసాడు, నోట్లోనుంచి.

ఆశ్చర్యంగా చూస్తున్న సహాయకుడికి నోరుతెరచి చూపించాడు ఏమీ కాలేదన్నట్టుగా. స్వరాజ్యరావు చాలారోజుల క్రితం చూసాడు, కత్తులు మింగేవాణ్ణి. మళ్ళీ ఇప్పుడే. చాలా తక్కువమంది చేస్తారు అది. సన్నగా రేకుల్లావుండే ఆ కత్తుల్ని గొంతులోకి పోకుండా, నోట్లోనే చుట్టుకునేలా చేస్తారు, అనుకున్నాడు స్వరాజ్యరావు.

గారడీవాడు పొట్ట తడుముకుని 'ఇంకా ఆకలి తీరలేదు. ఇంకేదయినా వుందా తినడానికి?' అని అడిగాడు తన సహాయకుడివంక చూసి. సహాయకుడు కాస్సేపు చుట్టూవున్న సామాను వెతికినట్టుగా నటించి, బుట్టతీసి గారడీవాడికి చూపించి 'ఇది తిను' అన్నాడు.

గారడీవాడు బుట్టలోంచి చిన్న పాముని బయటికి దీసాడు. అందరూ భయంగా చూసారు దానివంక. చేతి చూపుడువేలు అంత సన్నంగావున్న ఆ పాము అడుగున్నరదాకా వుంది పొడవు.

'ఇది తినమంటె తింటాను.' అని చేతిలోని పాముని చుట్టూ తిప్పి అందరికీ చూపించాడు.

ఎడంచేత్తో డమరుకు అందుకుని అది గబగబా వాయించి, రెండువేళ్ళూ నోట్లోపెట్టి గట్టిగా ఈలవేశాడు గారడీవాడు. లేచి నిలబడ్డ చిన్నపిల్లలని కూర్చోమని సహాయకుడు అందించిన గిన్నెలోని నీళ్ళుఎత్తి నోట్లో పోసుకున్నాడు. మింగలేదు ఆ నీళ్ళు. మింగకుండానే ఆ పాముని నోట్లో వేసుకుని, పాముతోపాటు మింగాడు నీళ్ళు.


నోరుతెరచి అందరికీ చూపించాడు. నోట్లోలేవు నీళ్ళుకానీ, పాముకానీ. కడుపులోకి వెళ్ళిపొయ్యాయి. గారడీవాడి సహాయకుడు ఆశ్చర్యం నటిస్తూ చూడసాగాడు.

మళ్ళీ బయటికి తెప్పించాడు గారడీవాడు పాముని, నోట్లోంచి. ఈసారి రెండుపాములని ఒకేసారి మింగి మళ్ళీ తెప్పించాడు.

మళ్ళీ రెండు తేళ్ళని తీసాడు, బుట్టలోంచి, పాములని వదిలేసి. అవి మింగి మళ్ళీ తెప్పించాడు నోట్లోంచి బయటికి.

'ఇంకా ఆకలి తీరలేదు. ఇంకేంవుంది?' అడిగాడు గారడీవాడు, సహాయకుడివంక తిరిగి.

'వీడు కత్తులు, పాములూ మింగినా బతికే వున్నాడు. ఇంకా ఆకలిట. బకాసురిడి అన్నలాగా వున్నాడు' అన్నాడు సహాయకుడు, ప్రేక్షకులవంక చూస్తూ.



అందరూ నవ్వారు.

'ఆకలి వేస్తోంది. నిన్నే తినేస్తాను'

సహాయకుడు వెనక్కి పరిగెత్తాడు.

'నన్ను తినొద్దు, వద్దు.' అన్నాడు కంగారు నటిస్తూ.

'మరయితే ఏం తినను?'

సహాయకుడు కాస్సేపు సామాను వెతికి చిన్న నిమ్మకాయ బయటికి తీశాడు.

'ఇది తిను'

రెండువేళ్ళు కత్తెరలాగా ఉపయోగించి, ఆ నిమ్మకాయని కత్తిరించాడు గారడీవాడు, మధ్యకి.

'ఇది చాలదు' అన్నాడు, అవి నేలకేసి కొట్టి.

'అయితే ఆ గుర్రాన్ని తిను.'

ప్రక్కనే ఓ మూలగా పచ్చిగడ్డి మేస్తున్న గుర్రాన్ని చూపించాడు సహాయకుడు.

'గుర్రం తినటానికికాదు. ఎక్కి పరిగెత్తడానికి.'

'అయితే ఎక్కి పరిగెత్తు. నేలమీద కాదు ఆకాశంలో. నీ మంత్రమేమిటో బయట పడుతుంది.'

'నిజం ఆకాశంలోకి ఎగరమంటావా?' అడిగాడు గారడీవాడు సహాయకుడిని;

'నువ్వొక్కడివేకాదు. ఆ గుర్రంతో పాటు ఎగురు.'

'ఎగురగలను ఎగరనా?'

అడిగాడు గారడీవాడు ప్రేక్షకుల నుద్దేశించి.

'ఎగురు.' అరిచారు ముందు కూర్చున్న పిల్లలు ఉత్సాహంగా వాళ్ళ అరుపులలో స్వరాజ్యరావు అరుపుకూడా కలిసిపోయింది.

'సరే. మీరందరూ అడుగుతున్నారు కాబట్టి, నేను, ఈ గుర్రంమీద ఎక్కి ఆకాశంలో ఎగురుతాను. ఇలా గుర్రంమీద ఎగరగల మంత్రం మా గురువుగారి దగ్గర నేర్చుకున్నాను. ఆయన ఎవరని మీ రెవరయినా అడగవచ్చు. రెండు సంవత్సరాల దాకా హిమాలయ పర్వతాలలో తపస్సు చేస్తూండేవారు. ఇప్పుడు విదేశాలలో వున్నారు. చాలా గొప్పవారు ఆయన. మీరు పేపర్లలో చదివేవుంటారు ఆయనగురించి. సినిమాలలో చూసేవుంటారు. ఆయన ఫోటో నాదగ్గరవుంది, చూపించనా?'

అడిగాడు అందరివంకా చూస్తూ.

'చూపించు' అన్నారు ముందర కూర్చున్న పిల్లలు.

'చూపిస్తాను. అందరికీ చూపిస్తాను. ప్రతీఒక్కరూ, ఆయన ఫోటోకి దణ్ణం పెట్టాలి, మీదగ్గరకు ఫోటో వచ్చినప్పుడు. లేకపోతే మీకందరికీ కీడు జరుగుతుంది.'

మూటలోంచి ఒకఫోటోతీసి పట్టుకుని, ప్రేక్షకులకి ఫోటో చూపిస్తూ చుట్టూ తిరిగాడు. స్వరాజ్యరావు తనదగ్గరకి రాగానే,

పార్కిన్‌సోనిజం

—— పి. రమేష్‌నారాయణ

పార్కిన్‌సోనిజం అన్నది వ్యక్తుల్లో కేంద్ర నాడీమండలానికి సంబంధించిన వ్యాధి. ఈ రోగుల్లో కండర చలనాలు నాడీ మండలం అధీనం తప్పుతాయి. ఇలాంటి వారు సాధారణంగా స్థిరత్వము, ఆటోనామస్ చర్యలు లోపించటం వల్ల తూగుతూ నడవటము, కాళ్ళు చేతులు వణకుట, వేళ్ళు ఎప్పుడు కదిలిస్తూండటము లాంటి లక్షణాలను వ్యక్తపరుస్తారు. తొలి దశల్లో చాల నింపాదిగ ఈ లక్షణాలు కనబడినా రానురాను ఎక్కువై బలహీనతా, దేహ భాగాలు నీలగటము సంభవిస్తాయి. ముఖ్యంగా ముఖం కండరాలు బిగుసుకొని పోవటం వల్ల ముఖకవళికలు మారి ఒక విధంగా తయారవుతుంది. విపరీతపు పరిస్థితులలో ఇది 'ఎన్‌సిఫలైటిస్'కు కూడా దారి తీస్తుంది.

యునైటెడ్ స్టేట్స్‌లో ఈ వ్యాధిని 'షేకింగ్‌పాల్సీ' అంటూ సాధారణంగా వ్యవహరిస్తారు.

తొలిసారిగ 1817 సంవత్సరంలో జేమ్స్ పార్కిన్‌సన్ అన్న ఆంగ్ల వైద్యుడు దీని గురించి వైద్య ప్రపంచానికి వెల్లడించాడు. కాని ఈ వ్యాధి నివారణలో సరయిన రసాయనౌషధాల వాడకాన్ని గూర్చిన ప్రముఖ పరిశోధనలు మూడు సంవత్సరాల క్రితం మాత్రమే వెలుగులోనికి వచ్చాయి. దానికి కారణం మెదడులోని నాడీ కణాల చర్యలకు ఆవశ్యకమయిన 'డోపమైన్' అన్న రసాయనం లోపించటం వల్లే ఈ వ్యాధి వస్తుందని నిశ్చయంగా గుర్తించబడటమే.

ఈ అంశంపై బ్రిటన్ మరియు అమెరికాల్లో జీవరసాయన—వైద్యరంగాల్లో కొనసాగిన పరిశోధనలు 'ఎల్—డోపా' అన్న రసాయనం కొంతవరకు గుణం నివ్వగలదని వెల్లడించాయి. కాని దీన్ని పుచ్చుకోవటం వల్ల రక్తపీడనం తగ్గటమూ, ఆకలి హరించుటు, నాసియాలు రోగుల్లో కలిగాయి. తత్ఫలితంగా న్యూరోమెడికల్ శాస్త్రజ్ఞులు పార్కిన్‌సోనిజం నివారణలోని ఈ రసాయన ప్రభావాన్నిగూర్చి తమ అసంతృప్తిని వెల్లడించారు. ఇలాంటి ఔషధాలు ఒక డజను పైగా ప్రయత్నించబడ్డాయి. న్యూరోసర్జరీ పది శాతం రోగుల్లో మాత్రము సత్ఫలితాల నిస్తుందని తేలింది.

కాని గత సంవత్సరం ఈ రంగంలో స్విస్ శాస్త్రజ్ఞులు గావించిన పరిశోధనలు ఆసక్తికరమయిన ఫలితాలు నిచ్చాయనవచ్చు. స్విట్జర్లాండులోని బెసెల్‌కు చెందిన డాక్టర్ కురుమ, బార్తలోమి మరియు ప్లెచర్‌లు ఎలుకల మెదడుపై గావించిన ప్రయోగాలు 3—0—మిథైల్ డోపా అన్న క్రొత్త ఔషధాన్ని ఆవిష్కరించాయి. ఈ ముగ్గురు వైద్య శాస్త్రజ్ఞుల పరిశోధనలు హాఫ్‌మన్— లారోషె అండ్ కంపెనీ అన్నసంస్థ తరపున కొనసాగాయి. అంతేగాక, 1971 ఏప్రిల్ నెలలో వీరి పరిశోధనా ఫలితాలు 'నేచర్' అన్న పాశ్చాత్య పత్రికలో బాహాటంగా వెల్లడించబడ్డాయి.

కిరణధార్మిక 3—0—మిథైల్ డోపానుప్రయోగించి మానవులపైనా, ఇతర క్షీరదాలపైనా వీరు గావించిన ప్రాథమిక ప్రయోగాలు ఎల్‌డోపా లాగ దీన్ని పుచ్చుకోవటం వల్ల నాసియా లాంటి ఇతరులయిన ఇబ్బందులంటూ ఏవీ కలుగలేదని తెలిసాయి.

పార్కిన్‌సోనిజం నివారణలో 'ఫిజికల్ తెరపీ' కూడా చాలా ముఖ్యమైన పాత్రనే వహిస్తుంది. ఈ రోగులు ప్రతిదినము తప్పక చురుకయిన వ్యాయామము గావించటము, కండరాలకు చైతన్యం కల్పించే పనులు చేయటము చాలా అవసరం. ఈ రోగుల కదలికకు ఇళ్ళలో అడ్డంకులుండకుండా ఏవీ లేకుండా చూడాలి. తమ వ్యాధిని గూర్చి మానసికంగా బాధపడే అవకాశాలు ఈ రోగుల్లో హెచ్చుగనుండటం వల్ల కుటుంబ సభ్యులు, మిత్రులు వారికెప్పుడూ ఆనందంగా వుండే వాతావరణమూ, అవకాశాలు కల్పించాలి.

అందుకయినా మంచిదని నమస్కారం పెట్టాడు, తన ఆఫీసర్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యేవిధంగా చూడమని, మనసులో అనుకుని.

సహాయకుడు మధ్య ఒక తెల్లగుడ్డ పరిచాడు. గారడీవాడు ఆ గుడ్డమీద పెట్టాడు ఫోటోని.

'నేను యాచించటానికి రాలేదు. అయినా అడుగుతున్నాను. మీకు తోచిన ధర్మం మీరు చెయ్యండి. ఇంతవరకూ ఎన్నో వింతలు చూపించాను మీకు. ఇప్పుడు ఇంకా అద్భుతమయిన వింతను చూపించబోతున్నాను. ఎవరికి తోచిన డబ్బు వాళ్ళు ఆ గుడ్డమీద పడేయండి, మనసులో మా గురువుగారికి నమస్కరించి

కోటివిద్యాలూ

మీరు ఏ కోరిక కోరుకుని డబ్బు వేస్తే ఆ కోరిక నెరవేరుతుంది. మీరు విసిరిన నాణెం ఫోటోకి తగిలితే మీ కోరిక ఫలిస్తుంది. లేకపోతే లేదు. ఇది గురువుగారి ఆజ్ఞ.'

గారడీవాడు ఇవే మాటలు చెప్పాడు నాలుగయిదుసార్లు, డమరుకు వాయిస్తూ, చుట్టూ తిరుగుతూ

చాలామంది డబ్బు విసురుతున్నారు ఫోటోవైపు. అయిదు పైసలనుంచి, మడత పెట్టిన రూపాయినోట్లదాకా వచ్చి పడుతున్నాయి పరచివున్న తెల్లగుడ్డమీద.

స్వరాజ్యరావు కూడా, తన ఆఫీసర్‌కు ట్రాన్స్‌ఫర్ అవాలి అని మనసులో అనుకుని, అర్ధరూపాయిబిళ్ళ విసిరాడు గురిచూసి, వెళ్ళి ఫోటోకి తగిలింది అది సరిగ్గా.

కాస్సేపటికి డబ్బు పడటం ఆగిపోయింది. అంతా, గారడీవాడువంక చూస్తున్నారు. ఎప్పుడు గుర్రంమీద ఎగురుతాడా అని.

ప్రేక్షకులలో ఒకమూల మాత్రం ఇద్దరు వాదులాడుకోవటం అందరికీ వినిపిస్తోంది, ఏదో ఆస్తి విషయంలో.

గారడీవాడి సహాయకుడు జాగ్రత్తగా డబ్బు ఆ గుడ్డలోనే మూటకట్టాడు, నాలుగు చివరలూ కలిపి. సామానంతా సర్దసాగాడు, గబగబా.

గారడీవాడు గుర్రం దగ్గరకి వెళ్ళి ఆగ అన్నాడు.

'ఇప్పటిదాకా మీరు ఎన్నో గారడీలు చూసి వుంటారు కాని ఇలాంటి తమాషా ఎక్కడా చూసి వుండరు ఈ గుర్రం మీద ఎక్కి, పైకి ఎగురుతాను, మీ అందరి కళ్ళముందూ. పైన మూడుసార్లు చుట్టూ తిరిగి, మీరు చూస్తూండగానే, మళ్ళీ సరిగ్గా ఇక్కడే దిగుతాను. ఇది కనికట్టు విద్య కాదు. నిజంగా ఎరుగుతాను.'

చేతిలోని డమరుకు వాయించి, గట్టిగా ఈలవేసి, ఎముకతో గుర్రానికి కట్టివున్న గవ్వలని ముట్టుకుని కళ్ళు మూసుకుని ఏదో మంత్రం చదవసాగాడు.

వాదులాడుకుంటున్న ఇద్దరి గొంతులూ గట్టిగా వినపడుతున్నాయి.

గారడీవాడు కళ్ళు తెరచి వాళ్ళ వైపు చూసి 'నిశ్శబ్దంగా వుండండి' అన్నాడు. గుర్రంచుట్టూ మూడుసార్లు ప్రదక్షిణం చేసి, గుర్రం ఎక్కి కూర్చున్నాడు.

అంతా వూపిరి బిగబట్టి చూస్తున్నారు, ఎలా గుర్రంతో పాటు ఆ గారడీవాడు ఎగురుతాడా అని.

'చప్పట్లు కొట్టండి'

గారడీవాడు చెప్పగానే, ముందు కూర్చున్న పిల్లలేకాదు. పెద్దవాళ్ళు కూడా చప్పట్లు కొట్టారు, స్వరాజ్యరావుతో సహా.

'ఇంక పైకి ఎ...'

'క్యా బే. నా యాలా, నీ అంతు తేలుస్తాను.'

ఇందాకటనుంచి వాదులాడుకుంటున్న వాళ్ళలో ఒకడు, మధ్యకదూకి, ఇందాకా గారడీవాడు వుపయోగించిన కత్తులలో ఒకదాన్ని అందుకుని, రెండవాడి వైపు వురికాడు పొడవడానికి.

గబుక్కున గుర్రంమీద నుంచి క్రిందికి దూకి, పొడవబోతున్న వాణ్ణి ఒడిసి పట్టుకున్నాడు గారడీవాడు. ప్రేక్షకులలో ఇద్దరు సహాయం చేయగా, వాడిచేతిలోంచి కత్తి బలవంతంగా లాక్కున్నాడు గారడీవాడు.

గింజుకుంటూ అరుస్తున్నాడు వాడు. పోలీసులకి అప్పగించండి అన్నారు కొందరు.

'నందిగామలో ఒకరోజు ఇలాగే ప్రదర్శనం ఇస్తూంటే, నా కత్తితో ఒకడు ఇంకొకడిని పొడిచేసాడు. తర్వాత కోర్టు చుట్టూ తిరగాల్సి వచ్చింది నేను, పోలీసులు వద్దు. వదిలేయండి.'

ఇంగారగా సామాను సర్ది, ఇద్దరూ గుర్రంమీదకి ఎక్కించారు తమ సరంజామా అంతా, నిమిషాలలో.

గారడీవాడు వెళ్ళిపోగానే క్రమంగా అంతా ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు, ఆట మధ్యలో వదిలేసిన వాడిని తిట్టుకుంటూ.

స్వరాజ్యరావుకి [illegible] లాగటం లేదు ఇప్పుడు [illegible] గారడీవాడు ఉఖర చేసి చూపిస్తున్నది [illegible]. ఇంతవరకు అది తను ఎక్కడా చూడలేదు.

నెమ్మదిగా, ఖాళీ సంచితో, దూరంగా పోతున్న గారడీవాడి వైపు నడవసాగాడు స్వరాజ్యరావు. గుర్రంతో ఎలా ఎగరగలడు గాలిలోకసి? గ్రావిటీ థియరీ ప్రకారం అది అసంభవం. గారడీవాడు అసాధ్యుడలాగా వున్నాడు. చేసినా చేయగలడు మంత్రాలతో. నిజంగా మంత్రాలు వచ్చేమో వాడికి.

వాడిని కొద్ది దూరంలో అనుసరించ

గాడు [illegible] చిన్నప్పుడు జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది స్వరాజ్యరావుకి.

ఒకసారి, ఆదివారం, మంగలిషాపుకి వెళ్ళి క్షవరం చేయించుకు రమ్మని పావలా ఇచ్చి పంపాడు నాన్న. మంగలిషాపుకి వెళ్ళేదారిలో గారడీ జరుగుతూ ఉంటే, ఆగిపోయాడు చూస్తూ.

'మీదగ్గరవున్న డబ్బు నాకు ఇవ్వకపోతే, మీరు ఇంటికివెళ్ళేలోపల చచ్చిపోతారు. ఇదిగో, ఇవ్వాళ రాత్రి, సరిగ్గా పన్నెండు గంటలకి ఈ పామువచ్చి మిమ్మల్ని కాటేస్తుంది?'

ఒక ఒళ్ళు జలదరించే పాముని చూపించాడు. తను భయపడి, పావలాకాసు వాడి ముందుకి విసిరేసి, ఇంటికి పరిగెత్తుకెళ్ళాడు. జరిగింది విని కోపంవచ్చింది నాన్నకి. ఆ నెలంతా తను క్షవరం చేయించుకోలేదు. తర్వాత నెలలో గుండుచేయించాడు నాన్న, పావలా పోగొట్టానన్న కోపంతో.

స్వరాజ్యరావు అనుకున్నట్లుగానే, ఒక సినిమా థియేటర్ దగ్గర ఆగాడు గారడీ వాడు. ఒకచోట గుర్రంమీద సామాను దింపి, మళ్ళీ ఆట మొదలుపెట్టడానికి సిద్ధం అయాడు.

స్వరాజ్యరావుకూడా చుట్టూ చేరినవాళ్ళలో కలిసిపోయి చూడసాగాడు ఆట.

చాలాభాగం ఆట ఇందాక జరిగినట్లుగానే జరిగింది, కొద్దిపాటి తేడాతో. తన ఆఫీసర్‌కి వెంటనే ట్రాన్స్‌ఫర్ కావాలని మళ్ళీ అర్ధరూపాయకాసు విసిరాడు. సరిగ్గా, ఫొటోకి తగిలింది, అర్ధరూపాయ బిళ్ళ.

గుర్రంమీద ఎక్కాడు గారడీవాడు, గుర్రంచుట్టూ మూడుసార్లు ప్రదక్షిణం చేసి చిన్న పిల్లలని చప్పట్లు కొట్టమన్నాడు.

అందరితోపాటు మళ్ళీ చప్పట్లుకొట్టాడు స్వరాజ్యరావు గట్టిగా.

అప్పటిదాకా నెమ్మదిగా కీచులాడుకుంటున్న ఇద్దరిలో ఒకడు అందరి మధ్యకు దూకి 'క్యాబే. నాయాలా. నీ అంతు తేలుస్తాను' అన్నాడు, గారడీవాడు కత్తి అందుకుని.

గారడీవాడు గుర్రంమీదనుంచి దూకి, వాడిచేతులో కత్తి లాక్కోవటం, ఇదివరకు నందిగామాలో ఇలాగే ఒకసంఘటన జరగడం, తను కోర్టుచుట్టూ తిరగిన సంఘటన చెప్పటం జరిగిపోయింది.

ఆశ్చర్యంగా చూస్తున్నాడు స్వరాజ్యరావు, కత్తి పట్టుకున్నవాడిని.

ఇందాకటి వాడేవాడు. ఇందాక మార్కెట్ దగ్గర జరిగిన ఆటలో కూడా, అందరి మధ్యకిదూకి, కత్తి అందుకుని, పొడవడానికి సిద్ధమయింది వాడే.

సామానుసర్దుకుని వెళ్ళిపోతున్నగారడీ వాడిని చూసినవ్వుకున్నాడు స్వరాజ్యరావు.

గారడీవాడు చాలా తెలివయిన వాడు. నిజానికి ఆ గుర్రంమీద కూర్చుని ఎగరలేడు. అంతశక్తి లేదు. కాని అలా ఎగరగలనని చెప్పి, అందరిదగ్గరా డబ్బు వసూలు చేసి, చివరకి గుర్రంమీద ఎగరలేకపోతే తంతారు; డబ్బు లాక్కుంటారు.

అలా జరగకుండా వుండడానికి ఈ ఏర్పాటు చేసుకున్నాడు పైకి ఎగురుతాడని భావించే సమయానికి, తన మనుషులతో ఒకడయినవాడు గొడవచేస్తాడు - కత్తి అందుకుని. దాంతోవాండి బెదిరి వెళ్ళిపోతారు.

గారడీవాడు చల్లగా జారుకోవచ్చు.

ఆ గలాభాకూడా ఆటలోని భాగమేనని స్వరాజ్యరావు తేలికగా గ్రహించగలిగాడు.

గారడీవెంట కొంత దూరంలో నడుస్తున్న వాడిని చూస్తూ. ●

ధీగుణములు



— బులుసు వేంకటరమణయ్య. ధర్మపథం

✱ 'అతడు చాలా బుద్ధిమంతుడు' అని అంటే విషయ విశేషతలు కలవాడనీ, నీతిమంతుడనీ జనులు అనుకోవడం పరిపాటి అయిపోయింది. 'గొప్ప తెలివి తేటలు కలవాడు' అని అనుకోవడం అరుదు. ధీమంతుడని అంటేనే ఆ అర్థం వెంటనే స్ఫురిస్తుంది.

ధీమంతుడికి కొన్ని మంచి గుణాలున్నాయి. అవి అతనిలోని విశిష్టత్వాన్ని తెలుపగలవు. అవి ఏవనగా—

"గ్రహణం ధారణం చైవ
స్మరణం ప్రతిపాదనమ్,
ఊహోఽపోహోఽర్థ విజ్ఞానం
తత్త్వజ్ఞానం చ ధీగుణాః,"

గ్రహించడం, గ్రహించినదాన్ని మరిచిపోకుండా ఉండడం, అవసరమైనప్పుడా గ్రహించినదాన్ని స్ఫురణకు తెచ్చుకోవడం, స్ఫురణకు తెచ్చుకున్నదాన్ని సమయానుకూలంగా కార్యసిద్ధికి ఉపయోగించుకోవడం, కానిదానిదాన్ని తెలుసుకోవడం, లేనిదాన్ని ఊహించుకోవడం, ఆయా విషయాల స్వభావాదులను తెలుసుకోవడం — ముఖ్యంగా తత్త్వజ్ఞానం సంపాదించడం ధీమంతుని లక్షణాలు. ఇవి విద్యాభ్యాసం, అనుభవం మొదలైనవాటి మూలంగా లభించేవి.

ఏదైనా విషయాన్ని విద్యాదికృషివల్ల తెలుసుకోవచ్చు. కాని, ఆ తెలిసినదాన్ని జ్ఞప్తిలో ఉంచుకోకపోతే, దానివల్ల ఏమీ ప్రయోజనం ఉండదు.


కొందరికి ఆ విషయం బాగా జ్ఞాపకం ఉంటే ఉండవచ్చు. కాని, కావలసినప్పుడు స్మరణకు రాకపోవచ్చు. అలా స్ఫురణకు రాని విషయం బుద్ధిలో ఉన్నా నిరుపయోగమే అవుతుంది. ఆ విధంగా తలపునకు వచ్చినదాన్ని ఉపయోగించుకోవడమూ ఒక విశేషమే! ఉపయోగం లేనిది తలపునకు వస్తేమాత్రం ప్రయోజనం ఏమిటి ఉంటుంది?

ఇట్టి గుణాలు కలవారి బుద్ధి సొదర్శనవత్ ప్రసరించి, అనేక విషయాలన్నీ— గోచరాలు కాని వానిని ఊహింపచేస్తుంది. లేనివాటిని కూడా ఉన్నట్లు చూపిస్తుంది.

అట్టి నిశితమయిన ప్రజ్ఞవలన పదార్థాల తత్త్వం సులభంగా అవగాహన మవుతుంది. గూఢమై, సులభగ్రాహ్యం కాని తత్త్వజ్ఞానాన్ని కలిగిస్తుంది.

సమగ్రమైన మనీషకలవారియందు ఈ ఉత్తమ లక్షణాలన్నీ కానవస్తాయి. ●

ప్రతిభగల చక్కని నటుడు చంద్రమోహన్



'మా పాప పుట్టిం తర్వాతనే నాకు అదృష్టం కలిసి వచ్చింది!' అన్నారు, చంద్రమోహన్— కిందటివారం సుభాషిణీ ఆర్ట్ పిక్చర్స్ సెట్స్‌బయట విరామ సమయంలో.

ఏడాది నిండిన ఆ పాప పేరు 'మధుర'

ప్రముఖ దర్శక నిర్మాత శ్రీ బి. యన్. రెడ్డి యిచ్చిన ప్రోత్సాహంతో 'రంగుల రాట్నం' చిత్రం ద్వారా పరిశ్రమకు, ప్రేక్షకులకు పరిచయమయిన చంద్రమోహన్—యిటీవల వచ్చిన 'బొమ్మా—బొరుసా?' చిత్రంలో అద్భుతమయిన నటన కనపరచి చక్కని నటుడిగా మరోసారి రుజూ చేసుకున్నారు.

మా అమ్మ దేవత, జీవన తరంగాలు, కాలం మారింది, కత్తుల రత్తయ్య, ప్రజానాయకుడు, గజేంద్ర ఆర్ట్ పిక్చర్స్, పూర్ణా మూవీస్, సుభాషిణీ ఆర్ట్ పిక్చర్స్ చిత్రాలలో నటిస్తున్నారు చంద్రమోహన్.

'ఈ సంవత్సరం నాకు మంచి వేషాలు లభించాయి. 'మా అమ్మ దేవత'లో నేను పోషిస్తున్నది చాలా ఉదాత్తమయిన పాత్ర, కాలం మారిందిలో విప్లవవాది ధోరణి కలిగిన వేషం. జీవనతరంగాలులో అనంత్ పాత్ర. ఇది అందరూ చదివిన నవల కనుక, ఆ పాత్రయొక్క ప్రత్యేకత గురించి నేను ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. అలాగే సుభాషిణీ ఆర్ట్ పిక్చర్స్. పూర్ణామూవీస్ చిత్రాలలోని పాత్రలు కూడా వైవిధ్యం కలిగి నటువంటివి!' అన్నారాయన, ఉత్సాహంగా.

ఆర్టిస్టుకి సరయిన పాత్రలు లభించినప్పుడే, అతను రాణించటానికి అవకాశం ఉంటుంది. పాత్ర పోషణపట్ల శ్రద్ధ కలిగిన నటుడు చంద్రమోహన్. తమకిచ్చిన కేరెక్టర్‌ను ఒకటికి పదిసార్లు మననం చేసి— ఆ పాత్ర ప్రయోజనాన్ని దృష్టిలో వుంచుకుని నటిస్తారు. అందుకే అతను ఏ కేరెక్టరుచేసినా చాలా సహజంగా నిండుగా ఉంటుంది.

సినిమాల్లో నటించటం పట్ల ఎంతటి ఆసక్తి వున్నదో అతనికి— నాటకరంగం పట్ల కూడా అంతటి మోజు వున్నది. షూటింగ్ లేనిరోజుల్లో చక్కని నాటకం ఒకటి తీసుకుని ప్రదర్శనలు యిస్తూ వుంటారు.

'ఆదివిష్ణు రాసిన 'ఆశ్రయం' నాటకం ఏడాదిలో 20 ప్రదర్శనలు యిచ్చాము. డ్రామాలంటే నాకు మొదటినుంచీ ఎంతో యిష్టం. షూటింగ్‌లు లేకపోతే డ్రామాలు ప్రాక్టీసు చేస్తుంటాను. ప్రదర్శనలు యిస్తుంటాను!' అన్నారు.

చంద్రమోహన్ చక్కని నటుడేకాదు; వ్యక్తిగా అతను స్నేహపాత్రుడు, అందరితోను చనువుగా ఉంటాడు. తను నవ్వుతూ చుట్టూ ఉన్నవారిని నవ్విస్తూ ఉంటాడు. సినిమా నటుల్లో వుంటుందని చెప్పుకునే 'పోజు' అతనిలో లేదు. అందరూ కావాలనుకుంటాడు. అందరిలోను కలిసిపోతాడు. తీరిక వేళల్లో భార్యా బిడ్డలతో తన చిన్న ఎర్రకారులో షాపింగ్‌కో, సినిమాకో, బీచ్‌కో వెళ్ళటం అతని అలవాటు.

—మోహన్ కుమార్

మీకు తెలుసా?

సినిమాతారల యిండ్లలో యిటీవల జరిగిన సోదా ఫలితంగా రు. 92 లక్షలు పట్టుపడిందట.

హాస్యనటుడు పద్మనాభం నిర్మిస్తున్న చిత్రానికి 'ఆ జన్మ బ్రహ్మచారి' అని పేరు పెట్టారు.

హిందీలో ప్రముఖనటి ఒకరు అదే భాషలో ప్రముఖ రచయితగా వున్న వ్యక్తిని వివాహమాడబోతూందట. ఈ నటికి యిది రెండవ వివాహం!

'జీవ్‌గర్ల్' పేరుతో ప్రకాశిస్తున్న ఒక దక్షిణాది హిందీనటి, ఎన్టిరామారావుతో ఒక పౌరాణిక చిత్రంలో నటించబోతూంది.

ఒకే సంవత్సరంలో పద్మశ్రీని, ఊర్వశిని సంపాయించుకుంది నటి వహీదారెహ్మాన్!

సినిమా

శ్రీరామాంజనేయ యుద్ధం; రామారావు అంగీకారం

'శ్రీరామాంజనేయ యుద్ధం' నాటకం ఆంధ్రదేశంలో బహుళ ప్రజాదరణ పొందియున్నదని మనందరికీ తెలుసు. తాండ్ర సుబ్రహ్మణ్యంగారిచేత రచింపబడిన యీ పౌరాణిక నాటకాన్ని చలనచిత్రంగా నిర్మించడానికి ప్రముఖ కళాదర్శకుడు రాజేంద్రకుమార్ పూనుకున్నారు. ఈస్ట్మన్ కలర్‌లో భారీయెత్తున నిర్మించడానికి నిర్ణయించారు.

'శ్రీరామాంజనేయ యుద్ధం' చిత్రంలో శ్రీరాముడిగా ఎన్టీరామారావు నటించడానికి అంగీకరించారు. నిర్మాత రాజేంద్రకుమార్‌కి తన సంపూర్ణ సహకారాల నిస్తానని వాగ్దానం చేశారు. యావద్భారతంలో శ్రీరాముడి పాత్రకి రామారావు తప్ప మరొకరు పనికిరారు అన్న సత్యం యెప్పుడో తేలింది. పైగా ఎన్టీఆర్‌కి రాముడిపాత్ర అంటే చాలా యిష్టం. ఈ పౌరాణిక చిత్రరాజం యొక్క దర్శకత్వాన్ని కమలాకర కామేశ్వరరావు నిర్వహిస్తున్నారు. గద్యాన్ని సముద్రాల, పద్యాన్ని తాండ్ర సుబ్రహ్మణ్యం వ్రాస్తున్నారు.

గతవారం నిర్మాత రాజేంద్రకుమార్, దర్శకుడు కామేశ్వరరావుగార్లు హోగెనకల్ వెళ్ళి అవుట్‌డోర్ లొకేషన్లను నిర్ణయించి వచ్చారు. రాజమండ్రి, గోదావరి ఒడ్డున కొన్ని సెట్లను నిర్మించి, రామాంజనేయ యుద్ధం దృశ్యాలను చిత్రీకరించడానికి నిశ్చయించారు.

'నభూతో న భవిష్యతి' అనిపించుకునే విధంగా నిర్మించాలని, రాజేంద్రకుమార్ ఆశిస్తున్నారు.

రెండవ చిత్రం మొదటిపాట రికార్డింగ్!

అన్నపూర్ణా కంబైన్స్‌వారి ద్వితీయ చిత్రంయొక్క మొదటిపాట రికార్డింగు మే 10 వ ఉదయం తొమ్మిది గంటలకు జెమినీలో జరిగింది. డాక్టర్ నారాయణ రెడ్డి వ్రాసిన:

'కన్నె వధువుగా మారేది
జీవితంలో ఒకేసారి
ఆ వధువు వలపు విసిరేది
యిక్కడే తొలిసారి'

—పాటను చక్రవర్తి సంగీత సారథ్యంలో సుశీల, ఘంటసాల అమృతతుల్యంగా ఆలపించారు. చిత్రంలో నాయకీ నాయకులపై చిత్రీకరింపబడుతుంది, అన్నారు నిర్మాత క్రాంతికుమార్.

ఇంతవరకు తెలుగు చిత్రాల్లో రాని చక్కటి కథను అన్నపూర్ణా కంబైన్స్ ఎన్నుకొన్నారు. వినుగు, విరామం తెలియని, విశ్వనాథ్ (కాశీనాథుని విశ్వనాథ్) గారిని దర్శకునిగా ఎన్నుకోవడం మరొక విశేషం. సంభాషణల రచయితగా బొల్లిముంత వుండడం, ఛాయాగ్రాహకునిగా డి. కె. రాము కుదరడం, కూర్పును అంకిరెడ్డి చేపట్టడం, శిల్పాన్ని కుదరవల్లి నాగేశ్వరరావు చిత్రించడం, ప్రొడక్షన్ను పార్థసారధి గమనించడంవల్ల; శోభన్‌బాబు, శారద, రాజబాబు, అల్లు రామలింగయ్య, రావుగోపాలరావులాటి మంచి టీమ్ దొరకడం వల్ల: నిర్మాతలకి బ్లడ్‌ప్రెషర్ వుండదు. పని సాఫీగా సాగుతుంది. నిర్మాతలు క్రాంతికుమార్, రాఘవరావులు నిర్మించే రెండవ చిత్రం యిది. షూటింగు జూన్‌లో ప్రారంభమవుతుంది.

పద్మనాభం నిర్మిస్తున్న నవ్వుల చిత్రం

ఇటీవల నేను ఒక హిలేరియస్ కామెడీ నాటకాన్ని తమిళంలో చూశాను. దాని పేరు కాశీయాత్ర. హాలులో కూర్చున్నంత సేపు కడుపుబ్బ నవ్వించింది, ఆ నాటకం. ఇంత హుషారయిన యితివృత్తాన్ని ఎవరయినా చిత్రంగా నిర్మిస్తే బాగుంటుంది అనుకున్నాను. అనుకున్న అయిదు నిమిషాలకి ప్రముఖ హాస్యనటుడు పద్మనాభంగారిని ఒక పబ్లిక్ ఫంక్షన్‌లో కలిశాను.

'మీ తర్వాతి ప్రాజెక్టు ఏమిటి?' అని ప్రశ్నించాను. 'కాశీయాత్ర'ను తెలుగులో నిర్మిస్తున్నాను, అన్నారు. చాలా మంచి సబ్జెక్టును సెలెక్టు చేసినందుకు అభినందించాను. 'పేరు పెట్టారా?' అన్నాను.

'అజన్మ బ్రహ్మచారి' అని సమాధానం యిచ్చారు. ఖచ్చితంగా వుంది టైటిలు అనిపించింది.

అజన్మ బ్రహ్మచారి

నవ్వుల వర్షం కురిపించే యీ చిత్రానికి బి. ఏ. సుబ్బారావు దర్శకుడు. (మినిమమ్ గ్యారంటీకి ఢోకా వుండదు). పాలగుమ్మి పద్మరాజు రచన, కోదండపాణి



'మానవుడు—దానవుడు'లో శోభన్‌బాబు, శారద.

సంగీతాన్ని: కె. సత్యనారాయణ ఛాయనూ, అనంతరావ్ కళను నిర్వహిస్తారు. టి. పురుషోత్తం నిర్మించే యీ చిత్రంలో పద్మనాభం, నాగభూషణం, రామకృష్ణ, రాజబాబు, విజయలలిత, గీతాంజలి, శీలా రాణీ ప్రధాన పాత్రధారులు.

చంద్రకళకి సుశీల పాట

శ్రీ పూర్ణా మూవీస్‌వారి మొదటి చిత్రానికిగాను మే 8వ విజయాగార్డెన్ థియేటర్లో సుశీల పాడిన పాటకి మహదేవన్ బాణీ కూర్చారు. డాక్టర్ నారాయణరెడ్డి వ్రాసిన

'ఏదో కొత్తగా వుంది।
ఎంతో తృప్తిగా వుంది
జీవితంలా మధువు కాస్త
చేదుగా వుంది; ఐనా రుచిగా నే వుంది'

పాటను చంద్రకళపై చిత్రీకరిస్తారు. ఈ పాట యొక్క సన్నివేశం యేమిటో తెలుసా?

ఎన్నడూ తాగని చంద్రకళ చేత, చంద్రమోహన్ యీ అఘాయిత్యాన్ని చేయిస్తాడు. తాగిన మత్తులో చంద్రకళ తూలుతూ, ఆడుతూ పాడుతుంది యీ పాటను, అన్నారు నిర్మాత పూర్ణచంద్రరావు. మే

సినిమా 15వ ప్రసాద్ స్టుడియోలో షూటింగు షెడ్యూలు యీ పాటతో ప్రారంభమవుతుంది. మొదటి సెట్లో అయిదు రోజుల వరకు జరుగుతుంది. అనేక బాక్సాఫీస్ చిత్రాలకి, అవార్డు తెచ్చిన చిత్రాలకి దర్శకత్వం వహించిన ప్రత్యగాత్మగారు యీ చిత్రానికి దర్శకులు మాత్రమే గాదు; కథకులు, స్క్రీన్‌ప్లే తయారు చేసినవారు కూడా. ఈ చిత్రానికి రావకొండ విశ్వనాథశాస్త్రి మాటలను, శేఖర్-సింగ్ ఛాయను, బి. ఎస్. కృష్ణ కళను, దండపాణి కూర్పును నిర్వహిస్తున్నారు.

శ్రీ పూర్ణా మూవీస్ సంస్థను ఎ. పూర్ణచంద్రరావు, ఎం. చంద్రశేఖర్లు స్థాపించారు. వీళ్ళకి సహనిర్మాతలుగా సి ఆర్. కృష్ణ, డి. కృష్ణారావులు వుంటారు.

చంద్రకళ ధరిస్తున్న రెండు పాత్రలు

చంద్రకళ తల్లిగా, కుమార్తెగా నటించడం ఒక విశేషం. తల్లిపాత్రకి కృష్ణంరాజు జోడయితే, కుమార్తె భూమికకి



'నీతి-నిజాయితీ'లో కాంచన

చంద్రమోహన్ యీడవుతాడు. సహాయ పాత్రలను ధూళిపాళ, కె. కె. శర్మ, శేషగిరిరావు, సాయికుమారి, సత్యనారాయణ దీక్షిత్, నరసింహరావు, సారధి, వై. వి. రాజా పోషిస్తున్నారు. శ్రీ ఫిలింస్ విడుదల.

అక్కినేని రష్యా పయనం!

ప్రస్తుతం ఊటీలో అవుట్ డోర్ షూటింగులో (బంగారు బాబు) పాల్గొంటున్నారు, అక్కినేని నాగేశ్వరరావు. ఆయనకి రష్యా ప్రభుత్వం ఆహ్వానం పంపింది; తమ అతిథిగా రమ్మని. ఇలాంటి పిలుపు గత ఏడాదికూడా ఆయనకి వచ్చిన విషయం నాకు తెలుసు.

మే 22వరకు 'బంగారు బాబు'లో పాల్గొని, 23వ నటినచేతంగా నాగేశ్వరరావుగారు రష్యాకి వెళ్ళగలరని తెలుస్తోంది. కక్కంలోబాలు [illegible]

సినిమా డైరీ

● శోభన్ నాయకుడిగా నటిస్తున్న ఎ. వి. ఎమ్. చిత్రానికి ఎన్ ఆర్ నంది సంభాషణలను సమకూరుస్తున్నారు.


● అన్నపూర్ణా కంబైన్స్ వారి ద్వితీయ చిత్రం మొదటి పాట రికార్డింగు మే 10న జెమినిలో జరిగింది. నారాయణరెడ్డి పాటను, చక్రవర్తి సారథ్యంలో సుశీల, ఘంటసాల పాడారు.... కె. విశ్వనాథ్, దర్శకుడు

● డి. వి ఎస్ ప్రొడక్షన్స్ 'అబ్బాయిగారు—అమ్మాయిగారు' అవుట్‌డోర్ మే 13 నుండి, 15 వరకు బెంగుళూరులో జరుగుతుంది కృష్ణ, గీతాంజలి పాల్గొంటారు. వి రామచంద్రరావు దర్శకుడు

● రవీంద్రా ఆర్ట్ పిక్చర్స్ 'దత్తపుత్రుడు' చివరి తెరలురోజుల షూటింగు మే 11, 12, తేదీల్లో ఊటీలో జరుగుతుంది. అక్కినేని, రామకృష్ణ, వి. నిర్మల పాల్గొంటారు. టి. లెనిన్ బాబు దర్శకుడు.

● శ్రీరమణ చిత్ర ఇంటర్నేషనల్ 'దేవుడమ్మ' షూటింగు మే 2 నుండి 12 వరకు శివనేలో జరుగుతూ వుంది. చలం, లక్ష్మి, రామకృష్ణ, రమణారెడ్డి, నిర్మల, రావుగోపాలరావు పాల్గొని నటిస్తున్నారు. కె. వి. నందనరావు దర్శకుడు.

● సుభాషిణీ ఆర్ట్ పిక్చర్స్ చిత్రంయొక్క అవుట్‌డోర్ షూటింగు మే మొదటి వారంలో మద్రాసు సమీపాన జరిగింది కె. హేమాంబరధరరావు దర్శకుడు.



ఒక శింగార్
జాడీలో మీకోసం
ప్రత్యేకంగా ప్యాక్
చెయ్యబడిన
1276 ప్లాస్టిక్ బొట్లు

ఒక్క శింగార్ జాడీ మీకు ఒకవెయ్యి, రెండు వందల డెబ్బై ఆరు మీడియం సైజు ప్లాస్టిక్ బొట్లను ఇస్తుంది. భారతదేశంలో లక్షలాది స్త్రీలు శింగార్ ప్లాస్టిక్ బొట్లే కావాలని కోరటంలో ఆశ్చర్యం లేదు. వారికి తెలుసు తాము పెట్టే ఖర్చుకు తగిన విలువ శింగార్‌లో లభిస్తుందని.

అందమైన ప్యాక్‌లో, సీసాలోనే ఇగిరిపోని మంచి రకం శింగార్ కుంకుమ మీకు అందజేస్తున్నాం. అందుచేత ఏ ఇతర కుంకుమ కంటే శింగార్ చాలా కాలం వస్తుంది.

నొసటిపై ఒకటి మాత్రమే.





శింగార్

పారమౌంట్ ప్రొడక్ట్స్
809 ప్రసాద్ ఛేంబర్స్,
బొంబాయి-4.

కుమ్‌కుమ్—
బిందీలలో పేరుగాంచినది.

PRATIBHA 203-9-TEL

విదేశాలను పర్యటించి జూన్ మూడవ వారంలో స్వదేశానికి తిరిగివస్తారని తెలియ వచ్చింది.

మే 18 న

శ్రీకృష్ణాంజనేయ యుద్ధం

తారకరామా పంపిణీసంస్థ ద్వారా విడుదల అవుతున్న మొదటిచిత్రం యిది. భారీ ఎత్తున నిర్మించబడిన యీ చిత్రం మే 18 న విడుదలవుతుంది. 'లవకుశ'కి దర్శకత్వం నెరపిన సి. ఎస్. రావ్ గారికి మంచి పేరును తెచ్చిపెట్టే చిత్రం యిది. సత్యభామగా వాణిశ్రీ అద్భుతంగా నటించిన చిత్రం యిది. పౌరాణికపాత్రలకి తనొక్కడే సమర్థుడు అని మరోసారి నిరూపించుకున్న ఎన్టీ రామారావు నటన హైలైటుగావున్న చిత్రం యిది. జి. కె. రాము ట్రిక్ ఫొటోగ్రఫీ నిర్వహించిన చిత్రం యిది. గోఖలే కళాప్రతిభకి గీటురాయిగా వుండే చిత్రం యిది; రాజనాలకు పేరు తెచ్చే చిత్రం యిది. బలరామదేవునిగా బలమైన నటనను చూపెట్టిన ఎస్వీ రంగారావుకు సరికొత్త పాత్రనిచ్చిన చిత్రం యిది' అన్నమాటలు తప్ప మరొకటి నా చెవినబడలేదు, యీ చిత్రం గురించి. ఇంత మంచి చిత్రాన్ని నిర్మించిన డి. ఎస్. రాజు మరో మంచి చిత్రాన్ని అతి త్వరలో ప్రారంభిస్తారు. ఈ చిత్రంలో టి. వి. రాజు సంగీతం మధురాతి మధురంగా వుందని అంటున్నారు.

92 లక్షల

పన్ను బకాయింపు

తమిళనాడులో జరిగిన రెయిడ్‌ల ఫలితంగా రు. 92 లక్షల వరకు పట్టుబడింది అని కేంద్రమంత్రి కె. ఆర్. గణేష్ లోక్‌సభలో వెల్లడించారు. పన్ను బాకీవున్న వ్యక్తుల పేర్లను కూడా చదివారు.

హీరాచంద్ షియాల్, శాంతి ఫిలింస్, పెరియన్నన్, ఎస్. వి. వెంకటేశ మొదలియార్, టి. అనంతస్వామి, హేమమాలిని, వి. సదాశివన్, ఎం. గోపాలకృష్ణన్, హారక్‌చంద్, షేక్ యిస్మాయిల్ అండ్ సన్, మద్రాస్ ఫిలిమ్ డిస్ట్రిబ్యూటర్స్, మరియు వందమంది గత కొన్నేండ్లుగా పన్ను కట్టకుండా వున్నారని వెల్లడి అయింది.

బొంబాయిలో రెయిడ్‌లు

బొంబాయి ఫిలిం పర్సనాలిటీల యిండ్లలో జరిగిన సోదాల ఫలితంగా నగలు, వజ్రాలు, వైఢూర్యాలు, విలువైన రాళ్ళు దొరికాయి. నల్లడబ్బు ఆశించిన మేరకు దొరకలేదు. అయిదారులక్షలు మాత్రమే లభ్యమైంది. 28 మంది ఫిలిం పెద్దలు ఈ రెయిడ్‌లకి గురిఅయ్యారు. వీరిలో నటులు 5 గురు, నటీమణులు ముగ్గురు, 13 గురు దర్శకనిర్మాతలు, 7 గురు సాంకేతిక వర్గానికిచెందిన వ్యక్తులు అని తేలింది. ఈ వివరాలను బొంబాయి సర్కిల్ 1, ఇన్‌కంటాక్స్ కమిషనర్ శ్రీ కె. వి. కురువిల్లా ప్రకటించారు. మాకు అందిన సమాచారాన్ని బట్టి, మా స్టాఫ్ చేత యీ రెయిడ్ జరిగింది, అన్నారు కురువిల్లా. ఇరవై అయిదుగురి బ్యాంకు లాకర్లు సీజ్ చేసినట్లు, మరొక పదముగ్గురి బ్యాంకు వాల్టులు త్వరలోనే తెరవనున్నట్లు శ్రీ కురువిల్లా చెప్పారు. మేనెల జరిగిన యీ రెయిడ్‌ను 250మంది ఆదాయపు పన్ను ఆఫీసర్లు, 500మంది ఉద్యోగులు జరిపారు.

హీరో అయిన

ముఖ్యమంత్రి కుమారుడు!

తమిళనాడు ముఖ్యమంత్రి తిరు. కరుణానిధి కుమారుడు ము. క. ముత్తు 'పిళ్ళయో పిళ్ళై' చిత్ర కథానాయకుడయ్యాడు. లక్ష్మి నాయికగా నటించింది. కృష్ణన్—పంజు దర్శకులు.



సుమతా ప్రొడక్షన్స్ వారి ప్రయోజనాత్మక చిత్రం 'కాలం మారింది'లో ఒక సన్నివేశం, శోభన్‌బాబుతో శారద.

మైసూరులో పండంటి కాపురం

హీరో కృష్ణ, నటుడు ప్రభాకరరెడ్డి కలసి కలర్‌లో నిర్మిస్తున్న 'పండంటి కాపురం' నే షెడ్యూలుతో 10 రీళ్లు తయారైందని, దర్శకుడు లక్ష్మీదీపక్ చెప్పారు.


మే 16 నుండి 24 వరకు మైసూరు, మరియు పరిసర ప్రాంతాల్లో రెండు పాటల చిత్రీకరణ జరుగుతుందని, యిందులో జమున, విజయనిర్మల, కృష్ణ, గుమ్మడి, రాజబాబులు పాల్గొంటారని, లక్ష్మీదీపక్ వెల్లడించారు. ఈ చిత్రంమీద తనకు గట్టి నమ్మకం వుందని, నటీనటు లందరూ తనకు మ్యాక్సిమమ్ కో ఆపరేట్ చేస్తున్నారని చెపుతూ; ప్రభాకరరెడ్డి రచనాశక్తిని కొనియాడారు.

పెద్ద తారాగణం

'పండంటి కాపురం' చిత్రంలో వెండి తెర అతిరథ మహారథులందరూ వుండడం ఒక విశేషం. వున్నవాళ్లందరికీ సరయిన పాత్రలు లభించడం రెండవ విశేషం. ఈ చిత్రంలో జమున, విజయనిర్మల, సరోజాదేవి, దేవిక, కృష్ణ, ఎస్వీరంగారావు, గుమ్మడి, ప్రభాకరరెడ్డి, రాజబాబు, మిక్కిలినేని ప్రధాన పాత్రధారులు. ఇంత మంది పెద్ద తారలు యిటీవల చిత్రాల్లో ఎక్కడా కనిపించరు. ఈ చిత్రానికి మద్దిపట్ల సూరి మాటలను, కోదండపాణి సంగీతాన్ని, అనంతరాం కళను, గోపాలరావు ఫొటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. పూర్ణా విడుదల.

బెంగుళూరుకు వెడుతున్న కృష్ణ—గీతాంజలి

నిటి హీరోగావుంటూ, వ్యాపార దక్షత వున్న నిర్మాతగా ప్రకాశిస్తూ, కొన్నివందల మందికి జీవనోపాధి కలిపిస్తున్న కృష్ణ రోజుకి 16 గంటలు పెట్టి పనిచెయ్యడాన్ని చూసి ఆశ్చర్యపడ్డాను. ఆయనకున్న పేరు, డిమాండ్‌కి యింత శ్రమ అనవసరం అనిపిస్తుంది. తన్ను పెట్టికొన్న నిర్మాతలకి మంచిచెయ్యడమే ధ్యేయంగా







'హంతకులు—దేవాంతకులు'లో రాజసులోచన, నాగేష్, సత్యనారాయణ.

వుండడంబట్టే, కృష్ణ టాప్ హీరోల్లో ఒకరుగా విరాజిల్లుతున్నారు.

మేనెల అంతా అంటే 12 వరకు ఇన్ డోర్ షూటింగులో కృష్ణ పాల్గొన్నారు. మే 13న గీతాంజలితో ఒక పాట చిత్రీ

సినిమా

కరణలో పాల్గొనడానికై బెంగుళూరుకి వెడుతున్నారు. ఈ యుగళగీతం డి. బి. ఎన్. ప్రొడక్షన్స్ 'అబ్బాయిగారు — అమ్మాయిగారు' చిత్రంలో కనిపిస్తుంది.

డి. బి. ఎన్. షూటింగు పూర్తయింది

'అబ్బాయిగారు—అమ్మాయిగారు' చిత్రం షూటింగు బెంగుళూరు షెడ్యూలుతో పూర్తి అయినట్టే' అన్నారు నిర్మాత డి. బి. నారాయణ. మంచి చిత్రం కోసం ఖర్చుకు వెనుకాడని నిర్మాత డి. బి. ఎన్. ఈ చిత్రం సర్వజనరంజకంగా వచ్చింది అని రషెస్ చూసినవాళ్ళ వువాచ. వాణిశ్రీ. గీతాంజలి, కృష్ణ పోటాపోటీగా నటించినట్టు, మహదేవన్ సంగీతం సుమధురంగా వున్నట్టు, రామచంద్రరావు దర్శకత్వం అణువణువునా అగుపించేట్టు, కథ ఆద్యంతం స్పీడుగా సాగినట్టు, చిత్రంపై అభిప్రాయం వెలిబుచ్చున్నారు. శ్రీ ఫిలింస్ విడుదల.

ఫ్యాక్టరీ అధినేత అయిన కథానాయిక!

'కృషితో నాస్తి దుర్భిక్షమ్' అన్న నానుడికి వాణిశ్రీ న్యాయం చేకూర్చింది అనే చెప్పాలి. ఇంతై అంతై, నేడు ఎంతో పెద్దదైంది, వాణిశ్రీ. నటిగా పేరు ప్రఖ్యాతులను బడసిన వాణిశ్రీ ఒక ఫ్యాక్టరీకి యజమానురాలైంది. దేశ సౌభాగ్యానికి వుపయోగపడే ఒక పారిశ్రామిక సంస్థను స్థాపించింది.

మద్రాసు అమింజికర్రైలో వెలసిన ఈ బ్యాటరీ తయారీ ఫ్యాక్టరీకి 'వెస్టా బాటరీస్' అని నామకరణం జరిగింది. ప్రపంచ కార్మికదినమైన మే 1న బేటరీస్ విడుదల వుత్సవం కోలాహలంగా జరిగింది. ప్రశస్తమైన ఈ డైనమిక్ బ్యాటరీని తమ కారునకు అమర్చి, వాణిశ్రీ కారును డ్రైవ్ చేశారు. సోలార్ వర్క్సుకి చెందిన మాత్రి మణ్య అయ్యర్ రిబ్బన్ కత్తిరించారు. రైల్వే, టెలిఫోన్‌లాటి పెద్దపెద్ద ప్రభుత్వ శాఖలకు సైతం ఈ బేటరీస్ వుపయోగపడగలవని ఆయన చెప్పారు. ప్రొడక్షన్ ఇంజనీరు మహదేవన్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని, బేటరీస్ వుపయోగాన్నిగూర్చి వివరించారు. నీలకంఠం వందన సమర్పణ గావించారు.

ఫంక్షన్‌కి విచ్చేసిన అతిథులను వాణిశ్రీ, వాళ్ళ అక్కయ్య కాంతమ్మ, బావ

ఆర్. ఎస్. రాజుగార్ని సాదరంగా ఆహ్వానించి, షడ్రసోపేతమైన విందుతో సత్కరించారు. ఈ ఫాక్టరీ తయారుచేసిన మొదటిసెట్టు బ్యాటరీలను ఇండియన్ మర్కంటైల్ కార్పొరేషన్‌వారు పంపిణీ దారులుగా అందుకున్నారు.

మాట నిలబెట్టుకున్న మహిళ !

అసాధారణ ప్రజ్ఞావంతురాలు అని మరో సారి నిరూపించుకున్న భానుమతిగారికి పలు పట్టణాల్లో ఘనసన్మానం జరిగింది. 'అంతా మన మంచికే' ప్రారంభించిన నాడే యీ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది అన్న భానుమతిగారి మాటలు నేడు నిజమైనాయి. విశాలాంధ్ర అంతటా యీ చిత్రం సంచలనాన్ని కలిగించింది.

దేశ సమస్యల పరిష్కారంలో ఇందిరా గాంధీ ఎంత ఘటికురాలు అని ప్రశంసలు అందుకుంటూ వున్నారో, సమాజంలోని కుళ్లు కల్మషాలను, దోపిడీ దుర్మార్గాలను, సబలలైన అబలల దుస్థితిని తేట తెల్లంగా తెలిపి, దానికి పరిష్కార మార్గం చూపించిన ప్రయోజనాత్మక చిత్రమే 'అంతా మన మంచికే' వలన చిత్ర రంగంలో సరికొత్త సంచలనాన్ని కలిగించింది చిత్రం. ప్రేక్షక లోకం భానుమతిగారి సాహసానికి బ్రహ్మరథం పట్టింది.

భానుమతికి సన్మానం

ఇటీవల శ్రీమతి భానుమతి విజయవాడ, గుంటూరు; బందరు, ఏలూరు మున్నగు పట్టణాల్లో ప్రేక్షకులను, ముఖ్యంగా మహిళలను కలుసుకుని, వారి అభినందన సత్కారాలను అందుకున్నారు. స్వయంగా గాలరీకి వెళ్లి, చిత్రం పై మహిళల అభిప్రాయం సేకరించిన భానుమతిగారికి, యీ చిత్రం పెద్ద లాభాలను ఆర్జించి పెడుతుంది. 'మాట నిలబెట్టుకున్న మహిళ భానుమతి'

జూన్‌లో షూటింగు !

భరణీ పిక్చర్స్ అతిత్వరలో రెండు చిత్రాలను నిర్మించడానికి నిర్ణయించారు. ఒక చిత్రాన్ని పి. రామకృష్ణ డైరెక్టు చేస్తారు. మరొకదాన్ని భానుమతి, దర్శకత్వం నిర్వహిస్తారు. ఒక చిత్రానికి భానుమతి ఎస్. ఆర్. నంది మాటలను రాస్తున్నారు. రెండవ చిత్రానికి భానుమతి; సముద్రాల సంభాషణలను సమకూరుస్తున్నారు. ఒక చిత్రం జూన్‌లో షూటింగు ప్రారంభమవుతుంది.

కలర్‌లో 'సయాప్పై గావ్'

మెహబూబ్ ఫిలింస్ మొదటి చిత్రానికి 'సయాప్పై గావ్' అని పేరు పెట్టారు. ప్రభాకర్ గోఖలే దర్శకత్వంలో తయారయ్యే యీ కలర్ చిత్రానికి ఎస్. దత్తా సంగీతాన్ని, షకీర్ కోట్వి పాటలను, మాటలను, సమకూరుస్తారు. నిర్మాత మెహబూబ్ వ్రాసిన స్వంత కథ యిది. ప్రధాన పాత్రలను శోభనా, షహీనా, రంజిత్ వర్మ పోషిస్తారట.

నాగేష్ విజృంభణ

ఎస్. ఆర్. కంబైన్స్‌వారి 'హంతకులు దేహాంతకులు' చిత్రంలో నాగేష్ విజృంభించి నటించారట. ఆద్యంతం తన హుషారైన నటనతో కథకి మంచి థ్రిల్లా స్పీడును యేర్పరిచారట. కృష్ణ హీరోగా నటించిన యీ సస్పెన్స్ థ్రిల్లర్‌ని ఎస్. వి. సుబ్బారావు, ఎం. కె. రాధ నిర్మించారు. కె. ఎస్. ఆర్. దాస్ దర్శకత్వం నెరపిన యీ చిత్రం అన్నపూర్ణాద్వారా విడుదలవుతుంది.

—శ్రీనివాస్

సినీ సాక్షి

తారల ఇళ్లపై దాడులు !
ఆంధ్రప్రదేశ్‌లో కరెంటు కోత!!

ఈ మధ్య బొంబాయిలోని ప్రముఖ నటీనటులు, దర్శకులు, నిర్మాతల యిళ్లపై ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంటువారు దాడులు ఉధృతంగా జరిపారు. మూడురోజులు పెద్ద పెట్టున వందమంది యిళ్లమీద దాడిచేస్తే 5 లక్షల రూపాయలు, కొన్ని నగలు పట్టుబడ్డాయట !

ఇన్‌కంటాక్స్ వారి యీ వ్యవహారం చూస్తే — కొండను తవ్వి ఎలుకను పట్టుకున్నట్టుంది. కొన్ని కోట్ల రూపాయల నల్లధనం దొరుకుతుందని హామీగా విశ్వసించి, బ్రహ్మాండాన్ని తవ్వి వాళ్ల దగ్గర నుంచి శోధ చేయటం ప్రారంభించారు. ఇంతకీ వాళ్లకి దొరికింది ఎంతయ్యా అంటే, ఐదు లక్షలు!

దేశం మొత్తంమీద 400 కోట్ల రూపాయలకు పైగా నల్లధనం మూలుగుతున్న దని యీమధ్య ఒక పత్రికలో ప్రచురించ బడింది. అదే నిజమయితే, యీ 'నాలుగు వందల కోట్ల రూపాయల పైచిలుకు నల్లధనమూ' ఒక్క సినిమా వారి దగ్గరే ఉన్నదా? ఇతర రంగాల్లోని ప్రముఖులెవరి వద్దా నల్లధనం లేదని ప్రభుత్వం భావిస్తున్న దేమో తెలీదు గాని, సినిమా వారి దగ్గర అంత డబ్బు ఉండటం అన్నది అసంభవం!

సినిమా వారి దగ్గర మహా అయితే 10 నుంచి 15 కోట్ల వరకూ దొరకవచ్చు. మరి మిగిలిన అన్ని కోట్ల రూపాయల నల్ల ధనమూ ఎవరి దగ్గర ఉన్నట్టు? సినిమా వారే ఎప్పుడూ ముందు ప్రభుత్వం దృష్టికి వస్తారు. డబ్బులో తులతూగుతున్నట్టు కనిపిస్తారు. నల్లధనం కుప్పతెప్పలుగా మూలుగు తున్న యితర రంగాలలోని ప్రముఖుల జోలికి, ప్రభుత్వం ఎందుకు పోవటం లేదని దక్షిణాది చలన చిత్ర పరిశ్రమలోని ప్రసిద్ధులంతా ప్రశ్నిస్తున్నారు.

* * *

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కరెంటు మీద 25 శాతం కోత విధించింది. అది యీనెల నుంచి అమలులోకి వస్తుంది. అందువల్ల సినిమా థియేటరు యజమానులు ఇక నుంచి రోజుకి రెండు ఆటలు మాత్రమే వేయాలి. వర్షాకాలం వచ్చే వరకూ యీ పరిస్థితి యిలానే కొనసాగుతుంది.

మేనెల రెండవవారం నుంచి జూన్ నెలాఖరు వరకూ విడుదలయ్యే కొత్త చిత్రాలు యీ కరెంటు కోతకు గురి అవుతాయి. అసలే మన చిత్రాల స్థితిగతులు అంతంత మాత్రంగా ఉంటుంటే యిప్పుడు కరెంటు కోత ఒకటి కొత్తగా వచ్చిపడింది— మూలుగు తున్న నక్క మీద తాటికాయ పడ్డట్టు!

—మోహన్ కుమార్

పుస్తకాలు

1. పున్నమి మనకలు

రచన: కళ్యాణసుందరీ జగన్నాథ్.

2. అత్తగారూ నక్సలైట్లూ

రచన: సుమతి రామకృష్ణ.

3. పెళ్లానికి ప్రేమలేఖ

రచన: ముప్పాళ రంగనాయకమ్మ. ప్రచురణ: యంశేషాచలం అండ్ కో మచిలీపట్నం, మద్రాసు, సికింద్రాబాద్ వెల: ఒక్కొక్కటి రు.2—50.

పున్నమి మనకలు సంపుటంలో పది తెలుగు జిలుగు కథలున్నవి. అవి చిరుచెమటలు, చందనం వజరాలు వాన, మాడంత మబ్బు, పుట్టిన రోజు, పున్నమి మనకలు, సముద్రజ్వాల, సాయంకాలే వనాంతే, అనిలజ్యోతి, రక్తాక్షతలు, సర్పకంకణం. చక్కటి ఇతి వృత్తాన్ని ఎంచుకొని హాయిగా చెప్పగల రచయిత్రి శ్రీమతి కళ్యాణ సుందరీ జగన్నాథ్ అని ఈ కథలు నిశదం చేస్తాయ్. ఈకథలన్నింటిలోనూ సర్పకంకణం బాగున్నదని పించుతుంది.

'అత్తగారూ నక్సలైట్లూ' సంపుటంలో శీర్షిక కథ కాక ఎనిమిది కథలున్నాయ్ అది అత్తగారూ—ఫామిలీ ప్లానింగ్, అత్తగారూ ఓటూ, అత్తగారూ కట్టుడుపళ్లు, అత్తగారూ బాల్ పాయింటూ, కామాక్షి కథ, అత్తగారూ—అవుపేడా మరో ప్రపంచం, చక్రపాణి ఇంద్రలోకయాత్ర. కల్పనకు కంటే పాత్రచిత్రణకు ప్రాముఖ్యమిచ్చిన కథలివి. ఆసందర్భంగా అత్తగారు వ్యవహరించడం ఆఖరికి దవడలు నొక్కుకొనటం నుంచి హాస్యాన్ని అందించే కథలివి. వినోదానికి ప్రాముఖ్యమిచ్చే రచయిత్రి శ్రీమతి భానుమతీ రామకృష్ణ.

పెళ్ళానికి ప్రేమలేఖ, ఆడపిల్ల అంతరాత్మ, పెళ్లి చేసేశాం., అపశ్రుతి, పిల్ల చూపులు, కని గారూ కుర్రాళ్ళూ, ప్రేమ రోడ్డెక్కింది, అన్నలు అనే ఎనిమిది కథలున్నాయ్ మూడవ సంపుటంలో ఒక లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని కథలు వ్రాసే రచయిత్రి ముప్పాళ రంగనాయకమ్మ అని విదితం చేస్తాయ్ యీ కథలు. చదివి, ఆలోచించదగిన కథలివి.

మొత్తం మీద యీ మూడు సంపుటాలూ మెచ్చదగినవే ప్రశంసించ దగినవే.

—వి. ఎస్. అవధాని

రుధిరజ్యోతి

రచన: శ్రీ శ్రీరంగం—నారాయణబాబు. సంకలనం: శ్రీ ఆరుద్ర. డెమ్మీ 24+167 పుటలు. వెల: 4 రూ. ప్రకాశకులు: నవోదయ పబ్లిషర్స్, విజయవాడ—2, గుంటూరు—2.

శ్రీ నారాయణబాబు కవిత్వంలోనూ, బంధుత్వంలోనూ, ఆశయాల్లోనూ శ్రీశ్రీకి సన్నిహితుడు. 'నీ పాటల కత్తులతోనే—నా హృదయం నెత్తురు తీసి, నే వెలిగించిన ఈ దీపపు కాంతిని నర్తింపుముర!' అని రచయితే చెప్పుకొన్నారు. 'కదనకుతూహల రాగం వినిపించిన విప్లవఋషి విద్రోహ కవి శ్రీరంగం నారాయణబాబు' అని ప్రకాశకుల భాషణం. ఇందులోని నలభై కవితల్లో చాలావరకు ఇంతకుముందు భారతి, ప్రతిభ, ఢంకా, ఆనందవాణి, నవశక్తి, జ్వాల మున్నగు పత్రికల్లో ప్రకటింపబడినవే. శ్రీ నారాయణబాబు చనిపోయి చాలా కాలమయింది. ఆయన కవితలు మరుగుపడిపోకుండా శ్రీ ఆరుద్ర సంకలనం చేశారు. దీనికి శ్రీ రోణంగి అప్పలస్వామి 1952 లోనే 'ప్రస్తావన'. రాసి 'భారతి' లో ప్రకటించారు. అందులో భావ, వాస్తవిక కవితలను గురించి, విశేషంగా వాస్తవికతను గురించి, శ్రీశ్రీ—నారాయణబాబుల కవితా మార్గాలను గురించి నారాయణబాబు కవితా వైశిష్ట్యాన్ని గురించి విపులంగా చెప్పబడింది. 'పాశ్చాత్య కవితలోని ఆధునికత నారాయణబాబు పుణికి పుచ్చుకున్నాడు. దీనికి మన సంప్రదాయం రంగరించుకున్నాడు. నిష్పక్షపాత దృష్టితో విమర్శించే వారికి ఈ కవిత్వం ఆహ్లాదం కలిగించక మానదు' అని శ్రీ అప్పలస్వామి తెలిపారు.

శ్రీ రెంటాల గోపాలకృష్ణ రచించిన 'సంఘర్షణ' కు శ్రీ నారాయణబాబు వ్రాసిన 'పీఠికలోని' కొన్ని భాగాలు 'ప్రసర'గా ఇయ్యబడినవి. అందులో 'ఈనాడు కవిత అభ్యుదయ పథాలనంటి మానవజాతి పురోగమనం కోసం ఒక మహాసీయ సధాన్ని పట్టింది. ఇది మానవజాతి అంతటికీ ముక్తినిస్తుంది. అతి నవ్యకవులంతమంది ఈ ఋజు మార్గంలోనే తమ తమ కలాల్ని నడిపిస్తున్నారు' అని ఆయన నవ్యకవుల దృక్పథాన్ని వివరించారు. కవిత్వం దేశాభ్యున్నతికీ మానవ సుఖజీవనానికి తగిన సాధనం! దానివల్ల అభ్యుదయం కలగాలనే అందరూ కోరేది. నవ్యకవిత దానికి సహకరించగలదని ఆశింపవచ్చు.

— ఆంగీరస.

రెండు బుల్లెటిన్‌లు

ఇండియన్ బాంక్స్ ఎసోసియేషన్ వారు మార్చి ఏప్రిల్ 1972 నుంచి రెండు 'బుల్లెటిన్' లని వెలువరిస్తున్నారు.


'బ్రాంచ్ మేనేజర్'లో బాంకుల బ్రాంచి మేనేజర్లకి పనికివచ్చే శీర్షికలు ఎన్నో ఉంటాయి.


'బాంక్ ఎక్కవుంటింగ్' అనే బుల్లెటిన్‌లో బాంకులతో సంబంధం కలవారందరికీ ఉపయోగకరంగా ఉండే శీర్షికలు ఉంటాయి.


పయిరెండు పత్రికలూ బొంబాయినుంచి నెల నడుతున్నాయి. ప్రచురణస్థానం, 6వ అంతస్తు, స్టేడియం హవుస్, వీర్‌నారిమాన్ రోడ్, బొంబాయి—20.


(ఉ. వ.)


Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1; and at Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada 3. Editor : S. Sambhu Prasad.









నేను ఇంతవరకు లక్ష అబద్ధాలు చెప్పానంటే నమ్మండి!!
పాపంసార్ అబద్ధాలు చెప్పరు!!


రండిసార్! రండి
ఇప్పుడొద్దులే రేపొస్తా



Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA.